www.andhrajyothy.com
పేజీలు: 12
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 139
సోమవారం | 2-9-2024
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: అమావాస్య పూర్తి; నక్షత్రం: మఖ రా. 12.20 తదుపరి పుబ్బ; వర్జ్యం: ఉ. 11.04-12.50, దుర్ముహూర్తం: మ. 12.39-1.28, మ. 3.07-3.56; అమృతఘడియలు: రా. 9.40-11.26; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.04; సూర్యాస్తమయం: 6.24
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వణికిస్తున్న ప్రకాశం బ్యారేజీ



10 లక్షల క్యూసెక్కుల ప్రవాహం

రెండో ప్రమాద హెచ్చరిక

2009లో 11.10 లక్షలే ఇప్పటిదాకా రికార్డు

అటు శ్రీశైలం, సాగర్‌కూ భారీ వరద

విలయవాడ!

బెజవాడను ముంచేసిన బుడమేరు

8 అడుగుల ఎత్తున వరద నీరు

15 డివిజన్లపై ప్రభావం

24 కాలనీలు జలమయం

25 వేల ఇళ్లు నీట మునక

2.50 లక్షల మంది బాధితులు

నీట మునిగిన కార్లు, బైకులు

ట్రాక్టర్లలో సురక్షిత ప్రాంతాలకు జనం

సమీప గ్రామాలపైనా వరద పడగ

వేలాది ఎకరాల్లో మునిగిన పంటలు

మహోగ్ర రూపంతో కలవరపెడుతున్న కృష్ణమ్మ

2009 తర్వాత మరోసారి భారీ ప్రవాహం

ప్రకాశం బ్యారేజీ వద్ద 9 లక్షల క్యూసెక్కుల వరద

పది లక్షలు దాటే చాన్స్.. యంత్రాంగం అప్రమత్తం

బుడమేరు వరద ముంపులో విజయవాడలోని జక్కంపూడి వైఎస్సార్ కాలనీ



బెజవాడ గజగజ!

బుడమేరు బీభత్సం నగరంపై జలఖడ్గం

ఊరూ ఏరూ ఏకమయ్యాయి. కనుచూపు మేరా నీరే విస్తరించింది. బుడమేరు కన్నెర్ర చేసింది. 'బెజవాడ దుఃఖదాయిని' అనే పేరును చాలా దశాబ్దాల తర్వాత గుర్తు చేసింది. కనీవినీ ఎరుగని రీతిలో విజయవాడ నగరాన్ని ముంచెత్తింది. లక్షలాదిమందిని వరద బాధితులుగా మిగిల్చింది. అటు కృష్ణమ్మ ఉగ్ర రూపం... ఇటు బుడమేరు కన్నెర్రతో బెజవాడ బెంబేలెత్తింది.

వాయుగుండ ప్రభావంతో గురువారం రాత్రి నుంచే చిటపట చినుకులు మొదలయ్యాయి. శుక్రవారం రాత్రి నుంచి ఏకాధాటిగా కురిసిన కుండపోతకు విజయవాడ జలవాడగా మారింది. శనివారం సాయంత్రానికి వర్షం ఉపశమించడంతో... నగరం కాస్త ఊపిరి పీల్చుకుంది. అంతలోనే... నేనున్నానంటూ బుడమేరు పొంగి పొర్లింది. కృష్ణా పరీవాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు హోరెత్తిన చిన్నా పెద్ద వాగులను కలుపుకొని పూనకమొచ్చినట్లుగా విరుచుకుపడింది. అప్పటికే కృష్ణమ్మ భారీగా ప్రవహిస్తుండటంతో.. బుడమేరు చానల్ నుంచి నదిలోకి నీరు కలిసే అవకాశం

మిగతా 12వ పేజీలో...

చిన్నాపెద్ద ఏర్లను కలుపుకొని బుడమేరు మహోగ్ర రూపం

జలావాసాలుగా మారిన విజయవాడ కాలనీలు

నేడు రాష్ట్రానికి 40 పవర్‌బోట్ల రాక

సహాయ చర్యలకు 6 హెలికాప్టర్లు కూడా..

సీఎం చంద్రబాబుకు సమాచారమిచ్చిన కేంద్రం

జలదిగ్బంధంలో జిల్లాలు

కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఏలూరు, తూర్పులో వరదలు.. నీట మునిగిన లంక గ్రామాలు

పునరావాస కేంద్రాల్లో వందల మంది

రాష్ట్రవ్యాప్తంగా 15 మంది దుర్మరణం

భారీ వర్షాలకు పలు రైళ్ల రద్దు

హైదరాబాద్‌కు బస్సులు బంద్

సాయంత్రం నుంచి గుంటూరు మీదుగా..

సోమవారం కూడా ప్రధాన మార్గంలో కష్టమే

నేడు విద్యా సంస్థలకు సెలవు

సమగ్ర కథనాలు 10, 11, 12లో



ప్రాణరక్షణే లక్ష్యం

నష్టపోయిన ప్రతి ఒక్కరికీ సాయం

విపత్తు సహాయం 5 లక్షలకు పెంపు

25 కిలోల బియ్యం, కిలో చక్కెర

ఐదు రకాల నిత్యావసరాలు కూడా

50 ఏళ్లలో ఎప్పుడూ పడనంత వాన

ఒక్క రోజే రాష్ట్రవ్యాప్తంగా 28.5 సెంమీ

గత ఐదేళ్లలో కాలువలపై శ్రద్ధ పెట్టలేదు

గండ్లు కూడా పూడ్చలేదు

తప్పుడు పనులు చేసిన పార్టీయే

ఇప్పుడు గగ్గోలు పెడుతోంది: సీఎం

బాబుకు ప్రధాని ఫోన్!

ఇదీ బాధ్యత!

ఐదేళ్లూ మరిచిన జగన్.. గుర్తుచేసిన బాబు

బుడమేరు విపత్తుపై తక్షణ స్పందన

ఉదయం నుంచే ముఖ్యమంత్రి సమీక్ష

తక్షణమే రంగంలోకి ముగ్గురు మంత్రులు

ఆపై స్వయంగా బోటులో సీఎం పర్యటన

సహాయక చర్యల ప్రత్యక్ష పర్యవేక్షణ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఒక విపత్తు తలెత్తింది! యంత్రాంగం కదలాలి. సహాయం తరలాలి. ప్రజల్లో భరోసా కల్పించాలి! ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులు బాధితుల్ని స్వయంగా కలిసి, కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలి. అప్పుడే సత్వర ఉపశమనం లభిస్తుంది. ఇదీ... ఒక ప్రభుత్వం బాధ్యత! ఐదేళ్ల తర్వాత ఇప్పుడు ఇది కనిపించింది. ఆదివారం విజయవాడలో బుడమేరు సృష్టించిన విలయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర మంత్రివర్గ సహచరులు ఆగమేఘాల మీద స్పందించారు. చంద్రబాబు ఆదివారం ఉదయం నుంచే దీనిపై దృష్టి సారించారు. అధికారులకు, మంత్రులకు బాధ్యతలు అప్పజెప్పారు. వారిని నేరుగా రంగంలోకి దించారు. అంతేకాదు... ఆయనే స్వయంగా వరద ప్రభావిత

మిగతా 2వ పేజీలో...

బుడమేరు వరద ముంపు ప్రాంతాల్లో మంత్రులతో కలిసి పడవలో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు



వరద ప్రభావిత ప్రాంతాల్లో ట్రాక్టరులో పర్యటిస్తున్న మంత్రులు అనిత, రవీంద్ర, నారాయణ తదితరులు



వైభవంగా నందమూరి బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవ వేడుక

తరలివచ్చిన తారాలోకం

ప్రత్యేక ఆకర్షణగా చిరంజీవి, కమల్‌హాసన్, శివరాజ్‌కుమార్

ఏపీ ప్రభుత్వం తరపున హాజరైన సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్



సినిమా పేజీలో..

స్వర్ణోత్సవ వేడుకల్లో బాలకృష్ణతో చిరంజీవి, వెంకటేశ్

మీ టూపై నివేదికను బయటపెట్టండి

2019 నాటి కమిటీ రిపోర్టును వెల్లడించండి

తద్వారా టాలీవుడ్‌లో మహిళలకు మేలు

తెలంగాణ ప్రభుత్వాన్ని కోరిన నటి సమంత

మంచు లక్ష్మి, చిన్మయి, సుమ మద్దతు



3 నెలల్లో వందేభారత్ స్లీపర్ రైళ్లు



రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

రైలు బోగీల నమూనా ఫొటోలు విడుదల

2

పాలిస్తూనే ప్రాణం తీసింది!

- నవజాత శిశువును గొంతు నులిమి చంపిన తల్లి
- నాలుగో సంతానంగా మళ్లీ ఆడపిల్లే పుట్టడంతో దారుణం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: దేశ రాజధాని ఢిల్లీలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ముక్కుపచ్చలారని నవజాత శిశువును కన్న తల్లే చంపేసింది. నాలుగో సంతానంగా మళ్లీ ఆడపిల్లే పుట్టడంతో అసహనానికి గురైన ఆ మహిళ (28) పాలిస్తూనే ఆ శిశువును గొంతు నులిమి ప్రాణం తీసిందని పోలీసులు తెలిపారు. ఆ శిశువు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. తల్లిపై హత్య కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆరు రోజుల వయసున్న ఆడ శిశువు కనిపించడంలేదని పశ్చిమ ఢిల్లీలోని ఖ్యాలా పోలీసు స్టేషన్‌కు శుక్రవారం ఉదయం ఫోన్ వచ్చింది. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లారు. తల్లితో మాట్లాడగా.. రాత్రి తన బిడ్డకు పాలిచ్చిన తర్వాత పక్కనే పడుకోబెట్టుకున్నానని, లేచి చూసే సరికి తన పాప పక్కన లేదని పేర్కొంది. పోలీసులు సీసీటీవీ కెమెరాలతో పాటు చుట్టుపక్కల ఇళ్ల వద్ద తనిఖీలు చేపట్టగా సమీపంలోని ఓ ఇంటి పైకప్పుపై సంచిని గుర్తించారు. అందులోనే ఆ శిశువు విగతజీవిగా పడి ఉంది. వెంటనే ఆస్పత్రికి తరలించినప్పటికీ ప్రాణాలు పోయినట్టు వైద్యులు తెలిపారు. తల్లి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో ఆమెను పోలీసులు ప్రశ్నించడం మొదలుపెట్టారు. దీంతో తానే తన బిడ్డను చంపినట్టు ఒప్పుకుంది.

వాణిజ్య సిలిండర్ ధర రూ.39 పెంపు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: చమురు సంస్థలు వాణిజ్య వంట గ్యాస్ సిలిండర్ ధరను మరోసారి పెంచాయి. అంతర్జాతీయ చమురు ధరల సరళికి అనుగుణంగా నెలవారీ చేసే సవరణల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు ప్రకటించాయి. హోటళ్లు, రెస్టారెంట్లలో వినియోగించే వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను ఒకేసారి రూ.39 పెంచాయి. ఆగస్టు 1న వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను రూ.6.50పై పెంచిన చమురు సంస్థలు ఈ సారి మరింత భారం మోపాయి. తాజా నిర్ణయంతో 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర హైదరాబాద్‌లో రూ.1919కు పెరిగింది. ఇక, జూలై, ఆగస్టు నెలల్లో వరుసగా 1.2%, 2% మేర విమాన ఇంధన ధరలను పెంచిన చమురు సంస్థలు తాజా సవరణలో 4.6 శాతం తగ్గించాయి. సవరించిన ధర ప్రకారం.. ఏటీఎఫ్ కిలో లీటరుకు రూ.4,495.50పై తగ్గి రూ.93,480.22పై కు చేరింది.

శంకర్ ఐఏఎస్ అకాడమీకి రూ.5 లక్షలు ఫైన్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1 : కేంద్ర వినియోగదారుల రక్షణ సంస్థ(సీసీపీఏ) 2022 సివిల్ సర్వీస్ పరీక్షకు సంబంధించి తప్పుదోవ పట్టించేలా ప్రకటన ఇచ్చినందుకు శంకర్ ఐఏఎస్ అకాడమీకి రూ.5 లక్షల జరిమానా విధించింది. 2022 సివిల్ సర్వీసు పరీక్షకు సంబంధించి ఆ అకాడమీ ఇచ్చిన ప్రకటనలో ఆల్ ఇండియా స్థాయిలో ఎంపికైన 933 మందిలో 336 మంది తమ అకాడమీలో శిక్షణ పొందారని, 40 మంది టాప్ 100లో ఉన్నారని పేర్కొన్నారు. దీనిపై సీసీపీఏ విచారించగా సివిల్స్‌లో ఎంపికైన అభ్యర్థులు శంకర్ ఐఏఎస్ అకాడమీలో ఎంపిక చేసుకున్న కోర్సులకు సంబంధించి ఇచ్చిన సమాచారం తప్పని తేలింది.



వడోదర మొసళ్ల దడ

ఇళ్ల పైకప్పులు.. పార్కులు.. రోడ్లు.. ఎక్కడంటే అక్కడ మొసళ్లు..! ఒక్కోటి 10 నుంచి 15 అడుగులు..! బయటకు రావాలంటేనే భయం..! ఇదీ ప్రస్తుతం గుజరాత్‌లోని వడోదర ప్రజల పరిస్థితి. ఇటీవలి వర్షాలకు నగరంలోకి వందలాది మొసళ్లు కొట్టుకుని వచ్చాయి! అటవీశాఖ అధికారులు 24 మొసళ్లను పట్టుకున్నారు.

తీర్పు వచ్చే సరికి తరం మారుతోంది

వాయిదాల సంస్కృతిని మార్చండి

- కోర్టు అంటేనే సామాన్యుల్లో భయం
- దీనిపై అధ్యయనం చేయండి
- న్యాయ వ్యవస్థకు ముర్ము హితవు



జిల్లా స్థాయి న్యాయవ్యవస్థ జాతీయ సదస్సులో జస్టిస్ చంద్రచూడ్‌తో ముర్ము

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: కక్షిదారులకు సత్వర న్యాయం అందాలంటే కోర్టుల్లోని 'వాయిదాల సంస్కృతి'ని మార్చాల్సి ఉందని ఆదివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభిప్రాయపడ్డారు. దీనిపై తొలుత దృష్టి పెట్టాలని న్యాయవ్యవస్థకు సూచించారు. ఇక్కడ రెండు రోజుల పాటు జరిగిన జిల్లా స్థాయి న్యాయవ్యవస్థ జాతీయ సదస్సు ముగింపు ఉత్సవంలో ఆమె ప్రసంగించారు. పెండింగ్ కేసులు 'మనందరికీ' పెద్ద సవాలుగా మారాయని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలంటే తొలుత కేసుల విచారణను వాయిదా వేసే విధానంలో మార్పులు రావాలని చెప్పారు. అత్యాచారం వంటి కేసుల్లోనూ తీర్పులు ఆలస్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. "అత్యాచారం వంటి కేసుల్లోనూ తీర్పులు వచ్చేసరికి తరం మారుతోంది. న్యాయ ప్రక్రియలో సున్నితత్వం లోపించిందని సామాన్యులు అనుకుంటున్నారు" అని రాష్ట్రపతి వ్యాఖ్యానించారు. గ్రామాల్లోని ప్రజలు న్యాయాలయాలను దేవాలయాలుగా భావిస్తున్నారని అన్నారు. "దేవుని ఇంట్లో ఆలస్యం జరుగుతుందేమోగానీ, అన్యాయం మాత్రం జరగదని నమ్ముతుంటారు. కానీ ఈ అలస్యం ఎంత కాలం? మనమంతా దీనిపై ఆలోచించాలి" అని హితవు చెప్పారు. "కొందరికి న్యాయం లభించే సమయానికి వారి ముఖాల్లో నవ్వులు కనిపించడం లేదు. కొందరి జీవితాలు అంతమవుతున్నాయి. దీనిపై మనమంతా దృష్టి పెట్టాలి" అని అన్నారు. కోర్టు రూముల తీరుపైనా రాష్ట్రపతి అన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కోర్టు రూముల సెట్టింగ్‌ను చూడగానే సామాన్యుల్లో ఒత్తిడి పెరుగుతుందని అన్నారు. దీనికి 'నల్ల కోర్టు లక్షణం' (బ్లాక్ కోర్ట్ సిండ్రోం) అన్న పేరు పెట్టారు. దీనిపై అధ్యయనం జరగాలని సూచించారు. న్యాయాధికారుల పోస్టుల్లో మహిళల సంఖ్య పెరుగుతుండడంపై హర్షం వ్యక్తం చేశారు.

మహిళలకు సౌకర్యాలేవీ: సీజేఐ

సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ప్రసంగిస్తూ జిల్లా స్థాయి కోర్టుల్లో మహిళా అధికారులు, న్యాయవాదులకు తగిన సౌకర్యాలు లేవని చెప్పారు. కేవలం 6.7శాతం కోర్టుల్లోనే మహిళలకు కనీస సౌకర్యాలు ఉన్నాయని అన్నారు. కొన్ని రాష్ట్రాల్లో 60-70 శాతం మేర మహిళలను న్యాయాధికారులుగా భర్తీ చేస్తున్నారని, అలాంటప్పుడు వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పించాల్సి ఉందని చెప్పారు.

అత్యాచారాలు సర్వసాధారణం అంటారా?

కపిల్ సిబల్‌పై ఉపరాష్ట్రపతి విమర్శలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: కోల్‌కతాలో ట్రైనీ డాక్టరుపై అత్యాచారం చేసి, హత్య చేసిన సంఘటనను తక్కువ చేసి చూపారంటూ సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్‌ను ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తప్పుపట్టారు. ఆ దుర్ఘటనపై ప్రజానీకమంతా సిగ్గుతో తలవంచుకున్న సమయంలో కొందరు మాత్రం పుండుపై కారం చల్లారని విమర్శించారు. కోల్‌కతా సంఘటనపై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుని హోదాలో సిబల్ వ్యాఖ్యానిస్తూ 'అది దుర్బుద్ధికి సూచిక' అని పేర్కొన్నారు. అలాంటివి సాధారణంగా జరుగుతుంటాయన్నారు. దీనినే ఉపరాష్ట్రపతి తప్పుపట్టారు. ఆదివారం రిషికేష్ ఎయిమ్స్‌లో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ.. సిబల్ తమ ఆలోచనలను మార్చుకొని బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలను రాజకీయ కోణంలో చూడకూడదని చెప్పారు. పని స్థలాల్లో వైద్యులకు రక్షణ కల్పించాల్సి ఉందని అన్నారు.



3 నెలల్లో వందేభారత్ స్లీపర్ రైళ్లు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: వందేభారత్ స్లీపర్ ట్రైన్ కోసం బెంగళూరులోని భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్(బీఈఎంఎల్) కంపెనీలో తయారు చేస్తున్న బోగీల నమూనా ఫొటోలను కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆదివారం విడుదల చేశారు. ఈ రైలు మూడు నెలల్లో ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. రైలులో మొత్తం 16 బోగీలు(823 బెర్తులు) ఉంటాయని చెప్పారు. మధ్య తరగతిని దృష్టిలో పెట్టుకొని ఈ రైలును రూపొందిస్తున్నారని, టికెట్ రేట్లు రాజధాని ఎక్స్‌ప్రెస్ స్థాయిలో ఉంటాయని మంత్రి వివరించారు. వందేభారత్ స్లీపర్ రైలు బోగీల్లో ఆక్సిజన్ సరఫరా, వైరస్ వ్యాప్తిని నియంత్రించే వ్యవస్థలతో పాటు దివ్యాంగుల కోసం ప్రత్యేకమైన టాయిలెట్లు, వేడి నీటి సదుపాయం, అగ్ని నిరోధక వ్యవస్థ.. ఇలా ఇంకా చాలా వసతులు ఉంటాయని చెప్పారు. కవచ్ వ్యవస్థ కూడా ఇందులో ఉంటుందన్నారు.

హమాస్‌ను అంతమొందించాల్సిందే

- అమెరికా ఉపాధ్యక్షురాలు కమలాహ్యారిస్



టెల్ అవీవ్, సెప్టెంబరు 1: గాజాలో ఆరుగురు ఇజ్రాయెలీ బందీల మృతదేహాలను గుర్తించినట్లు ఆ దేశ సైన్యం ఆదివారం ప్రకటించిన వెంటనే.. అమెరికా ఉపాధ్యక్షురాలు కమలాహ్యారిస్ హమాస్ ఉగ్రవాద సంస్థపై కీలక వ్యాఖ్యలు చేశారు. హమాస్‌ను అంతమొందించాల్సిందేనని ఆమె ఉద్ఘాటించారు. గాజాను నియంత్రించే అధికారం హమాస్‌కు ఉండకూడదని తేల్చిచెప్పారు. మృతిచెందిన బందీల్లో ఇజ్రాయెల్ సంతతికి చెందిన అమెరికన్ గోల్డ్‌బెర్గ్ పోలిన్ ఒకరు. దీనిపై కమలాహారిస్ సీరియస్ అయ్యారు. "హమాస్ అనేది ఓ దుష్టశక్తి వంటిది. అది ఉగ్రవాద సంస్థ. ఈ హత్యలతో హమాస్ అమెరికా పౌరుల రక్తాన్ని కళ్లజూసింది. ప్రపంచంలో ఎక్కడున్నా.. అమెరికా పౌరుల భద్రతే మా ప్రథమ లక్ష్యం. హమాస్‌ను అంతమొందించాల్సిందే" అని ఆమె వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ కూడా ఇజ్రాయెల్-హమాస్ యుద్ధానికి ఓ ముగింపు రావాలని ఆకాంక్షించారు. మరోవైపు నెతన్యాహు తీరువల్లే బందీల హత్యలు జరుగుతున్నాయంటూ.. ఆయనకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ పౌరులు నిరసనలకు పిలుపునిచ్చారు.

కిమ్‌కు 24 గుర్రాలు బహుమానంగా ఇచ్చిన పుతిన్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్‌కు 24 మేలిమి జాతి గుర్రాలను బహుమానంగా ఇచ్చారు. ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు ఆయుధాలను సరఫరా చేసినందుకు గాను కృతజ్ఞతగా ఆయన వీటిని బహుకరించారు. ఓర్లోవ్ ట్రాట్టర్ జాతికి చెందిన ఈ గుర్రాల్లో .. 19 స్టాలియన్లు(మగ) కాగా మరో 5 మేర్(ఆడ) గుర్రాలుగా తెలుస్తోంది. రెండేళ్ల క్రితం కూడా ఇదే జాతికి చెందిన 30 గుర్రాలను ఉత్తరకొరియాకు పుతిన్ బహుమతిగా ఇచ్చారు.

లోకం తీరు



బెంగాల్‌లో మరో దారుణం.. నర్సుపై లైంగిక వేధింపులు

- రాత్రి విధుల్లో ఉన్న నర్సు.. సెలైన్
- ఎక్కిస్తుండగా వేధించిన రోగి అబ్బాస్

కోల్‌కతా, సెప్టెంబరు 1: పశ్చిమబెంగాల్ రాష్ట్రం బీర్భం జిల్లాలోని ప్రభుత్వాస్పత్రిలో విధుల్లో ఉన్న నర్సుతో ఓ రోగి అసభ్యంగా ప్రవర్తించడం కలకలం రేపుతోంది. అబ్బాస్ ఉద్దీన్ అనే వ్యక్తి జ్వరంతో బాధపడుతుండడంతో శనివారం రాత్రి కుటుంబ సభ్యులు ఇలాంబజార్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతనికి సెలైన్ ఎక్కించడానికి వార్డుకు తరలించారు. అక్కడ నర్సు సెలైన్ ఎక్కిస్తుండగా అబ్బాస్ ఆమెతో అనుచితంగా ప్రవర్తించాడు. తాకరాని చోట తాకడంతో పాటు అసభ్య పదజాలాన్ని ఉపయోగించాడు. "ఆ రోగి నన్ను లైంగికంగా వేధించాడు. దుర్భాషలాడాడు. చాలా భయమేసింది" అని నర్సు వాపోయారు. ఈ ఘటనతో ఆస్పత్రిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అబ్బాస్‌ను అరెస్టు చేశారు. మరోవైపు, హౌరా జిల్లాలోని ప్రభుత్వాస్పత్రిలో ఓ ల్యాబ్ టెక్నీషియన్ సిటీ స్కాన్ కోసం వచ్చిన 13 ఏళ్ల బాలికను వేధించాడు. పోలీసులు నిందితుడ్ని అదుపులోకి తీసుకొన్నారు.

జబల్‌పూర్ నుంచి హైదరాబాద్ వస్తున్న 'ఇండిగో'కు బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: జబల్‌పూర్ నుంచి హైదరాబాద్ బయలుదేరిన ఇండిగో విమానం నెంబరు 6ఈ 7308కి ఆదివారం బాంబు బెదిరింపు వచ్చింది. దాంతో దాన్ని నాగ్‌పూర్ మళ్లించి అత్యవసరంగా అక్కడ కిందికి దించివేశారు. క్షుణ్ణంగా తనిఖీలు జరిపిన అనంతరం అది నకిలీ హెచ్చరిక అని తేలింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి ఇండిగో సంస్థ క్షమాపణలు చెప్పింది. మరోవైపు, కోల్‌కతా నుంచి బెంగళూరుకు శుక్రవారం రాత్రి బయలుదేరిన మరో ఇండిగో విమానం ఇంజినులో సాంకేతిక లోపం తలెత్తడంతో వెంటనే దాన్ని దింపివేశారు.



విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు ఉరకలేస్తున్న కృష్ణమ్మ

గోదావరి ఉధృతి

- పోలవరం స్పిల్‌వే నుంచి దిగువకు
- 5.75 లక్షల క్యూసెక్కుల ప్రవాహం

పోలవరం సెప్టెంబరు 1: పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నీటిమట్టం ఆదివారం అనూహ్యంగా పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఉపనదులైన మంజీర, కిన్నెరసాని, ప్రవర, ప్రాణహిత, శబరి, సీలేరు నదులు, కొండవాగులు పొంగి గోదావరిలో కలుస్తుండడంతో వరద పెరుగుతోంది. ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 5,75,264 క్యూసెక్కుల జలాలు దిగువకు ప్రవహిస్తున్నాయి. అధికారులు స్పిల్‌వే 48 గేట్లు ఎత్తారు. స్పిల్‌వే ఎగువన 30.420 మీటర్లు, స్పిల్‌వే దిగువన 21.400 మీటర్లు నీటిమట్టం నమోదయినట్లు ప్రాజెక్టు ఈఈలు పి వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.



పోలవరం స్పిల్‌వే వద్ద వరద గోదావరి

వణికిస్తున్న ప్రకాశం బ్యారేజీ

10 లక్షల క్యూసెక్కుల ప్రవాహం

- 2009లో 11.10 లక్షలే ఇప్పటిదాకా రికార్డు

విజయవాడ/విజయపురి సౌత్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదిపై ప్రకాశం బ్యారేజీ వరద ఉధృతి తీవ్రంగా ఉంది. గంట గంటకు వరద పెరుగుతోంది. ఆదివారం సాయంత్రానికి బ్యారేజీ వద్ద 9.02 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉండడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అర్ధరాత్రి సమయానికి వరద ప్రవాహం 10 లక్షల క్యూసెక్కులు దాటింది. 2009 అక్టోబరు 5వ తేదీ రాత్రి 11 గంటలకు అత్యధికంగా 11.10,404 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బ్యారేజీ చరిత్రలో ఇదే రికార్డు. దానికి ముందు 1998లో అత్యధికంగా 9.32 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు. కాగా.. ఎగువన శ్రీశైలం, నాగార్జున సాగర్‌లోకి పెద్దఎత్తున ప్రవాహం వస్తోంది. నాగార్జునసాగర్ నుంచి 6,02,301 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగడంతో నాగార్జున సాగర్ ప్రాజెక్టు, ప్రకాశం బ్యారేజీ మధ్యలో మరో 3,00,275 క్యూసెక్కులు కలుస్తోంది. బ్యారేజీకి భారీ ప్రవాహం మరో 48 గంటల పాటు కొనసాగే అవకాశాలున్నాయి. దీంతో నదీ తీర ప్రాంత ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు.

నేడు రాష్ట్రానికి 40 పవర్‌బోట్లు

- సహాయ చర్యలకు 6 హెలికాప్టర్లు కూడా..

అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో సహాయ చర్యలకు సహకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కోరారు. ఆదివారం రాత్రి కేంద్ర మంత్రి అమిత్‌షాతో పాటు కేంద్ర హోం సెక్రటరీతో సీఎం ఫోన్‌లో మాట్లాడారు. వరద ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం అత్యవసరంగా పవర్ బోట్లు రాష్ట్రానికి పంపాలన్నారు. దీంతో 6 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ఇతర రాష్ట్రాల నుంచి తక్షణమే ఏపీకి పంపుతున్నట్లు హోంశాఖ సెక్రటరీ సీఎంకు సమాచారం ఇచ్చారు. మొత్తం 40 పవర్ బోట్లు, 6 హెలికాప్టర్లను రాష్ట్రానికి పంపుతున్నట్లు తెలిపారు. వాయు మార్గంలో మరో నాలుగు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రాష్ట్రానికి పంపుతున్నట్లు చెప్పారు. ఇవన్నీ సోమవారం ఉదయంలోపు విజయవాడ చేరుకుంటాయని తెలిపారు.

ఒకేరోజు 3 లక్షల మందికి 'అక్షయపాత్ర'భోజనం!

మంగళగిరి, సెప్టెంబరు 1: గుంటూరు జిల్లా మంగళగిరి మండలంలోని 'అక్షయపాత్ర' సంస్థ రికార్డు సృష్టించింది. సీఎం ఆదేశాల మేరకు ఒకేరోజు మూడు లక్షల మందికి కొద్ది గంటల్లోనే భోజనం ప్యాకెట్లను సిద్ధం చేసి 6ంపింపించింది. అక్షయపాత్ర చరిత్రలో ఇదే అతిపెద్ద రికార్డని చెబుతున్నారు.

ఇదీ బాధ్యత!

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాల్లో బోటులో పర్యటించారు.

వరద నీటిలో తిరుగుతూ...

వరదలకు తీవ్రంగా ప్రభావితమైన సింగ్ నగర్‌లో ఆదివారం సీఎం చంద్రబాబు స్వయంగా బోటులో తిరిగి పరిస్థితులు సమీక్షించారు. బాధితులతో మాట్లాడారు. ప్రజలకు పాలు, ఆహారం, తాగునీరు, కొవ్వొత్తులు, టార్చ్‌లు అన్నీ వెంటనే అందించాలని అధికారులను ఆదేశించారు. ఖర్చు ఎంతైనా సరే వెనుకాడవద్దని స్పష్టం చేశారు. సాయంలో ప్రతి రెండు గంటలకు మార్పు కనిపించాలన్నారు. అక్షయ పాత్ర నుంచి, ఇతర ఏజెన్సీల నుంచి సరఫరా చేయగలిగిన ఆహారం తెప్పించాలన్నారు. అధికారులు, మంత్రులకు ఎవరి బాధ్యతలు వారికి అప్పగించి.... వాటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని ఆదేశించారు. సింగ్‌నగర్ వద్ద గండి పూడ్చడంపై అధికారులతో మాట్లాడారు. బాధితులందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. దీంతో మంత్రులు కొల్లు రవీంద్ర, అనిత, నారాయణ, ఇతర ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. ట్రాక్టర్‌పై వరద ప్రభావిత ప్రాంతాల్లో తిరిగి, బాధితులను పరామర్శించి వారికి భరోసానిచ్చారు.

అన్ని పనులూ పక్కన పెట్టి...

షెడ్యూల్ ప్రకారం శనివారం మధ్యాహ్నం చంద్రబాబు హైదరాబాద్ వెళ్లాలి. తన బావమరిది, టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ 50 ఏళ్ల సినిమా వేడుకలో సీఎం పాల్గొనాల్సి ఉంది. వరదల నేపథ్యంలో ఇతర అన్ని కార్యక్రమాలు పక్కనపెట్టి విజయవాడలోనే ఉండిపోయారు. ఉండవల్లిలో తన నివాసానికి వెళ్లే అవకాశమున్నప్పటికీ... పరిస్థితులు మెరుగుపడేదాకా విజయవాడ కలెక్టరేట్‌లోనే ఉండి, ఎప్పటికప్పుడు సమీక్షించాలని నిర్ణయించుకున్నారు. డీజీపీ ద్వారకా తిరుమలరావు శనివారం మధ్యాహ్నం హైదరాబాద్ వెళ్లారు. కానీ, వరదలపై సీఎం సమీక్ష ఉండటంతో ఆదివారం ఉదయం రోడ్డుమార్గంలో విజయవాడకు తిరిగొచ్చారు.

నాడు జగన్ రెడ్‌కార్పెట్ పరామర్శలు

జగన్ సీఎంగా ఉన్నప్పుడు చాలా అరుదుగా తాడేపల్లి ప్యాలెస్ నుంచి అడుగు బయటపెట్టేవారు. ప్రకృతి విపత్తుల సమయంలోనూ అంతే! అంతా సర్దుకున్నాక, బురద ఎండిపోయి రోడ్లు శుభ్రమయ్యాక, జనజీవనం కాస్తమెరుగైన తర్వాత ఓవారం రోజులకి తీరిగ్గా పరామర్శకు బయల్దేరేవారు. పోనీ అప్పుడైనా నేరుగా జనంలోకి వెళ్లడం, పొలాల్లోకి వెళ్లి దెబ్బతిన్న పంటల్ని పరిశీలించడం వంటివి చేసిన దాఖలాలు లేవు. 2023 డిసెంబరులో వచ్చిన తుఫానుతో బాపట్ల, తిరుపతి ఇతర ప్రాంతాల్లో రైతులు కుదేలయ్యారు. త్వరలో ఎన్నికలు ఉండటంతో కాబోలు... ఎన్నడూ లేని విధంగా విపత్తు తలెత్తిన మూడు రోజులకే తాడేపల్లి నుంచి కదిలారు. అప్పుడు కూడా బారికేడ్ల అవల ఆమడ దూరంలో ఉన్న వరద బాధితులను నవ్వుతూ పరామర్శించారు. ఇది చాలదన్నట్టు ఏదో వేడుకకు వస్తున్నట్టుగా రెడ్ కార్పెట్‌పై నడిచారు. అంతకుముందు 2021 నవంబరు 21న అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయింది. ఊళ్లకు ఊళ్లే తుడిచిపెట్టుకుపోయాయి. భారీగా ప్రాణనష్టం జరిగింది. అప్పుడు సీఎంగా ఉన్న జగన్ తీరిగ్గా డిసెంబరు రెండో తేదీన పరామర్శకు వెళ్లారు. చెప్పేదేముంది అప్పుడు కూడా అవే నవ్వులు, అవే బారికేడ్లు, అవే పరదాలు! ఇప్పుడు వరదలతో రాష్ట్రం అతలాకుతలమైపోతుంటే జగన్ ఎక్కడా కనిపించలేదు. జగన్ రోత మీడియా మరింత వికృతరూపం ప్రదర్శించింది. ఒక వైపు బుడమేరు తాకిడికి విజయవాడ నగరంలో అనేక కాలనీలు నీటమునగగా... చంద్రబాబు ఇల్లు మునిగిపోయిందంటూ ఫేక్ ప్రచారం చేసింది.



విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లో వరద ప్రభావిత ప్రాంతంలో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు

మంత్రులంతా విజయవాడ రావాలి

- కలెక్టర్లూ... విస్తృతాధికారాలు వాడండి
- ఒక్కో డివిజన్‌కు మంత్రి, సీనియర్ అధికారికి బాధ్యతలు: బాబు

అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వరద బాధితులకు సహాయ చర్యల విషయంలో జాప్యాన్ని సహించేది లేదని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. ప్రభుత్వానికి ఉన్న విస్తృత అధికారాలను వినియోగించి, కలెక్టర్లు జిల్లాల్లో వాహనాలు తీసుకెళ్లి బోట్లు తరలించాలని ఆదేశించారు. బాధితులకు ఆహారాన్ని తయారు చేయించి అందించే బాధ్యతలను పార్టీ ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావులకు అప్పగించారు. సహాయ చర్యల్లో పాల్గొనేందుకు మంత్రులందరూ విజయవాడ రావాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఒక్కో డివిజన్‌కు ఒక్కో సీనియర్ అధికారి, ఒక్కో మంత్రికి బాధ్యత అప్పగించారు.

ముంపు ముంగిట రాష్ట్రం!

నీటి నిర్వహణపై జగన్ నిర్లక్ష్యం.. ఏపీకి శాపం

- తెగుతున్న వాగులు, చెరువులు.. గండ్లు పడి ఊళ్లకు ఊళ్లు మునక

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

భారీవర్షాలు, వరదలతో రాష్ట్రం విలవిలలాడుతోంది. గడచిన ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం నీటి యాజమాన్య నిర్వహణను గాలికొదిలేసిన ఫలితాన్ని రాష్ట్ర ప్రజలు ఇప్పుడు ఎదుర్కొంటున్నారు. ఆయన అనుయాయులు నదీగర్భాల్లో, చెరువులు, వాగులు, వంకల్లో ఇసుకను ఎడాపెడా తవ్వేశారు. జగన్ హయాంలో గేట్ల నిర్వహణకు నిధుల్విలేదు. కనీసం గ్రీజు కూడా పూయలేని దుస్థితి. ఈ నేపథ్యంలో సాగునీటి యాజమాన్య విధానాలపై చంద్రబాబు ప్రభుత్వం దృష్టి సారించి యుద్ధప్రాతిపదికన నిర్వహణ పనులు చేపట్టాలని జల వనరుల నిపుణులు సూచిస్తున్నారు. నదుల కరకట్టలు, కాలువలు, చెరువుల గట్లను పటిష్ఠపరచడం వంటివి అత్యవసరంగా చేయాలని చెబుతున్నారు.

నిండుగా నీటివనరులు..

రాష్ట్రంలోని జలాశయాలన్నీ కళకళలాడుతున్నాయి. చిన్న నీటివనరులూ నిండాయి. ఈ సీజన్‌లో సాధారణం కంటే 25 శాతం అధికంగా వర్షం పడింది. మైనర్ ఇరిగేషన్ కింద 38,445 చెరువుల్లో 76.54 టీఎంసీల నీరుంది. రాష్ట్రంలోని చిన్నా పెద్దా 108 రిజర్వాయర్లలో 732.64 టీఎంసీల జలాలు నిల్వ ఉన్నాయి. ప్రధాన జలాశయాల్లో పూర్తి నిల్వ సామర్థ్యం 865.64 టీఎంసీలకు గాను 79 శాతం మేర 682.72 టీఎంసీలు ఉన్నాయి. మధ్యతరహా ప్రాజెక్టుల్లో 115 టీఎంసీలకుగాను .. 43 శాతం మేర 50 టీఎంసీల జలాలు ఉన్నాయి. ఇతర జలాశయాల్లో 0.134 టీఎంసీల జలాలున్నాయి. మొత్తంగా 983.487 టీఎంసీలకుగాను 732.643 టీఎంసీల జలాలు ఉన్నాయి.

కృష్ణా పరివాహక జలాశయాల్లో వరద తీరు..

ప్రాజెక్టు	గరిష్ట నీటి నిల్వ	ప్రస్తుత నిల్వ	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
ఆలమట్టి	129.72	122.27	1,49,388	1,40,000
నారాయణపూర్	37.64	32.10	1,30,000	1,02,250
జూరాల	9.657	8.493	3,72,000	3,76,558
తుంగభద్ర	105.79	97.56	35,505	15,348
శ్రీశైలం	215.807	215.326	5,27,784	5,42,285
నాగార్జున సాగర్	312.05	305.98	5,42,285	5,77,786
పులిచింతల	45.77	41.980	6,36,945	6,02,301
ప్రకాశం బ్యారేజీ	3.07	3.07	10,25,276	10,25,276

గమనిక: నిల్వ టీఎంసీల్లో.. ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో

కాదంబరి బ్యాంకు ఖాతాలు అన్‌ఫ్రీజ్!

- తమ ఖాతాలు వాడుకునే వెసులుబాటు ఇవ్వాలన్న నటి
- ఆ మేరకు బ్యాంకులకు లేఖ ఇవ్వనున్న పోలీసులు

విజయవాడ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): విజయవాడ పోలీసుల వేధింపులకు గురైన ముంబై నటి కాదంబరి జెత్వానీకి స్వల్ప ఊరట లభించనుంది. పోలీసులు ఫ్రీజ్ చేసిన ఆమె బ్యాంకు ఖాతాల వినియోగానికి అనుమతిచ్చే అవకాశం కనిపిస్తోంది. అప్పట్లో ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో భాగంగా ఆమెకు ముంబైలో ఉన్న 18 బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశారు. ఈ ఖాతాల్లో రూ.80 లక్షల వరకూ ఉన్నట్లు కాదంబరి చెబుతున్న విషయం తెలిసిందే. ఆమెను అరెస్టు చేసిన అప్పటి పోలీసులు ఈ ఖాతాల నుంచి ఎలాంటి లావాదేవీలూ జరుగనివ్వకుండా నిలుపుదల చేశారు. వీటికి సంబంధించిన బ్యాంక్ స్టేట్‌మెంట్లను ఇప్పటికే పోలీసులు సేకరించి కోర్టుకు అందజేశారు. రెండు రోజులపాటు కాదంబరి జెత్వానీతోపాటు ఆమె తల్లిదండ్రుల నుంచి వాంగ్మూలం నమోదు చేసిన విచారణాధికారి స్రవంతి రాయ్... ఆ బ్యాంకు స్టేట్‌మెంట్లను వారికి చూపించారు. ఇవన్నీ తమ ఖాతాలకు చెందిన స్టేట్‌మెంట్లేనని వారు నిర్ధారించారు. ఈ ఖాతాల్లో లావాదేవీలు చేసుకునేందుకు వాటిని అన్‌ఫ్రీజ్ చేయాలని వారు పోలీసులను కోరారు. ఫ్రీజ్ చేసిన ఖాతాలను బ్యాంకర్లు అన్‌ఫ్రీజ్ చేయాలంటే పోలీసులు అధికారికంగా లేఖ ఇవ్వాల్సి ఉంటుంది. రెండు, మూడు రోజుల్లో పోలీసు కమిషనర్ ఈ లేఖను ఇచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిసింది.

విజయవాడ-బెంగళూరు మధ్య బోయింగ్ సర్వీసు

- అందుబాటులోకి తీసుకొచ్చిన ఎయిర్ ఇండియా
- కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు చొరవతో సాకారం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని దేశ ఐటీ రాజధాని బెంగళూరుతో అనుసంధానం చేసేందుకు మరో అడుగు ముందుకు పడింది. ఇందుకోసం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు చేసిన కృషి ఫలించింది. నూతన సర్వీసును ఎయిర్ ఇండియా ఆదివారం నుంచి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇక నుంచి ప్రతిరోజూ ఈ మార్గంలో రాకపోకలు జరగనున్నాయి. ఈ విమానం బెంగళూరులో సాయంత్రం 4.05 గంటలకు బయలుదేరి, 5.40 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. తిరిగి విజయవాడలో సాయంత్రం 6.10 గంటలకు బయలుదేరి, రాత్రి 7.50 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. ఇప్పటివరకు విజయవాడ నుంచి ఏటీఆర్-72 వంటి చిన్న విమానాలతో సేవలందిస్తుండగా, తాజా సర్వీసులో బోయింగ్-737 విమానాన్ని కేటాయించారు. 176 సీటింగ్ సామర్థ్యం కలిగిన ఈ విమానంతో ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి రానుంది.

అమరావతికి మరిన్ని సేవలు: రామ్మోహన్‌నాయుడు..

ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు చొరవపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సర్వీసు అందుబాటులోకి రావడం పట్ల మంత్రి రామ్మోహన్ నాయుడు కూడా హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర రాజధాని ప్రాంతానికి మరిన్ని సేవలు తీసుకువచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన పౌర విమానయాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మూడు నెలల్లోనే విజయవాడకు వచ్చిన నాలుగో సర్వీస్‌గా ఇది నిలవనుంది. ఇప్పటికే విజయవాడ-ముంబై మధ్య 2 సర్వీసులు, విజయవాడ - ఢిల్లీ మధ్య సర్వీసు నడిపేందుకు ఇండిగో సంస్థ ముందుకు వచ్చింది.

ఏలూరులో వైసీపీకి భారీ షాక్

- టీడీపీలో చేరిన 14మంది కార్పొరేటర్లు.. కార్పొరేషన్ టీడీపీ వశం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 1: ఏలూరు జిల్లాలో వైసీపీకి మరో షాక్ తగిలింది. మొన్ననే మేయర్ నూర్జహాన్ వైసీపీని వీడి టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే. ఇప్పుడు భారీ సంఖ్యలో కార్పొరేటర్లు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న టీడీపీ కూటమి ఇప్పుడు మునిసిపల్ కార్పొరేషన్‌లోనూ పాగా వేయనుంది. వైసీపీ నుండి గెలుపొందిన 14 మంది కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యురాలు ఆ పార్టీకి రాజీనామా చేస్తూ వైఎస్ జగన్‌కు లేఖ రాశారు. పార్టీని వీడిన కార్పొరేటర్లు ఆదివారం ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఏలూరు కార్పొరేషన్‌లో మొత్తం 50 మంది కార్పొరేటర్లు ఉండగా ప్రస్తుతం టీడీపీ బలం 42కు చేరింది. ఇక, ఇప్పటికే మాజీ మంత్రి ఆళ్ల నాని వైసీపీకి దూరం అయ్యారు. పార్టీ సభ్యత్వానికి, జిల్లా అధ్యక్ష పదవికి ఆయన రాజీనామా చేశారు. పార్టీ ఆఫీసును కూడా ఖాళీ చేయించిన ఆయన రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.

జగన్ ఎదుట పులివెందుల వైసీపీ నేతల గగ్గోలు

- బిల్లులు రావడం లేదంటూ ఆవేదన
- ఓపికతో ఉండండి... అన్నీ సర్దుకుంటాయంటూ నచ్చజెప్పిన మాజీ సీఎం జగన్

పులివెందుల, సెప్టెంబరు 1: చేసిన పనులకు బిల్లులు కాక ఇబ్బందులు పడుతున్నామని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు మొరపెట్టుకున్నారు. జగన్ ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, అభిమానులు వారి వ్యక్తిగత సమస్యలను ఆయనకు వివరించారు. అలాగే వైసీపీ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టు పనులు చేసిన వారందరూ తమ సమస్యలను జగన్ ముందుంచారు. అభివృద్ధి పేరుతో చేసిన పనులకు బిల్లులు అందలేదని జగన్‌కు వివరించారు. బిల్లులు రాక పోవడంతో పనుల కోసం చేసిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మరికొంతమంది టీడీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి తమపైన ఒత్తిడి పెరుగుతోందని, దాడులూ జరుగుతున్నాయని వాపోయారు. దీనికి జగన్ స్పందిస్తూ కొన్ని రోజులు ఓపికతో ఉండాలని, అన్ని సమస్యలకూ పరిష్కారం చూస్తామని సర్దిచెప్పారు. న్యాయస్థానానికి వెళ్లి బిల్లులు అందేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జగన్‌ను కలిసిన వారిలో కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాచమల్లు ప్రసాద్ రెడ్డి, రవీంద్రనాథరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అంజాద్‌బాష తదితరులున్నారు.

నేడు వైఎస్‌కు నివాళులర్పించనున్న జగన్, షర్మిల

దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఇడుపులపాయలో సోమవారం జగన్, పీసీసీ చీఫ్ షర్మిల నివాళులర్పించనున్నారు. వైఎస్ 15వ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ ఘాట్‌లో ప్రత్యేక ప్రార్థనల్లో వారు పాల్గొననున్నారు. సోమవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో జగన్, 8 గంటల ప్రాంతంలో షర్మిల వేర్వేరుగా తండ్రికి నివాళులర్పించనున్నారు.



లెట్స్ చేంజ్ ఇండియా సదస్సులో పాల్గొన్న రాకేశ్ శర్మ, వక్తలు

విశ్వంలో గ్రహాంతర వాసులూ ఉంటారు!

- భారత వ్యోమగామి రాకేశ్ శర్మ

చెన్నై, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ అనంత విశ్వంలో మానవులు ఉన్నట్లే గ్రహాంతర వాసులు కూడా ఉండే అవకాశముందని భారత తొలి వ్యోమగామి, వైమానిక దళ మాజీ వింగ్ కమాండర్ రాకేశ్ శర్మ అన్నారు. కోయంబత్తూర్‌లోని వెల్లలూరులో ఎస్ఎస్‌వీఎం వరల్డ్ స్కూలులో లెట్స్ చేంజ్ ఇండియా' పేరుతో మూడు రోజుల సదస్సు ఆదివారం ప్రారంభమైంది. ఎస్ఎస్‌వీఎం గ్రూప్ ఫౌండర్, మేనేజింగ్ ట్రస్టీ మణిమేఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాకేశ్ శర్మ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను క్లాస్ రూమ్‌లో కూర్చొని ఆకాశం వైపు చూస్తూ యుద్ధ విమానంలో ఎగురుతున్నట్టు కలలు కనేవాడినని చెప్పారు. ఇది గమనించిన ఉపాధ్యాయుడు, కలలు కనడమే కాకుండా వాటిని నెరవేర్చుకునేందుకు అవసరమైన కృషి చేయాలని సలహా ఇచ్చారని, దీంతో తాను ఎంతో శ్రమించి ఆ కలను సాకారం చేసుకున్నానని చెప్పారు. వ్యోమగామి శిక్షణ చాలా కఠినంగా ఉంటుందన్నారు. అంతరిక్షంలోకి పంపిన ఉపగ్రహాలు వాటి కాలం ముగిసిన తర్వాత అక్కడ కక్ష్యలోనే ఉండిపోతున్నాయని, అలా పేరుకుపోతున్న అంతరిక్ష వ్యర్థాలను తొలగించడం ఇప్పుడు పెద్ద సవాలుగా మారిందని రాకేశ్ శర్మ ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే భవిష్యత్తులో పునర్వినియోగ ఉపగ్రహ సాంకేతికతను అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ దిశగా మరిన్ని ప్రయోగాలు జరగాలన్నారు. విమానం నడిపేందుకు తనకు మరో 50 గంటల సర్వీసు మాత్రమే మిగిలి ఉన్నప్పుడు ఉన్నతాధికారులు 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో పాల్గొనేందుకు అనుమతించారని, ఆ సంఘటన తన జీవితంలో మరచిపోలేని అనుభవమని తెలిపారు. అంతరిక్షానికి వెళ్లడం సరదాగా ఉంటుందని, అక్కడ పనిచేయడమే కష్టమని అన్నారు. భూమిపై జీవితం అన్నింటికన్నా ఉత్తమమైందని రాకేశ్ శర్మ తెలిపారు.

శ్రీవారి లడ్డు

స్టేటస్ సింబల్ కాదు

- దళారుల నుంచి కొని పెళ్లిళ్లలో పంచుతున్నారు
- శ్రీవారి లడ్డూలతో వ్యాపారం చేస్తే సహించం
- దళారులను నియంత్రించేందుకే దర్శనం చేసుకోని వారికి ఆధార్‌పై రెండు లడ్డూల నిబంధన
- టీటీడీ ఈవో శ్యామలరావు



తిరుమల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఓ పెద్ద పెళ్లిలో తిరుమల లడ్డూలను ఇవ్వడం చూసి ఆశ్చర్యపోయాం. తిరుపతి లడ్డూ పవిత్రమైన ప్రసాదమే కానీ స్టేటస్ సింబల్‌గా వాడుకోవడం సరికాదు. దానిని మిఠాయిగా భావించ కూడదు. సాధారణంగా భక్తులకు కోరినన్ని లడ్డూలు ఇవ్వాలనే నిబంధన ఉంది. కానీ ఇవ్వడం లేదు. దానికి కారణం బయటనుంచి వచ్చిన వాళ్లు లడ్డూలు అధిక సంఖ్యలో తీసుకెళ్లిపోతున్నారు. ఈకారణంగానే శ్రీవారిని దర్శించుకునే సామాన్య భక్తులకు లడ్డూల కొరత ఏర్పడుతోంది. మా పరిశీలనలో దళారీలు ఎక్కువయ్యారని గ్రహించాం. ఈక్రమంలోనే శ్రీవారిని దర్శించుకోని వారికి ఆధార్ కార్డుపై రెండు లడ్డూలు మాత్రమే ఇవ్వాలనే నిబంధన పెట్టాం' అని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఆదివారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తుడికి ఒక ఉచిత లడ్డూతో పాటు రూ.50 చొప్పున తగినన్ని లడ్డూలు అందించడమే టీటీడీ లక్ష్యమన్నారు. దర్శనం చేసుకోకుండా కౌంటర్ల వద్దకు వెళ్లేవారికి నాలుగు రోజులుగా ఆధార్‌కార్డుపై రోజువారీ రెండు లడ్డూలు ఇస్తున్నామన్నారు. టీటీడీ రోజూ 3.5 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయిస్తోందన్నారు. ఇందులో 2.5 లక్షల లడ్డూలు మాత్రమే భక్తులకు చేరుతున్నాయని, మిగిలిన లక్ష లడ్డూలు దర్శనం చేసుకోని వారు కొనుగోలు చేస్తున్నారని వివరించారు. కొందరు దళారులు భారీ మొత్తంలో కొనుగోలు చేసి.. బయట ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు తమ విచారణలో తేలిందన్నారు. బయటపట్టణాల్లో పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాల్లో లడ్డూ ప్రసాదాలు పంచుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. టీటీడీ అనుబంధ ఆలయాలు, సమాచార కేంద్రాల్లో కూడా శ్రీవారి లడ్డూలు ప్రసాదాలను విక్రయిస్తోందన్నారు. ఆయా కేంద్రాలకు కావాల్సినన్నీ లడ్డూలు పంపేందుకు ఈ నూతన మార్పు ఉపయోగపడుతుందని, తద్వారా అందరికీ లడ్డూలు అందుతాయన్నారు.

ఒకే ఫ్యామిలీకి కార్పొరేషన్ ఉద్యోగి 1,100 లడ్డూలు ఇచ్చాడు

టీటీడీలో పనిచేసే కొంతమంది అవుట్‌సోర్సింగ్ సిబ్బంది కొంతమంది దళారులతో చేతులు కలిపినట్టు తమ విచారణలో వెల్లడైందని ఈవో అన్నారు. దీనిపై సీవీఎస్వో, ఎస్పీ విచారణ చేస్తున్నారన్నారు. తప్పుచేసిన వారిని వదిలిపెట్టమన్నారు. ఓ కౌంటర్‌లో పనిచేస్తున్న ఓ కార్పొరేషన్ ఉద్యోగి ఒకే ఫ్యామిలీకి 1,100 లడ్డూలు, మరో ఇద్దరికి 186, 120 లడ్డూల చొప్పున విక్రయించాడన్నారు. మరికొంతమంది కూడా ఇలానే అధిక సంఖ్యలో విక్రయించినట్టు గుర్తించామన్నారు. లడ్డూల ద్వారా వ్యాపారం చేస్తే వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. టీటీడీ ఐటీ వ్యవస్థ సహకారంతో మూడురోజులుగా భక్తుల ఆధార్ కార్డు నమోదుతో విక్రయిస్తున్న లడ్డూలు ఎవరికి ఇస్తున్నారు, దర్శనం చేసుకోని వారు ఎన్ని లడ్డూలు తీసుకుంటున్నారు. తదితర విషయాలను నమోదు చేస్తున్నామన్నారు. దీనిద్వారా దళారీలను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. భక్తులు ఈ విషయాలను గమనించి శ్రీవారి లడ్డూప్రసాదాల విక్రయాలపై వస్తున్న వదంతులను నమ్మవద్దని కోరారు.



తిరుపతిలో తొలిసారి అంతర్జాతీయ విమానం

రేణిగుంట, సెప్టెంబరు 1: తిరుపతి విమానాశ్రయంలో మొదటిసారి అంతర్జాతీయ విమానం ల్యాండ్ అయినట్టు ఎయిర్‌పోర్టు డైరెక్టర్ శ్రీనివాస్ మన్నె తెలిపారు. ఆదివారం బహ్రెయిన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ రవిపిళ్లై కుటుంబ సభ్యులతో వచ్చిన విమానం మధ్యాహ్నం 12.11గంటలకు ల్యాండింగ్ అయిందన్నారు. అంతకుముందుగా ఇమిగ్రేషన్ అధికారులు, డీజీసీఏ అధికారులు రన్‌వేను పరిశీలించి ల్యాండింగ్ అయ్యేందుకు అనుమతులు ఇచ్చారు.

గన్‌మెన్‌ను వెనక్కిపంపిన పెందుర్తి ఎమ్మెల్యే

- సీఐల పోస్టింగ్‌ల్లో తన మాట నెగ్గలేదని నిరసన!

విశాఖపట్నం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు తన ఇద్దరు గన్‌మెన్‌ను వెనక్కి పంపించేశారు. ఇటీవల విశాఖ నగర పోలీస్ కమిషనరేట్‌తో పాటు రేంజ్ పరిధిలో జరిగిన సీఐల బదిలీల్లో తన సిఫారసులను అధికారులు పట్టించుకోనందుకు నిరసనగా ఎమ్మెల్యే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం విశాఖ నగర పోలీస్‌కమిషనరేట్ పరిధిలో కొంతభాగం, అనకాపల్లి జిల్లా పరిధిలో మరికొంతభాగం విస్తరించి ఉంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నగర కమిషనరేట్‌తో పాటు రేంజ్ పరిధిలో సీఐల బదిలీలను అధికారులు శుక్రవారం చేపట్టారు. పెందుర్తి సీఐగా ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఒక అధికారి పేరుని సీపీ శంఖబ్రతబాగ్చికి, పరవాడ సీఐ పోస్టుకు మరొకరి పేరుని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టికి సిఫారసు చేసినట్టు సమాచారం. శుక్రవారం జారీ అయిన సిటీ, రేంజ్ పరిధిలో సీఐల పోస్టింగ్ ఉత్తర్వుల్లో రమేశ్‌బాబు సిఫారసు చేసిన అధికారులిద్దరికీ పోస్టింగ్‌లు ఇవ్వకుండా, వేరేవారికి ఆయా స్టేషన్లలో పోస్టింగ్ ఇచ్చారు. దీంతో తీవ్ర అసంతృప్తికి గురైన ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఆదివారం ఉదయం తన ఇద్దరు గన్‌మెన్‌ను సిటీ ఏఆర్‌కు పంపించేశారు. ఈ అంశం పోలీస్ అధికారులతో పాటు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఆంగ్రూలో ఎన్నారై కోటా దరఖాస్తుల గడువు పెంపు

అమరావతి, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎన్నారై కోటా కింద ఎమ్మెస్సీ, ఎంటెక్, పీహెచ్‌డీ సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణను ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్టు రిజిస్ట్రార్ రామచంద్రరావు తెలిపారు. దరఖాస్తులను పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా వర్సిటీ రిజిస్ట్రార్‌కు అందించాలని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

రోజాపై కేసు నమోదు చేయాలి: కిరణ్‌రాయల్

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 1:పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల శ్రీవారి సన్నిధిలో హత్యలు, అత్యాచారాలంటూ మాట్లాడిన మాజీ మంత్రి రోజాపై కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంతో బాధకు గురైన ముంబై నటి కాదంబరి జెత్వానికి రోజా ఎందుకు మద్దతు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇక గత ఎన్నికల్లో ఈవీఎంలు ట్యాంపరింగ్ జరిగినట్లు రోజా చేస్తున్న రాద్ధాంతం హాస్యాస్పదమన్నారు. టీటీడీ పాలక మండలి సభ్యుడిగా పదవి ఇస్తామని కోట్ల రూపాయలు దోచేసిన వైసీపీ మాజీ ఎంపీ బాగోతాన్ని త్వరలో బయటపెడతానన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

హిందూపురం, సెప్టెంబరు 1: శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మండలం తూముకుంట పారిశ్రామిక వాడలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి, వారి నుంచి 1200 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ మహేష్ వెల్లడించారు. హిందూపురం పట్టణంలోని ఆర్పీజీటీ కాలనీకి చెందిన షేక్ వసీం అనే యువకుడితోపాటు బసవనపల్లిలో నివాసముంటున్న జోగిందర్ ప్రసాద్ కొంతకాలంగా తూముకుంట పారిశ్రామికవాడలో గంజాయిని చిన్న ప్యాకెట్లలో ప్యాక్ చేసి, విక్రయిస్తున్నారు. అందిన సమాచారం మేరకు నిఘా ఉంచి, ఆదివారం గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

టీడీపీ కార్యాలయంలో నేటి ప్రజావేదిక రద్దు

అమరావతి, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం జరగాల్సిన గ్రీవెన్స్‌ను రద్దు చేసినట్టు ఎమ్మెల్సీ అశోక్‌బాబు తెలిపారు. అధికారులంతా వరద సహాయక చర్యల్లో ఉన్నందున టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజావేదిక కార్యక్రమాన్ని ఒక్కరోజు రద్దు చేసినట్లు చెప్పారు.

రేపటి నుంచి గ్రీవెన్స్ కొనసాగింపు

సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరణ మంగళవారం నుంచి కొనసాగనుంది. ముఖ్యమంత్రి, మంత్రులు, పార్టీ నేతలు టీడీపీ కేంద్ర కార్యాలయంలో గ్రీవెన్స్‌లో పాల్గొననున్నారు. ఈనెల3న హోంమంత్రి అనిత, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, 4న మంత్రి రామానాయుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, 5న మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి, మాజీ మంత్రి జవహర్, 6న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసయాదవ్, మంత్రి పయ్యావుల కేశవ్, 9న మంత్రి జనార్దన్‌రెడ్డి, పొలిట్‌బ్యూరో రెడ్డి సుబ్రహ్మణ్యం, 10న మంత్రి నారాయణ, పొలిట్‌బ్యూరో వర్ల రామయ్య, 11న మంత్రి రామనారాయణరెడ్డి, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు పనబాక లక్ష్మి, 12న మంత్రి పార్థసారధి, పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, 13న పల్లా శ్రీనివాసయాదవ్, మంత్రి కొల్లు రవీంద్ర, 14న సీఎం చంద్రబాబు, పల్లా శ్రీనివాసయాదవ్ పాల్గొంటారని పార్టీ కార్యాలయం తెలిపింది.

తంబళ్లపల్లెలో 'పెద్దిరెడ్డి'కి షాక్!

- మాజీ మంత్రి కుటుంబాన్ని అడ్డుకున్న టీడీపీ శ్రేణులు
- నియోజకవర్గంలోకి అడుగు పెట్టలేకపోయిన రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డి
- తిరుపతి వెళ్లిపోయిన ఎమ్మెల్యే ద్వారకానాథరెడ్డి
- ద్వారకనాథరెడ్డి దిష్టిబొమ్మ తగులబెట్టిన టీడీపీ శ్రేణులు

రాయచోటి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): నాడు అంగళ్ల వద్ద ప్రస్తుత ముఖ్యమంత్రి, నాటి విపక్ష నేత చంద్రబాబును వైసీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. దానికి ప్రతిఫలమో ఏమో నేడు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, ఆయన తనయుడు ఎంపీ మిథున్‌రెడ్డిని తంబళ్లపల్లెలో అడుగుపెట్టనీయకుండా టీడీపీ శ్రేణులు అడ్డుపడ్డాయి. ఆదివారం రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిలను తంబళ్లపల్లె నియోజకవర్గంలో పర్యటించకుండా టీడీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. దీంతో పెద్దిరెడ్డి రామచందారెడ్డి, మిథున్‌రెడ్డిలు తంబళ్లపల్లె నియోజకవర్గంలో అడుగుపెట్టలేకపోయారు. ఇక, తంబళ్లపల్లెలోనే తన ఇంట్లో ఉన్న ద్వారకనాథరెడ్డి తిరుపతికి వెళ్లిపోవాల్సి వచ్చింది. తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దతిప్పసముద్రం మండలం మద్దయ్యగారిపల్లెలో వైసీపీ నాయకులు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకనాథరెడ్డిలను ఆహ్వానించారు. ఈ క్రమంలో శనివారం రాత్రే ద్వారకనాథరెడ్డి తంబళ్లపల్లెలోని తన ఇంటికి చేరుకున్నారు. ఆదివారం ఉదయం ఈ సమాచారం తెలుసుకున్న తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నాయకులు పెద్దిరెడ్డి కుటుంబం రాకను అడ్డుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో అంగళ్లలో టీడీపీ నాయకులు పెద్దఎత్తున గుమికూడారు. వైసీపీ పాలనలో నియోజకవర్గంలో అక్రమాలు, అరాచకాలకు పాల్పడిన పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇక్కడ అడుగుపెట్టనీయబోమని పట్టుబట్టారు. నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డి.జయచంద్రారెడ్డి అంగళ్లకు చేరుకుని తమ పార్టీ నాయకులకు మద్దతుగా నిలబడ్డారు. ఈ విషయం తెలిసి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున అంగళ్లకు చేరుకున్నాయి. అక్కడ పెద్దిరెడ్డి కుటుంబానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి దిష్టిబొమ్మను వారు దహనం చేశారు. అంతకుముందు తంబళ్లపల్లెలోని ద్వారకనాథరెడ్డి ఇంటికి పెద్దఎత్తున వైసీపీ నాయకులు చేరుకున్నారు. ఆయన తన అనుచరగణంతో పెద్దతిప్పసముద్రం మండలానికి వెళ్లడానికి ప్రయత్నించారు. దాంతో ఒకానొక దశలో ఎమ్మెల్యేను గృహనిర్బంధం చేయడానికి పోలీసులు యత్నించారు. ఈ నేపథ్యంలో మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు ఎమ్మెల్యేతో చర్చలు జరిపారు. శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని సహకరించాలని, తంబళ్లపల్లె వదిలి వెళ్లిపోవాలని సూచించారు. ఎంతకూ టీడీపీ నాయకులు ఆందోళన విరమించక పోవడంతో ఆదివారం మధ్యాహ్నం 1.25 గంటల సమయంలో ఎమ్మెల్యే తంబళ్లపల్లె నుంచి తిరుపతికి వెళ్లిపోయారు. అప్పటికి శాంతించిన టీడీపీ శ్రేణులు.. పెద్దిరెడ్డి కుటుంబాన్ని నియోజకవర్గంలోకి అడుగుపెట్టనీయబోమని హెచ్చరించాయి. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలు తంబళ్లపల్లె నియోజకవర్గంలో అడుగు కూడా పెట్టలేకపోయారు.

ప్రాణాలు తీసిన ఈత సరదా

- నీటికుంటలోకి దిగి ముగ్గురు చిన్నారులు మృతి

పెద్దారవీడు, సెప్టెంబరు 1 : ఈత సరదా ముగ్గురు చిన్నారుల ఉసురు తీసింది. ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం కొత్తపల్లి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకొంది. పోలీసుల కథనం మేరకు.. ఆదివారం పాఠశాలలకు సెలవు కావడంతో గ్రామానికి చెందిన ఏడుగురు చిన్నారులు శివారులోని వెన్నా రవిశంకర్‌రెడ్డి పొలంలో నీటి కుంట వద్దకు ఈతకు వెళ్లారు. పొగాకు సాగుకోసం ఆయన ఈ నీటి కుంట తవ్వారు. ఈతకు దిగిన ఏడుగురిలో కొత్తపల్లి శివ(11), కొత్తపల్లి మను(9), అరవీటి ఏడుకొండలు(7) నీటిలో మునిగిపోయారు. మిగిలిన స్నేహితులు కేకలు వేయగా సమీప పొలంలో పనులు చేసుకుంటున్న రైతులు వచ్చి వారిని బయటకు తీశారు. కుటుంబసభ్యులు వారిని మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

లోకేశ్ విచారం

అమరావతి, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ఈత కోసం నీటికుంటలో దిగి ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటనపై మంత్రి నారా లోకేశ్ విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని 'ఎక్స్'లో పేర్కొన్నారు. విద్యార్థుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

గుడివాడలో పేర్ని నానికి చేదు అనుభవం

- కారుపైకి రాళ్లు, కోడిగుడ్లు విసిరిన జనసైనికులు
- మాజీ మంత్రికి చెప్పులు చూపిస్తూ నిరసన
- గతంలో తమ అధినేతకు చెప్పు చూపించడంపై ఆగ్రహం
- పవన్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్


ఇంటి ఎదుట ధర్నా నిర్వహిస్తున్న జనసేన, టిడిపి నాయుకులు, కార్యకర్తలు

గుడివాడ, సెప్టెంబరు 1: మాజీ మంత్రి పేర్ని నానికి జనసైనికులు చుక్కలు చూపించారు. గుడివాడ వచ్చిన ఆయనకు చెప్పులు చూపించారు. కారుపైకి రాళ్లు, కోడిగుడ్లు విసిరారు. తమ నాయకుడు పవన్‌కు చెప్పులు చూపించినందుకు ప్రతిగా చెప్పులు చూపిస్తూ రా తేల్చుకుందాం అంటూ సవాలు విసిరారు. ఆదివారం ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు పేర్ని నాని గుడివాడలోని వైసీపీ నాయకుడు తోట శివాజీ ఇంటికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. ఆందోళనకారులు ఇంట్లోకి వెళ్ళేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. స్థానిక వైసీపీ నాయకులు పాలేటి చంటి కారులో పేర్ని నాని వచ్చారు. దీంతో జనసేన కార్యకర్తలు ఆ కారుపై రాళ్ళు, కోడిగుడ్లతో దాడిచేశారు. దాడిలో వాహనం అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఒక దశలో పెట్రోలు పోసి నిప్పంటించేందుకు జనసేన కార్యకర్తలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. జనసేన నాయకులు, కార్యకర్తలను బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించగా జనసైనికులు అడ్డుకున్నారు. గతంలో వైసీపీ అధికారంలో ఉండగా జనసేన అధినేత పవన్‌ను ఉద్దేశించి పేర్ని నాని చెప్పులు చూపించి తేల్చుకుందాం రా అని సవాలు విసిరిన సంగతి తెలిసిందే. దానికి ప్రతిగా ఇప్పుడు పేర్ని నానికి జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు చెప్పులు చూపించి తేల్చుకుందాం రా అంటూ నినాదాలు చేశారు. పవన్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారని, వెంటనే క్షమాపణ చెప్పాలని బూరగడ్డ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. పోలీసులు జనసేన నాయకులతో మంతనాలు జరపడంతో ధర్నాను విరమించుకున్నారు. ఉద్రిక్తత తగ్గడంతో పేర్ని నాని గుడివాడ నుంచి వెళ్లిపోయారు. కాగా, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్న వైసీపీ కార్యకర్త ఇంటూరి రవికిరణ్‌ను గుడివాడ వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రవికిరణ్‌ను పరామర్శించేందుకే పేర్ని నాని గుడివాడ వచ్చారని ఇది కూడా పేర్ని నానికి నిరసన సెగ తగలడానికి కారణమని చెబుతున్నారు. అసభ్యకరమైన, మహిళల పట్ల అనుచిత పోస్టులు పెట్టిన రవికిరణ్‌ను పరామర్శించేందుకు రావడం సిగ్గుచేటని పేర్కొంటూ చెప్పులతో నిరసన తెలిపామని జనసేన వీర మహిళలు చెబుతున్నారు.

హిడెన్ కెమెరాల నాటకం నీలి మీడియా పనే

- ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ డ్రామా
- గుడ్లవల్లేరు ఘటనపై మంత్రి లోకేశ్
- విద్యార్థులంతా నా బిడ్డలే.. వారి బాధ్యతా నాదే
- జగన్‌లా తల్లినీ, చెల్లినీ గెంటేసే రకం కాదు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 1: సినీనటిపై వైసీపీ నేతల వేధింపులు, మద్యం కుంభకోణం, భూ అక్రమాలు వరుసగా బయట పడుతుండడంతో వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే హిడెన్ కెమెరాల నాటకానికి తెరలేపారని మంత్రి నారా లోకేశ్ ఆరోపించారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలో ముంపు ప్రాంతాల్లో ఆయన ఆదివారం పర్యటించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలోని విద్యార్థినీల బాత్రూముల్లో కెమెరాలు ఉన్నట్టు ఎలాంటి ఆధారాలూ లభించలేదన్నారు. హిడెన్ కెమెరాల ఆరోపణలు కేవలం నీలి మీడియా సృష్టేనని తెలిపారు. విద్యా శాఖ మంత్రిగా రాష్ట్రంలో చదువుతున్న విద్యార్థులంతా తన సొంత బిడ్డల్లాంటి వారని, వారిని క్షేమంగా చూసుకునే బాధ్యత పూర్తిగా తనదేనని స్పష్టం చేశారు. గుడ్లవల్లేరులో నలుగురు విద్యార్థుల మధ్య జరిగిన వ్యక్తిగత అంశం ఈ గొడవకు కారణమైందని, సంబంధిత విద్యార్థిని డీటెయిన్ చేసి అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఆహారం కలుషితమైందని తెలిసిన వెంటనే డైరెక్టర్‌ను విధుల నుంచి తొలగించామని, ముగ్గురు ఉన్నతాధికారులతో పర్యవేక్షక కమిటీని కూడా నియమించామని లోకేశ్ చెప్పారు. జగన్ మాదిరిగా తాను తల్లినీ, చెల్లినీ రోడ్లపైకి గెంటేసే రకం కాదని, విద్యార్థినులను సొంత తోబుట్టువులుగా భావించి కంటికి రెప్పలా కాపాడతానని లోకేశ్ అన్నారు. నాడు-నేడు పేరుతో జగన్ ప్రభుత్వం రూ.వేల కోట్లు ఖర్చు చేసినట్టు తప్పుడు లెక్కలు చెబుతోందని, అదే నిజమైతే రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో గత ఐదేళ్లలో పది లక్షల మంది విద్యార్థులు ఎందుకు తగ్గారని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా, రంగులు వేసి రూ.వందల కోట్లు దిగమింగారని లోకేశ్ ఆరోపించారు. విద్యార్థులకు సరఫరా చేసే గుడ్లు, చిక్కీలు, ఆయాల జీతాలు కూడా బకాయి పెట్టి వెళ్లారని, వాటన్నింటినీ ఒక్కొక్కటిగా తాము విడుదల చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తానని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు.

నూజివీడు ట్రిపుల్ ఐటీ కేటరింగ్ సంస్థలపై క్రిమినల్ చర్యలు

- మంత్రి లోకేశ్ ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీలో కేటరింగ్ సేవలు అందిస్తున్న ఫైన్ కేటరింగ్ సర్వీసెస్, అనూష హాస్పిటాలిటీ సేవలను తక్షణం నిలిపివేయాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలన్నారు. ఆ సంస్థలు మరే టెండర్లలో పాల్గొనకుండా బ్లాక్ లిస్టులో చేర్చాలని స్పష్టంచేశారు. ట్రిపుల్ ఐటీలో కలుషిత ఆహారంపై అధికారులు ఇచ్చిన ప్రాథమిక నివేదిక ఆధారంగా ఈ మేరకు ఆదేశాలు జారీచేశారు. ఆయా సంస్థల నుంచి రావాల్సిన అద్దెలను వెంటనే వసూలు చేయాలని, లేనిపక్షంలో చట్టపరమైన తీసుకోవాలని అన్నారు. ఫుడ్‌కోర్టు టెండర్లను వారం రోజుల్లో ప్రారంభించాలని, అప్పటివరకూ కేఎంకే కేటరింగ్ సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. కేటరింగ్ చేస్తున్న రెండు సంస్థలపై గతంలోనే అనేక ఫిర్యాదులు వచ్చాయని అధికారులు నివేదికలో పేర్కొన్నారు. ఫైన్ కేటరింగ్ సర్వీసెస్‌కు గతంలోనూ మూడుసార్లు నోటీసులు జారీచేసినా తీరు మారలేదని వివరించారు. పేరుకి రెండు సంస్థలు అయినా ఒకే యాజమాన్యం కింద నడుస్తున్నాయనే విషయాన్ని గుర్తించారు. ఏడు అంశాల్లో లోపాలున్నట్లు నివేదికలో వివరించారు. నాలుగు డైనింగ్ హాళ్లకు ఒకే వంట గదిని వాడుతున్నారని, వంటశాలలో సరిపడ స్థలం లేకపోగా పరిశుభ్రంగా లేదని, వంట చేసే ప్రాంతంలో బొద్దింకలు ఎక్కువగా ఉన్నాయని, పేట్లు, పాత్రలు సరిగా శుభ్రం చేయట్లేదని, వంట ప్రాంతంలో గోడలు, కిటీలు బూజు, ఫంగస్‌తో నిండిపోయిందని, వంట సరుకులకు పురుగులు పట్టాయని, కుళ్లిన గుడ్లు అక్కడ ఉన్నాయనే విషయాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. వీటిపై విద్యార్థుల నుంచి కూడా పెద్దఎత్తున ఫిర్యాదులు వచ్చాయి. భోజనం ఎక్కువ సమయం అందుబాటులో ఉండటం లేదని, బాత్‌రూమ్‌ల నిర్వహణ సక్రమంగా లేదని కమిటీకి తెలిపారు. వ్యర్థాలకు తగినన్ని డస్ట్‌బిన్‌లు కూడా లేవని వారు తెలిపారు. ఈ అంశాలను పరిశీలించిన రెండు కాంట్రాక్టు సంస్థల సేవలను వెంటనే రద్దుచేయాలని సిఫారసు చేయగా మంత్రి ఆమోదించారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో పరిస్థితులు చక్కబడేవరకూ ఒక ఆర్డీవోతో నిరంతర పర్యవేక్షణ చేయాలని మంత్రి ఆదేశించారు.

బొమ్మలు: అక్బర్



చలం తన గురువు రఘుపతి వెంకటరత్నం నాయుడి గారి గురించి రాసిన నివాళి ఇది. 1962లో వెంకటరత్నం నాయుడి గారిపై విడుదలైన సూవెనీర్‌లో మొదటిసారి వచ్చిన ఈ వ్యాసం ఆ తర్వాత ఎక్కడా మరలా రాలేదు, చలం సాహిత్య సంపుటాల్లో కూడా భాగం కాలేదు. సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఇప్పుడు దీన్ని ప్రచురిస్తున్నాం.

గురువర్యుడు

- చలం

మంగళూరు నుంచి వొచ్చిన రామారావు గారు అన్నారు, "మద్రాసులో నేను చదువుకునేప్పుడు, కాకినాడ కాలేజీ ప్రిన్సిపాలు వెంకటరత్నం గారిని నేనే చూడలేదు. కాని ఆయన శిష్యుల్లో ప్రతివారిలో ఆయన్ని చూస్తున్నాను. నాలుగు నిమిషాల్లో తెలుస్తుంది ఇతడు వెంకటరత్నంగారి శిష్యుడని."

అంతకన్న గొప్ప పొగడ్త అధ్యాపకుడికి ఎక్కడా వుండదు. సమాజంపైన తమ ప్రభావాన్ని ముద్రించి పోయేవారు రెండు విధాలైనవాళ్ళు. చాలామంది తాము చేసిన రాజకీయ, సాంఘిక, కళా రంగాలలో తాము తెచ్చిన మార్పుల వల్లా, పనుల వల్లా, విప్లవం వల్లా, నూతన శకారంభకులై చిరస్మరణీయులవుతారు. రెండో తరగతివారు ప్రత్యేక వ్యక్తుల స్వభావాలపై ఉద్దేశ్య పూర్వకంగా గానీ, రహితంగా గానీ, తాము తెచ్చిన ఔన్నత్యం వల్ల జ్ఞాపకముంటారు. ఈ రెండు విధాల ప్రతిభలు కలిసివుండే గాంధీగారి వంటి మహాత్ములు అరుదుగా జన్మిస్తారు.

ఓ పాతికేళ్ళు తెలుగుదేశం అమితంగా ద్వేషించినవారు - సంఘ పారిశుద్ధ్యంకి పోరాడిన వీరేశలింగంగారూ, వెంకటరత్నంగారూ. వీరేశలింగంగారెంత కర్మవీరుడో నాయుడుగారంత నిష్కర్మవీరుడు. విద్యార్థులూ, ప్రజలూ వీరేశలింగం గారి ఉద్యమాన్నీ, సాహసాన్నీ, చూసి ఆయన్ని అనుకరించారు. విద్యార్థులూ, ప్రజలూ ముందు వెంకటరత్నం నాయుడుగార్ని చూసి ప్రేమించి, తరువాత ఆయన ఉద్యమంలో విశ్వసించేవారు. మనసులో నిష్కారణ ద్వేషాలూ, వైషమ్యాలూ భయాలూ పూని, అహంకారపూరితులైన వారికి తప్ప తక్కినవారికి నాయుడుగారి ఆత్మమాధుర్యాన్నించి తప్పుకోవడం దుర్ఘటమయ్యేది.

To meet him was to be impressed with him and to be impressed was to adore him.

ఏ అరమరికలూ లేకుండా లేత హృదయాన్ని ఆయన పాదాక్రాంతం చేసి ఆరాధించి ప్రేమించినవారిలో నేనొకణ్ణి. ఆయన మూలాన (ఆయన నాతో ఏమీ ఆ విధంగా ప్రస్తావించకుండానే) చదువూ, పెళ్ళీ, ఉద్యోగం, పిల్లలూ, అనే ఆత్మవినాశకరమైన గాడి నించి నా జీవితం పూర్తిగా పట్టాలు తప్పింది. అవన్నీ జరగలేదని కాదు. కాని వాటిలో వొక్కటీ నన్ను బంధించి వుంచలేకపోయింది. వాటికన్న భిన్నమైన విలువలకి నా కళ్ళు తెరుచుకున్నాయి, నాయుడుగారి సామీప్యం వల్ల. సజీవమైన ఈశ్వరునిలో సజీవమైన విశ్వాసమంటే ఏమిటో నాకు మొదట నేర్పింది నాయుడుగారు. భగవాన్ రమణుని దర్శించిన నిమిషాన ఆయన నాకు ఆధ్యాత్మిక గురువని నాకు తెలీకుండానే గుర్తించగలిగానంటే దాంట్లో చిన్నతనపు ఆరాధనా ప్రభావం తప్పకుండా వుంది. నా జీవితంలో సత్యదీక్ష, సాహసం, ప్రజల అభిప్రాయాల పట్ల నిర్లక్ష్యతా, నమ్మినదాని కోసం కష్టాలకీ అపవాదులకీ జంకక నిలబడడం, దుమ్ము నించీ, డబ్బు నించీ ఎత్తయిన దృష్టీ ఇవన్నీ నాలో కలిగినా, అవి నాయుడుగారు నాకు ప్రసాదించిన వరాలు. నాలో ఒక అంతరాత్మ వుందని తెలుసుకున్నాను ఆయన దయ వల్ల.

జీవితంలో ఆత్మవికాసం పొందినవారు తక్కినవారి మల్లేనే జీవిస్తారు. చరిస్తారు. కాని -

చూడ చూడ వారి
రుచుల జాడ వేరు.

నాయుడుగారు టెన్నిసన్, మిల్టన్, షేక్స్పియర్ పాఠాలు చెపుతూ వుంటే ప్రసిద్ధికెక్కిన తక్కిన లెక్చరర్ల కన్న అధికృత ప్రత్యేకంగా కనపడకపోతే పోవొచ్చు. కాని ఆయన మాట్లాడే విధం, ఆయన చూపు, గంభీరమైన కంఠధ్వని, కొన్ని పాయింట్స్ మీద ఆయన ఇచ్చే స్ట్రెసెస్, అందానికి ముఖ్యం, నీతిలోని, భక్తిలోని అందాలకి ఆయన యిచ్చే ప్రాధాన్యం, ఇవన్నీ మా అంతరాంతరాల్లో తెలీకుండా మార్పును తెచ్చి, జీవితానికే కొత్త విలువల్ని చూపి మా దృష్టిని మార్చేవి. నాయుడుగారు ఆనాడు యిచ్చిన sermons ఈనాడు అచ్చులో చదివితే ఆ మాటల్లో ఏ విశేషమూ కనపడదు. కాని ఆ మాటల్నే ఆయన పెదవుల నించి విన్న రోజుల్లో అవి ఎంతగా మమ్మల్ని ఉజ్వలపరిచేవో యెట్లా తెలుస్తుంది? గొప్ప పర్సనాలిటీ లక్షణమే అది. నొబిలిటీ, హృదయవైశాల్యమూ, ప్రతివారినీ ప్రేమాలింగనంలోకి తీసుకునే లోతూ, కలుషానీ, లోపాన్ని, దీనత్వాన్నీ, నిస్సహాయత్వాన్నీ అర్థం చేసుకుని ఆదరించే ఆర్ద్రత్వమూ, ఒకరిలో కలిగాయంటే అవి ఏవో పుటక వల్లనో, యాక్సిడెంట్ వల్లనో, ఓ ట్రిక్ వల్లనో, డెలిబరేట్ విల్ వల్లనో కలిగేవి కావు. ధనానికీ పదవులకీ ఆశించకపోవడం, కీర్తి సుఖాలకై దేవుళ్ళాడకపోవడం, అధికారధూర్తుల ముందు తల వంచకపోవడం, కీర్తి అపకీర్తులకి లక్ష్యం లేకపోవడం, ముందు కాలంలో తన గతి ఏం కాబోతోంది అనే యోచన లేకపోవడం, ఇలాంటి గుణాలు తలుచుకున్నంత మాత్రాన ఒక్క రోజులో తెచ్చుకునేవి కావు. నితంతరనిర్నిద్ర, ఇంద్రియ నిగ్రహం, శమదమ నియమ తీవ్ర కృషి ఫలితంగా ఈశ్వరానుగ్రహం తోడుకావడం చేత పరిణమించే వరాలవి. సైనిక విజయాన్ని సాధించడం, దుర్గమ పర్వతాల నెక్కడం, ధ్రువాల అంతు కనుక్కోడం, ఇవన్నీ గొప్ప సాహసకృత్యాలే. కాని ఎవరి కంటికీ తెలియకుండా దినదినమూ నిమిష నిమిషమూ, తమ అహాన్ని కోసుకుని నిత్యాగ్నిహోత్రంలో ఆహుతి చేసుకునే ఈ మహాయోగుల తీవ్ర త్యాగం ఎవరూ ఎరగనిది. పర్యవసానం వారి ముఖాల వర్చస్సులో వారి పెదవులమీది కరుణలో, ప్రేమాశ్రువులు చిందే వారి నేత్రాలలో గోచరమౌతుంది. వారి చుట్టూ ఓ నిర్మల తేజోవంతమైన 'ఆరా' వెలుగుతో వుంటుంది. అదే ఉత్తములకి ప్రేమాస్పదమైనదీ, దుష్టులకీ, కుచ్చితులకీ ద్వేష కారణమౌతుంది. ఈ భూత ప్రేత పిశాచ రాబందు గణాలకింక శాంతి వుండదు. మాటలలో, అచ్చులో, పనులలో ఆ జ్యోతి నార్పిందాకా. ఈ ఉదాత్తులు బ్రతికివున్నంత కాలమూ వారిపైన అసహ్యమైన అపవాదులు రేగుతూనే వుంటాయి. వారు చచ్చిపొయ్యాక ఒక నిట్టూర్పు విడిచి వారిని మరచిపోయి సుఖంగా నిద్రిస్తుంది లోకం. వారు చేసే సంస్కారమంతా వారి స్వభావంలోనే కాని బైట మెటీరియల్‌గా కనబడకపోవడం చాత వారిని జ్ఞాపకం చేసేందుకు ఏదీ మిగలదు. మిగిలేదల్లా వారిని ప్రేమించి అనుసరించిన శిష్యుల లోని శాశ్వత పరివర్తన. ఆ విధంగా ఈ నాటికీ జీవించివున్నారు, రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు.



నాయుడుగారి చివరి కాలంలో ఆయన చూపు బలం తగ్గి నన్ను చూడడం వల్ల ఆయనకి బాధ కలగదు గనక ఆయన ముందు చేతులు జోడించి నిలబడి "నేను వెంకటాచలాన్ని, నా సిన్సియర్ కన్విక్షన్స్ వల్ల నేను మీ నుంచి యెంత దూరమైనా, నా ఆరాధన మిమ్మల్ని వీడదు. నేను చీకట్లో ఐతే, నేను కాంతిని చూడాలని ఆశీర్వదించండి" అని అడగాలన్పించేది.

మొదట విద్యార్థిగా, తరువాత కాలేజీ ట్యూటరుగా నాయుడుగారితో సన్నిహితత్వం నాకు అయిదేళ్ళపాటు లభించింది. అంతే కాదు, బ్రహ్మసమాజానికి ఆయన అధ్యక్షుడూ, నేను (అ)కార్యదర్శినీ. ఈ బైట సంబంధం కాక మా ఇద్దరి మధ్య అంతరంగికమైన గురుశిష్య సంబంధం వుండనే వుంది.

నేను విద్యార్థిగా చేరేటప్పటికే నాయుడుగారు మనుష్యుల నుంచి దూరమౌతున్నారు. ఆయన హృదయం అతి మార్దవం కాబట్టే ఆయన ప్రేమించిన వారి నించి గాయాలూ, డిసప్పాయింట్‌మెంట్ సహించలేక ఆయన క్రమంగా ఓ షెల్ లోకి వెళ్ళారనిపిస్తుంది. త్వరలోనే నా ప్రవర్తన వల్ల, నాలో రేగుతున్న నైతిక సందేహాల వల్ల, సంఘంపై తిరగబాటు ప్రోద్బలం వల్ల నేను అన్నేళ్ళు నా కాలాన్నంతా అర్పించిన బ్రహ్మసమాజం నుంచి దూరం కావడంతో నాయుడు గారి నుంచీ దూరమైనాను. ఆయన తన ప్రాణమంతటి లోనూ విశ్వసించి బోధించిన నీతి నిర్మలత్వాల అనుష్ఠానంపైనే, దాంపత్య సంబంధంలోని పవిత్రతమీదే నాకు సందేహాలు రేగాయి. వాటికి నాలోని బలహీనాలూ బలాలూ తోడ్పడ్డాయి. నా గురువుని చాలా లోతుగా గాయం చేసాను. మా యిద్దరి మధ్యా అనుల్లంఘనీయ అఘాతం ఏర్పడింది. నాయుడుగారి ప్రేమను పోగొట్టుకున్నందుకు నేనెంతో బాధ పడ్డాను. నాకు ఆయన ప్రేమ లేకుండాపోయింది అనేదానికన్న నా తిరగబాటువల్ల ఆయనెంత బాధపడ్డారో అని నాకు ఎంతో తపన కలిగేది. నేనెరుగుదును ఆయన నన్ను ప్రేమించారనీ, ఆయన వెలుగును నిలుపుకుని ప్రచారం చేయగల శిష్యుల్లో నేనొకడనని ఆయన ఆశించారనీ. కాని తిరిగి ఆయనను సమీపించడం వల్ల ప్రయోజనం లేదనీ, నా నూతన దృక్పథాన్ని ఆయనకి విశదీకరించి, నా సిన్సియారిటీలో ఆయనకి నమ్మకం కలిగించగలననే ఆశ పోయింది నాకు.

ఓసారి నాయుడుగారన్నారు "ఏ పబ్లిసిటీ లేకుండా నేనొకసారి కలకత్తా వెళ్ళి శివనాథ శాస్త్రి గారి ముందు 'వీడు రఘుపతి వెంకటరత్నం' అని చెప్పి నమస్కరించి వొచ్చెయ్యగలిగితే బావుండుననిపిస్తుంది" నాకు.

నాయుడుగారి చివరి కాలంలో ఆయన చూపు బలం తగ్గి నన్ను చూడడం వల్ల ఆయనకి బాధ కలగదు గనక ఆయన ముందు చేతులు జోడించి నిలబడి "నేను వెంకటాచలాన్ని, నా సిన్సియర్ కన్విక్షన్స్ వల్ల నేను మీ నుంచి యెంత దూరమైనా, నా ఆరాధన మిమ్మల్ని వీడదు. నేను చీకట్లో ఐతే, నేను కాంతిని చూడాలని ఆశీర్వదించండి" అని అడగాలన్పించేది.

కాని మనసులో ఆ కల్పనా దృశ్యాన్ని భావించుకున్నంత మాత్రాన నా ఎమోషన్స్ నన్ను వుక్కిరిబిక్కిరి చేసేవి. తీరా వెళ్ళి చూస్తే ఏం ప్రయోజనం వుండదనే నా భయం వల్ల అది జరగలేదనే చింత ఏనాటికీ నన్ను విడువదు.

(సేకరణ బి.ఆర్. బాపూజీ)

'పంపాతీరం' నవల

ఓల్గా రాసిన 'పంపాతీరం' పుస్తకం పరిచయ సభ సెప్టెంబర్ 8 ఉదయం 10 గంటలకు కరీంనగర్ లోని ఫిలిం భవన్‌లో తెలంగాణ రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో జరుగనుంది. సి.వి. కుమార్ అధ్యక్షతన జరిగే సభలో నలిమెల భాస్కర్, ఓల్గా, బి.వి.ఎన్. స్వామి, పుప్పాల శ్రీరామ్, కందుకూరి అంజయ్య, గాజోజు నాగ భూషణం, తోట నిర్మల రాణి, దామరకుంట శంకరయ్య తదితరులు పాల్గొంటారు.

తెరవే, కరీంనగర్

చిల్లర భావనారాయణరావు శతజయంతి

చిల్లర భావ నారాయణ రావు శత జయంతి ప్రారంభోత్సవ సభ సెప్టెంబర్ 8 ఉదయం 10.30 గంటలకు భారతీయ విద్యాభవన్, 18, 20 & 22 మూడవ వీధి, మైలాపూర్, చెన్నైలో జరుగుతుంది. సభలో కిడాంబి లక్ష్మీకాంత్, చిల్లర భవానీదేవి, కమలాకర ఆనంద శివరామ్ తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 98844 46208.

తూమాటి సంజీవరావు

కవి సంధ్య స్వర్ణోత్సవ సంచిక

సెప్టెంబర్ 14 ఉదయం 10గంటలకు రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాలులో 'కవి సంధ్య' 50వ సంచిక ఆవిష్కరణ సభ జరుగుతుంది. శివారెడ్డి, రమణాచారి, కె. శ్రీనివాస్, వాడ్రేవు చినవీరభద్రుడు, మామిడి హరికృష్ణ, దాట్ల దేవదానం రాజు, ఏనుగు నరసింహా రెడ్డి, కోయి కోటేశ్వరరావు, గూటం స్వామి పాల్గొంటారు. ఇదే సభలో నాగరాజు రామస్వామి 'కవన కోకిలలు' పుస్తకం ఆవిష్కరణ ఉంటుంది.

శిఖామణి

సముద్రమ్మపై ప్రత్యేక సంచిక


తొలితరం దళిత మహాసభ ఉద్యమంలో పాల్గొన్న బహుజన సాంస్కృతిక యోధురాలు, గాయకురాలు ఆతవ సముద్రమ్మపై ప్రత్యేక సంచిక తీసుకొస్తున్నాం. ఆమెపై మీ వ్యాసాలను, కవితలను సెప్టెంబరు 10లోగా యూనీకోడ్ ఫాంట్‌లో గానీ డీటీపీ చేసిన ఒపెన్ ఫైలు గానీ పంపగలరు. వివరాలకు: 96766 09234.

తంగిరాల సోని

ఉదారి నాగదాసు కవితా అవార్డు

ఉదారి నాగదాసు స్మారక కవితా అవార్డును ఈ ఏడాది బెల్లి యాదయ్య స్వీకరిస్తారు. ఈ అవార్డు ప్రదానం సెప్టెంబర్ 15న ఆదిలాబాద్‌లో జరుగుతుంది. అవార్డు కింద రూ.5వేల నగదు బహుమతి, ప్రశంసా పత్రం ఇస్తారు. వివరాలకు: 94414 13666.

ఉదారి నారాయణ



ఏనుగమ్మా ఏనుగు!

అటునుంచి మనవడు
ఇటునుంచి నేను
గట్టిగా కావలించుకున్నాం ఏనుగుని

వాడి కేరింతల్ని అది చెవులాడిస్తూ వింది
ఒక్కసారి తల విదిలించి ఘీంకరించింది
చక్కెర రెక్కల ఏనుగుతోసహా మేం మాయం

వంటిమీద చక్కెర చల్లుకున్న హిమ పర్వతాల్లోకి
పాలధారల పంచధారల జలపాతాల మధ్యకి
తేనె రశ్మి కురిసే లోయల్లోకి
సీతాకోకలు ఉన్మత్తంగా తిరిగే వనాల్లోకి
పూలగానాల మాధుర్యాలమై
తెల్లమబ్బులు తేలే
నిశ్చల సరస్సుల మధుపాత్రల్లోకి
సూరీడు ఆరేసిన బంగారు రంగు
ఉల్లిపొర వస్త్రాల కెరటాల్లోకి

నేనూ.. ఏనుగూ.. మనవడూ
తీయని కాలం అరమోడ్పు రెప్పల మాటున
ఆకాశాల్లోకి... ఉన్మత్త కాంతి సంవత్సరాల్లోకి

గ్రహాల మధ్య శూన్యంలో
మహాజనని విరబోసుకున్న
ధూళికేశాలు దులిపినపుడు
విశ్వగర్భంలో ఆకృతులు దాలుస్తున్న
సృష్టి రహస్యాల్లోకి నేనూ మనవడూ
చక్కెర రెక్కల ఏనుగునెక్కి

పరిభ్రమించే మహాగోళాల చుట్టూ తిరుగుతూ
స్వప్నగోళాల నారింజపళ్ల తొనలు వలుస్తూ
మెలకువల అంచులు దాటి
ఆకలి తెలియని గ్రహాంతరాల సంచరిస్తూండగా

మెరుపుల్ని దాటుకుని
ఉరుముల్ని చీల్చుకుని
నల్లమబ్బులకు ఆవలి నుండి
వాయు సముద్రం అలల
తెలతెల్లని మబ్బు నురుగులు దాటుకుని
ఏడురంగుల పొరల్లోంచి దూసుకుని
విన్పిస్తుంది కన్నా అనే పిలుపు
చేతిలో బువ్వతో పాలిండ్ల అమృతంతో
పెదవుల మీద తేనె చిరుహాసంతో
ఎదురుచూసే తల్లి నుండి
విన్పిస్తుంది నిశ్శబ్దంగా ఒకే కన్నా అనే పిలుపు

అంతే.. వచ్చేస్తాం.. ముగ్గురం
బొమ్మలోకి ఏనుగు
నేను తాత లోకి
మనవడు అమ్మచంక లోకి

ముగ్గురం అమ్మ ఒడిలోంచి అమ్మ ఒడిలోకి
అమ్మ ఒడిలో అటునుంచి ఇటువైపుకి

■ వసీరా

✆ 91777 27076



పాపులర్ నవల పునర్జన్మ?

వివిధలో 'మూడు ప్రశ్నలు' అనే శీర్షికలో రైటర్, పబ్లిషర్ మల్లికార్జున్ ఇంటర్వ్యూ చదివాక (19 ఆగస్ట్ 2024), వారు తమ అజు పబ్లికేషన్స్ తరఫున వేసిన ఒక పుస్తకాన్ని ముప్పై మూడు వేల కాపీలు అమ్మారని తెలిసాక, కుతూహలంతో ఆ పుస్తకాన్ని కొని చదివాను. 'అమ్మ డైరీలో కొన్ని పేజీలు' కవితాత్మక శైలిలో ఒక నాటకీయమైన కథని కళ్ళ ముందు జరుగుతున్నట్టు చెప్పే నవల. ఈనాటి కాలం లోంచి ఒకనాటి ప్రేమల్ని చూపిస్తుంది. అలా తరాల్ని దాటి చెప్పటం కూడా ఈ నవల అప్పీల్‌ని పెంచింది కావొచ్చు. ఈ నవల చదివితే ఒకప్పటి మాదిరెడ్డి సులోచన, కొమ్మనాపల్లి గణపతిరావు వంటి రచయితల శైలి గుర్తుకు వచ్చింది. వీరిని అప్పట్లో పాపులర్ రచయితలు అని పిలిచేవారు.

పాపులర్ రచయితలు తెలుగులో కొన్ని దశాబ్దాల పాటు రాజ్యమేలారు. ప్రధానంగా పంతొమ్మిది వందల డెబ్బై, ఎనభై, తొంభై దశకాల్లో ఒక వెలుగు వెలిగారు. కానీ తొంభైల తర్వాత, ఇక్కడ కేబుల్ టీవీ రావటం తోపాటే, వీరి నవలల పాపులారిటీ తగ్గిపోయింది (ఆ పాఠకులు టీవీ సీరియల్స్ వైపు మళ్ళటం చేత, ఆ రచయితలు కూడా చాలామంది టీవీ సీరియల్స్ రాయటం వైపే వెళ్ళిపోయారు). ఆ తర్వాత ముప్పై ఏళ్ళ పాటు తెలుగులో పాపులర్ సాహిత్యం అన్నది దాదాపు లేదు. ఇప్పుడు ఒక నవల ఇంత ప్రాచుర్యం పొంది ఇన్ని కాపీలు అమ్ముడుపోవడాన్ని బట్టి తెలుగులో పాపులర్ సాహిత్యం మళ్ళీ రంగ ప్రవేశం చేస్తున్నదా అన్న ఆలోచన కలిగింది. ఎందుకంటే ముప్పై వేల కాపీలంటే చిన్న విషయం కాదు. యండమూరి, మల్లాది వంటి పాపులర్ రచయితల ప్రభ దేదీప్యమానంగా వెలిగిన దశలో కూడా ఒక నవల ఇంత తక్కువ సమయంలో ఇన్ని కాపీలు అమ్ముడుపోవటం అరుదైన విషయమే.

పాపులర్ సాహిత్యం బాగా చేయగలిగేదీ, సీరియస్ సాహిత్యం చేయలేనిదీ ఒకటుంది. అది కొత్త పాఠకుల్ని సాహిత్యం వైపు రప్పించడం. ఇప్పుడు యాభైల అరవైల వయసులో ఉన్న చాలామంది పాఠకులని "మీకు సాహిత్య అభిరుచి ఎలా కలిగిందీ, మీరు చదివిన మొదటి పుస్తకాలు ఏమిటీ" అని అడిగితే వారిలో ఎక్కువమంది ఆనాటి పాపులర్ సాహిత్యం వైపే వేలెత్తి చూపిస్తారు. ఆనాటి పాపులర్ రచయితలే చాలామంది పాఠకుల్ని "చదవడం" వైపు ఆకర్షితుల్ని చేశారన్నది చాలావరకు నిజం. అలా చదవటం మొదలు పెట్టిన పాఠకుల్లో కొంతమంది అక్కడితో ఆగిపోకుండా సీరియస్ సాహిత్యం వైపు వెళ్ళారు. అయితే సీరియస్ సాహిత్యానికీ పాపులర్ సాహిత్యానికీ మన సాహిత్య వాతావరణంలో కొన్ని చిత్రమైన పేచీలు ఉన్నాయి.

అవేమిటో చెప్పుకునే ముందు- అసలు పాపులర్ సాహిత్య ప్రభ వెలిగిపోతున్న ఆ రోజుల్లో వచ్చిన సీరియస్ సాహిత్యం ఏమిటీ అన్నది ఒకసారి చూడాలి. ఆ రోజుల్లో సీరియస్ సాహిత్యం అంటే కమ్యూనిస్ట్ భావజాలంతో ఏదో రకంగా ముడిపడి ఉన్నదే. ఈ కమ్యూనిస్ట్ భావజాలం గల రచయితలు పాపులర్ సాహిత్యాన్ని ఈసడించుకున్నారు. ఆనాడు వార పత్రికల ద్వారా ఎక్కువ ప్రచారం పొందిన పాపులర్ సాహిత్యాన్ని బూతు సాహిత్యం అన్నంతగా విమర్శించారు. 1953లో శ్రీశ్రీ "వార పత్రికలంటే పెట్టుబడికీ కట్టుకథకీ పుట్టిన విషపుత్రికలు" అన్నారు. ఇది చాలావరకు నిజమే కూడా. హీరోయిన్ల జాకెట్ కొలతల్ని ఊహించమని పాఠకులకి క్విజ్‌లు పెట్టిన దశ ఒకటి పత్రికల్లో నడిచిందనీ, ఇప్పటి యూట్యూబ్ థంబ్‌నైల్స్‌కి మించిన దిగజారుడుతనం ఆనాటి కొన్ని వార పత్రికల్లో కనిపించేదనీ మరిచిపోలేం. అయితే అది ఎంత నిజమో, పాపులర్ సాహిత్యం పట్ల లెఫ్ట్ భావజాల రచయితల స్పందనలో కొంచెం అతి ఉన్నదన్నదీ అంతే నిజం.

ఒక నవల ముప్పై వేల కాపీలు దాటి అమ్ముడుపోయిందన్న విషయం చూస్తే తెలుగులో పాపులర్ నవల మరోసారి పునర్జన్మ ఎత్తనున్నదా అన్న ఆలోచన కలుగుతున్నది. మరి ఇప్పుడు లెఫ్ట్ భావజాలం అంత తీవ్రంగా లేదు. ఈ వాతావరణంలో పాపులర్ సాహిత్యం మళ్ళీ రంగప్రవేశం చేస్తే, మన ప్రస్తుత సాహిత్య వాతావరణం దానికి ఎలా స్పందిస్తుందీ అన్నది ఆసక్తికరమైన విషయం.

ఉదాహరణకి, అమెరికాలో స్టీఫెన్ కింగ్ ఏదో హారర్ నవల రాశాడని టోనీ మారిసన్ విరుచుకుపడలేదు. సిడ్నీ షెల్డన్ నవలల పాపులారిటీ చూసి ఏ సాల్మన్ రష్దీనో పబ్లిక్‌గా ఉడుక్కోలేదు. కానీ ఇక్కడ యండమూరి 'తులసీదళం' నవలకి వస్తున్న పాపులారిటీ చూసి రంగనాయకమ్మ స్థాయి రచయితలు కూడా విరుచుకుపడ్డారు. 'తులసీదళం కాదు, గంజాయి దమ్ము' అనీ, క్షుద్ర సాహిత్యమనీ చాలామంది కఠిన విమర్శలు ఎక్కుపెట్టారు. విమర్శ లేకపోతే అలాంటి సాహిత్యం పెరిగిపోతుందన్నది వాళ్ళ వాదన. వేరే దేశాల్లో పాపులర్ సాహిత్యాన్నీ ఆయా సాహిత్య వాతావరణాలు అంగీకరించాయి. మొత్తం సాహిత్య వాతావరణంలో పాపులర్ సాహిత్యానికీ స్థానం ఉన్నదని ఒప్పుకున్నాయి. తెలుగులో మటుకు దాన్ని కుష్టురోగిని దూరం పెట్టినట్టు దూరం పెట్టడానికి ప్రయత్నించారు. మొత్తానికి తొంభైల తర్వాత పాపులర్ సాహిత్యానికి రకరకాల కారణాలతో సహజ మరణం ప్రాప్తించింది.

ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్ సాయం తోనో, మీమ్ పేజీస్ సాయం తోనో ఎలాగైతేనేం ఒక నవల ముప్పై వేల కాపీలు దాటి అమ్ముడుపోయిందన్న విషయం చూస్తే తెలుగులో పాపులర్ నవల మరోసారి పునర్జన్మ ఎత్తనున్నదా అన్న ఆలోచన కలుగుతున్నది. మరి ఇప్పుడు లెఫ్ట్ భావజాలం అంత తీవ్రంగా లేదు. ఈ వాతావరణంలో పాపులర్ సాహిత్యం మళ్ళీ రంగప్రవేశం చేస్తే, మన ప్రస్తుత సాహిత్య వాతావరణం దానికి ఎలా స్పందిస్తుందీ అన్నది ఆసక్తికరమైన విషయం. దాన్నీ సాహిత్యంలో ఒక భాగంగా ఆహ్వానిస్తుందా, లేక ఇదివరకట్లాగే వెలేయటానికి ప్రయత్నిస్తుందా? అలాగే ఒకప్పటి పాపులర్ సాహిత్యం లాగే ఇప్పటి పాపులర్ సాహిత్యమూ పాఠకుల బలహీనతల మీద ఆధారపడే మనుగడ కొనసాగిస్తుందా? లేక వేరే కొత్త దారేదైనా కనుక్కుంటుందా? లేక రెండూ కలిసి ఉంటూనే విడివిడిగా ఎలాగోలా కొనసాగుతాయా? అసలు అవి ఒక గీత గీసి విడదీయగలిగేంత వేర్వేరు విషయాలేనా? ఇవన్నీ ఆసక్తికరమైన ప్రశ్నలు. వీటి జవాబులెలా ఉన్నా తెలుగు అక్షరం వైపు కొత్త పాఠకులు రావటం మంచి విషయమే అంటే ఎవరికీ పేచీ ఉండకపోవచ్చు.

■ కావేరి గోపాల్

kaveripedapudi67@yahoo.com

చదువు ముచ్చట

దళితవాద సాహిత్యమన్నా, కవిత్వమన్నా ఇష్టం

నరేష్కుమార్ సూఫీ

ఆఖరుగా ఏ పుస్తకాన్ని చదివి బాగా ఇష్టపడ్డారు?

వసుదేంద్ర తేజోతుంగభద్ర (తెలుగు అనువాదం). దాని తరువాత కూడా చదివిన పుస్తకాలు ఉన్నాయిగానీ, ఈ మధ్య కాలంలో అంతగా ఆకట్టుకున్న పుస్తకం మరొకటి ఇంకా తగల్లేదు.

బాల్యంలో/ యవ్వనంలో మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవటం గుర్తుంది?

బాల్యంలో అంటే చెప్పలేను గానీ, నా పంతొమ్మిదేళ్ల వయసులో ఎక్కువసార్లు, ఎక్కువరోజులు చదివిన పుస్తకం చెలం 'శశిరేఖ'. చెలం ఆడవాళ్ల వైపు నుంచి రాశాడూ అంటారు గానీ నాకెందుకో పురుషుల గురించి, పురుషుల స్వభావాలను ఎత్తిచూపుతూ రాశాడనిపిస్తుంది.

ఒకప్పటికీ ఇప్పటికీ మీరు చదివే తీరు ఎలా మారింది?

నాన్న పరిచయం చేసిన రామాయణ, మహా భారతాలతో మొదలై స్కూల్ డేస్‌లో మధుబాబు, తరవాతి కాలంలో యండమూరి, యద్దనపూడి సులోచనారాణి, సూర్యదేవర రామ్మోహనరావు లాంటి రచయితలని చదివేవాడ్ని. ఏకైక కారణం- అవి మాత్రమే అందుబాటులో ఉండటం. ఆ తరువాత ఎంపిక మారింది. ఇప్పుడు ఫిక్షన్‌కి పూర్తిగా దూరం కాలేదు గానీ చరిత్ర, మైథాలజీల ఆధారంగా వచ్చే రచనలన్నా, భారతదేశ సామాజిక అంశాల మీద వచ్చే రచనలన్నా ఇష్టంగా ఉంటుంది. ఇక కవిత్వం విషయంలో దళితవాద సాహిత్యమన్నా, కవిత్వమన్నా ఇష్టం. మద్దూరినో, కలేకూరినో, ఎండ్లూరి సుధాకర్‌నో చదివినంత ఉద్వేగంగా మిగతా కవిత్వాన్ని చదవలేను. మన చరిత్రని, సమకాలీన సమాజాన్ని సులభంగా అర్థం చేసుకోవటానికి ఈ రకం సాహిత్యం ఉపయోగపడుతుంది అనిపిస్తుంది. ఒక సినిమా కథ లాంటి నవలని/ అందాన్ని వర్ణించే కవిత్వాన్ని మాత్రమే చదివి 'నేను చదువరిని' అనుకోవటం ఇప్పుడు ఇబ్బందిగా ఉంటుంది.

మీ నమ్మకాల్ని, దృక్పథాన్ని ప్రభావితం చేసిన రచయిత?

ఇద్దరున్నారు.. కళ్యాణరావు, కాశీభట్ల వేణుగోపాల్. ఈ ఇద్దరూ నాలో ఉన్న చిన్నప్పటి నమ్మకాలనీ, నా ఆలోచనా తీరునీ మార్చుకునేందుకు ఉపయోగపడ్డారు. ఒకరు నా చుట్టూ ఉన్న సమాజాన్ని అర్థం చేసుకోవటానికి, మరొకరు నన్ను నేనే చెక్ చేసుకోవటానికి. అయితే ఈ ఇద్దరిలోనూ ఒకరే అంటే మాత్రం కళ్యాణ రావుగారి వైపే మొగ్గుతాను. నా చుట్టూ ఉన్న సమాజాన్ని ఎన్ని పొరలుగా విడదీసి చూస్తే అర్థం చేసుకోగలమో తెలుసుకోవటానికి ఆయన చాలా ఉపయోగపడ్డారు.



సాహిత్యంలో మీకు ఆల్టర్ ఈగోలా అనిపించిన పాత్ర ఏది, ఎందుకు?

కాశీభట్ల వేణుగోపాల్ 'నేనూ చీకటి' నవల లోని ప్రధాన పాత్ర. అత్యంత నిర్లక్ష్యంగా ఉంటూనే విపరీతమైన ప్రేమలో మనుషులని చూసే మనిషిలా ఉండగలగటం అంత ఈజీ కాదనిపిస్తుంది. ఎవ్వరి మీదా వ్యతిరేకత లేని మనిషి అందరినీ వ్యతిరేకించే వ్యక్తిగా మారాలని, అతనిలా ఉండాలనీ అనిపిస్తూ ఉంటుంది.

అందరూ గొప్పదని చెప్పినా మీకు అంతగా నచ్చని పుస్తకం?


వడ్డెర చండీదాస్ గారి 'హిమజ్వాల' ఎందుకో మరీ సాగదీసినట్టుగా అనిపించింది. అన్ని పేజీలని వాడకుండా కూడా కథ చెప్పొచ్చన్నది నా అభిప్రాయం. ఇక్కడ ఆయనని ఏమాత్రం కించపరచటం లేదు గానీ నా వరకూ ఆ పుస్తకమ్మీద ఉన్న ఉద్దేశం మాత్రం అంతే.

ఏ గత కాలం రచయితనైనా కలిసి మాట్లాడగలిగితే ఎవరితో, ఏం మాట్లాడతారు?

త్రిపుర. "ఇంత రిచ్ ఫెల్లోవి కదా. హాయిగా బతికేయకుండా ఇలాంటి కథలని రాసేంత విషాదం నీ జీవితంలో ఎక్కడ ఉంది? అంతటి బాధని దాచుకున్నావా? రాయటం కోసం తెచ్చిపెట్టుకున్నావా?" అని అడగాలని ఉంది.

ఏదైనా పుస్తకం నుంచి మీకు తరచుగా గుర్తొచ్చే వాక్యం/ కవితా పంక్తి?

అనామధేయుడు అనబడు కవి రాసిన ఈ వాక్యాలు దాదాపుగా ఏదో ఒక సందర్భంలో తలుచుకునే మాటలు:
"కవిత్వమంటే కమ్యూనిస్టు మేనిఫెస్టో కాదేమో గానీ
గ్రీన్‌హంట్‌లో చెదిరిపడిన దేహాల ధిక్కారనయనాలు మాత్రం
కచ్చితంగా కవిత్వమే..."



"...ఈ ఇద్దరిలోనూ ఒకరే అంటే మాత్రం కళ్యాణ రావుగారి వైపే మొగ్గుతాను. నా చుట్టూ ఉన్న సమాజాన్ని ఎన్ని పొరలుగా విడదీసి చూస్తే అర్థం చేసుకోగలమో తెలుసుకోవటానికి ఆయన చాలా ఉపయోగపడ్డారు."

(నరేష్కుమార్ సూఫీ కవి, కథకుడు. అతని కవిత్వ సంపుటి 'నిశ్శబ్ద', కథల సంపుటి 'పేరులేని వెన్నెల'.)




మునేరు వరదలో చిక్కుకున్న ప్రయాణికులను క్రేన్ ద్వారా తీసుకువెళ్తూ..



విజయవాడలో నీటమునిగిన వైఎస్సార్ కాలనీ



చుట్టుముట్టిన మంపుతో.. గంటగంటకూ పెరుగుతున్న వరదతో.. ఎటూ కదల్లేక దిక్కుతోచని దైన్యంతో.. సహాయం కోసం ఆర్తనాదాలతో.. బెజవాడ గజగజా వణికింది. చెట్టుకొకరు.. పుట్టకొకరు.. మేడకొకరు.. మిద్దెకొకరు.. గోడకొకరు.. ఇలా ఎవరికి ఏది దొరికితే అది పట్టుకుని తమను తాము రక్షించుకున్నారు. రెండ్రోజులుగా కురిసిన వర్షానికి, ఎగువ నుంచి వస్తున్న వరద తోడవడంతో దశాబ్ద కాలంలో ఎన్నడూ చూడని ప్రళయాన్ని చూశారు. ఒకపక్క బుడమేరుకు మునేరు తోడై సగం నగరాన్ని ముంచేసింది. మరోపక్క ప్రకాశం బ్యారేజీకి గత పదిహేనేళ్ల తర్వాత రికార్డు స్థాయిలో వరద పోటెత్తింది. ఎగువ నుంచి ఇంకా వరద పెరుగుతుండటంతో ఏ క్షణాన్నైనా నగరాన్ని వరద ముంచెత్తుతుందని జనం భయబ్రాంతులకు గురవుతున్నారు. ఆదివారం బెజవాడలో కనిపించిన ఈ దృశ్యాలు ప్రతి ఒక్కరినీ కదిలించాయి.



ప్రకాశం బ్యారేజీ

పదేళ్లకోసారి వరద పోటు!

ప్రతి పదేళ్లకు ప్రకాశం బ్యారేజీకి వరద తాకిడి

- ఇప్పటిదాకా 2009లో రికార్డు స్థాయిలో వరద
- ఇప్పుడు 10 లక్షల క్యూసెక్కులకు చేరిక..
- భయం గుప్పెట్లో పరివాహక ప్రాంతవాసులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ప్రతి పదేళ్లకొకసారి ప్రకాశం బ్యారేజీకి భారీస్థాయిలో వరదలు వస్తుంటాయి. ఈసారి ఐదేళ్లకు ఆ పరిస్థితి వచ్చింది. ఎగువ ప్రాజెక్టుల నుంచి విడుదలవుతున్న నీటితో ప్రకాశం బ్యారేజీకి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. గంటగంటకూ వరద ఉధృతి పెరుగుతోంది. ఈ పరిస్థితి నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న నివాసితులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీకి 8.69 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. బ్యారేజీ అన్ని గేట్లను పూర్తిస్థాయిలో పైకి ఎత్తారు. ఎగువ నుంచి వస్తున్న నీరు మొత్తంగా సముద్రంలోకి వెళ్తోంది. దీంతో నదీ పరివాహక ప్రాంతంలోని నివాసాలు, పొలాలు పూర్తిగా నీట మునిగాయి.

పదేళ్ల సంప్రదాయానికి బ్రేక్ పడుతుందా?

ప్రకాశం బ్యారేజీని 1954-57 మధ్య నిర్మించారు. బ్యారేజీ చరిత్రలో తొలిసారిగా అత్యధికంగా వరద 1998లో వచ్చింది. ఆ సంవత్సరం 9.32 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. దీంతో గేట్లు మొత్తం నీటిలో మునిగిపోయాయి. ఆ తరువాత గేట్లను పటిష్ట పరిచారు. 2005లో 7.4 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. 2009లో అత్యధికంగా 11.10 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. దీంతో నగరం మొత్తం నీట మునిగింది. నదికి ఆనుకుని ఉన్న ప్రాంతాలన్నీ కొన్ని రోజులపాటు నీటిలో ఉన్నాయి. 2019లో వచ్చిన వరద 10లక్షల క్యూసెక్కుల వద్ద ఆగిపోయింది. ఆ తర్వాత బ్యారేజీకి భారీగా వరద వచ్చిన దాఖలాలు లేవు. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఇప్పటికే ప్రకాశం బ్యారేజీకి 8.69 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ఆదివారం రాత్రికి మరింతగా పెరిగే అవకాశం ఉంది. బ్యారేజీ వద్ద ప్రస్తుతం రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఎగువ నుంచి వరద ఇంకా పెరిగితే అది ప్రకాశం బ్యారేజీని తాకుతుంది. ఇది జరిగితే 10 లక్షల క్యూసెక్కులు దాటుతుందని అధికారులు భావిస్తున్నారు.

రిటైనింగ్ వాల్ నిర్మాణంతో పరివాహక ప్రాంతాలు సేఫ్

ప్రకాశం బ్యారేజీకి ఎప్పుడు వరద వచ్చిన విజయవాడలోని కృష్ణలంక, రణదివె నగర్, గీతానగర్, రామలింగేశ్వరనగర్, బాలాజీనగర్ ప్రాంతాల్లో ఉన్న నివాసితులను పునరావాస కేంద్రాలకు తరలించాల్సి వచ్చేది. 2014లో అధికారంలో ఉన్న చంద్రబాబు కొంతమేరకు నది వెంబడి రిటైనింగ్ వాల్ నిర్మించారు. తర్వాత 2019లో బస్టాండ్ వద్ద ఉన్న పద్మావతి ఘాట్ వరకు రిటైనింగ్ వాల్‌ను నిర్మించారు. దీంతో నగరంలో నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న నివాసితులకు ముంపు బాధ తప్పింది. యనమలకుదురు దాటిన తర్వాత నది వెంబడి ఉన్న పొలాలు, ఇళ్లకు ముంపు బాధ తప్పడం లేదు.

జల ప్రళయం

వరదపోటుకు వణికిన బెజవాడ

కనుచూపు మేర నీటితో చెరువులుగా కాలనీలు

- తలదాచుకునేందుకు మిద్దెలు.. అంతస్తుల్లోకి జనం
- ప్రకాశం బ్యారేజీకి భారీగా పెరుగుతున్న వరద



విజయవాడలో వరద ప్రాంతంలో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు

నగరంలో ఇలా..



నడుములోతు నీళ్లలో నడుకుంటూ...



బుడమేరు పొంగడంతో కాలనీలు నిండిపోయి...



వరద నీటిలో రైల్వేస్టేషన్ ఇలా..



వరద తాకిడికి ఇళ్లలోకి చేరిన నీరు



నీట మునిగిన వైఎస్సార్ కాలనీ



వరదలో మునిగిపోయిన కారు, నీళ్లలో జనం పాట్లు

అర్ధ శతాబ్దిగా ఆక్రందనలే!

- బెజవాడకు వణికిస్తున్న బుడమేరు
- వరద నివారణకు వెలగలేరు హెడ్ రెగ్యులేటరీ నిర్మాణం
- దీని సామర్థ్యం 15 వేల క్యూసెక్కులే
- వచ్చింది 30 వేల క్యూసెక్కుల వరద
- చరిత్రలో అతి పెద్ద వరద ఇదే..

దశాబ్దంన్నరగా ఉగ్రరూపం దాల్చని బుడమేరు మళ్లీ ఇప్పుడు మహోగ్రరూపం దాల్చింది. చరిత్రలోనే ఎప్పుడూ లేనంతగా ఉప్పొంగింది. ప్రళయంలా నగరంపై విరుచుకుపడింది. వేలాది కుటుంబాలను అతలాకుతలం చేసింది. వారికి బాహ్య ప్రపంచంతో సంబంధాలను తెంచేసింది. నీళ్లు లేవు. నిద్ర, తిండీ ఏమీ లేవు. పిల్లలతోసహా కుటుంబాలన్నీ కట్టకట్టుకుని కట్టుబట్టలతో ఇంటిపైకెక్కి, రోజంతా నిలబడేలా చేసింది. ఆరు దశాబ్దాలలో ఎన్నడూ ఎదుర్కోని విపత్తు ఇది. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

పదేహేనేళ్ల కిందట ఇలా..

బుడమేరు వరదను నియంత్రించటానికి 15 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెలగలేరు దగ్గర హెడ్ రెగ్యులేటరీని ఏర్పాటు చేశారు. అప్పట్లో బుడమేరుకు వచ్చిన వరద 17000 క్యూసెక్కులు. డైవర్షన్ కెనాల్ ద్వారా 9900 క్యూసెక్కులు బయటకు వదిలారు. మిగిలిన 7100 క్యూసెక్కులు కారణంగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని అనేక ప్రాంతాలు నీట మునిగాయి.

తాజా పరిస్థితి ఇలా..

రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు 30 వేల క్యూసెక్కుల హెడ్ రెగ్యులేటరీ వద్దకు చేరింది. వెలగలేరు రెగ్యులేటరీ ద్వారా 10 వేల క్యూసెక్కులు వదిలారు. 20 వేల క్యూసెక్కుల వరద ఒక్కసారిగా దిగువకు ఉప్పొంగింది. దీంతో పాములు కాలువ తదితర చోట్ల గండ్లు పడి వరద పోటెత్తింది.

బుడమేరుకు భారీ వరదలు

బుడమేరుకు ఇప్పటి వరకు ఆరు సార్లు భారీగా వరదలు వచ్చాయి. ఇది ఏడోసారి. మొదటిసారిగా 1964లో బుడమేరు చరిత్రలోనే అత్యధికంగా 39.595 క్యూసెక్కుల వరద రాగా డైవర్షన్ పోను దిగువకు 28,470 క్యూసెక్కుల వరదను వదిలారు. మళ్లీ ఇప్పుడు 20 వేల క్యూసెక్కుల వరద దిగువకు ఉప్పొంగింది.

వరదలకు కారణం ఏమిటి?

నగరంలో బుడమేరు ఉత్తర, పశ్చిమ భాగంలో ప్రవహిస్తుంది. రెండు రోజుల పాటు ఏకబిగిన వర్షాలు కురిస్తే ఇరిగేషన్ శాఖ అధికారులు నీటిని దిగువకు విడుదల చేయాల్సి వస్తోంది. బుడమేరు డ్రెయిన్ పూడుకుపోవటం, గుర్రపుడెక్క వంటి కలుపు మొక్కలు పెరిగిపోవటం, వరద గట్లను ఆక్రమించటం, వరదనీటి మళ్లింపు కాల్వలు పూడుకుపోవటం తదితర కారణాల వల్ల వరద పట్టణంలోని అనేక ప్రాంతాలను ముంచెత్తుతుంది.





చిట్టినగర్‌లోని మిల్క్ ఫ్యాక్టరీ వద్ద ఇలా..

రేషన్ వరదార్పణం

విజయవాడ, (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాలో 125కుపైగా రేషన్ డిపోలు నీటమునిగాయి. బుడమేరు వరద కారణంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో కొత్తపేట, భవానీపురం, దేవీనగర్‌లలోని రేషన్ దుకాణాల్లోని నిత్యావసరాలు వరదార్పణమయ్యాయి. ● ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా మొత్తంగా 957 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటిలో ఒక్క విజయవాడ పరిధిలోనే 325 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటిలో 100కుపైగా రేషన్ దుకాణాల్లోని బియ్యం, పంచదార నిత్యావసరాలు వరదపాలయ్యాయి. గ్రామీణ ప్రాంతాల పరిధిలో మరో 25 రేషన్ దుకాణాలు నీటమునిగాయి.

కృష్ణమ్మ మహోగ్రం!

జల దిగ్బంధనంలో లంక గ్రామాలు

- 9.06 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల
- నీటమునిగిన పంటపొలాలు



వరద ప్రాంతంలో ఎంపీ కేశినేని చిన్ని పర్యటన

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం : జిల్లాను వర్షాలు వీడినా కృష్ణానదికి వరద రూపంలో ప్రమాదం ముంచుకొస్తోంది. భారీవర్షాల కారణంగా ఇప్పటికే జిల్లాలోని అన్ని మండలాల్లో పంటలపొలాలు నీటిమునిగిపోయాయి. కృష్ణానదికి వరద కారణంగా లంకగ్రామాల్లో సాగుచేసిన ఉద్యానపంటలు పూర్తిగా నీటమునిగాయి. ఆదివారం సాయంత్రానికి ప్రకాశం బ్యారేజీనుంచి 9.06 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలో వదులుతున్నారు. దీంతో ప్రకాశం బ్యారేజీ దిగువన ఉన్న లంకగ్రామాలు వరదనీటిలో చిక్కుకుపోయాయి. ఉయ్యూరు, గుడివాడ, మచిలీపట్నం డివిజన్‌లలో 26 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి 1017 మందిని వీటిలోకి తరలించినట్లు కలెక్టర్ బాలాజీ తెలిపారు.

జిల్లాలోని పరిస్థితి ఇదీ

● బాపులపాడు మండల పరిధిలోని చెన్నై కోల్‌కతా జాతీయ రహదారి-16పై బొమ్ములూరు సమీపంలో నాలుగు కిలోమీటర మేర మూడు అడుగుల ఎత్తున నీరు ప్రవహిస్తోంది. ఈ రహదారి వెంబడి ఆదివారం తెల్లవారుజాము నుంచి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆరు కిలోమీటర్లమేర వాహనాలు బారులుతీరాయి. మండలంలోని రామన్నగూడెం, కాకులపాడు, రంగయ్యప్పారావుపేట తదితర గ్రామాల్లో వరిపొలాలు నీటమునిగాయి.

● పామర్రు మండలం కొరిమెర్ల, ప్రాకర్ల గ్రామాల్లోని వరిపొలాలు వరిపొలాలు నీటమునిగాయి.

● పులిగడ్డ అక్విడెక్టు వద్ద ఆదివారం సాయంత్రానికి వరదనీటిమట్టం 19 అడుగులకు చేరింది. దీంతో పులిగడ్డ అక్విడెక్టుపై నుంచి ప్రమాదకర స్థితిలోనీరు ప్రవహిస్తోంది. సోమవారం నాటికి 10 లక్షల క్యూసెక్కులకుపైగా నీటి ప్రవాహం పెరుగుతుందని నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. అవనిగడ్డ మండలంలోని ఎడ్లంక, దక్షిణ చిరువోలులంక, కే-కొత్తపాలెం, నాగాయలంక మండలం చినపల్లెపాలెం గ్రామాలు వరదనీటిలో చిక్కుకుపోయాయి. నాగాయలంక మండలంలోని గొల్లమంద-జికపాలెం వెళ్లేరహదారి కృష్ణానది వరద ఉధృతి కారణంగా కొట్టుకుపోతోంది. చల్లపల్లి మండలంలోని నడకుదురు, వెలివోలు, నిమ్మగడ్డ, రాముడుపాలెంలలోని పంటపొలాలు నీటమునిగాయి.

● పెనమలూరు మండలంలోని యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం గ్రామాల్లోకి వరదనీరు చేరింది. ఈ మండల పరిధిలోని లంకగ్రామాల్లో సాగుచేసిన పసుపు, చెరకు, కంద, తమలపాకు, అరటితోటలతోపాటు వరిపొలాలు నీటిలో మునిగాయి.

● గుడివాడ నియోజకవర్గం నందివాడమండలం పుట్టగుంట సమీపంలో బుడమేరు పొంగి ప్రవహిస్తోంది.

● గన్నవరం మండలం కొండపావులూరు వద్ద ఎన్‌డీఆర్‌ఎఫ్ క్యాంప్‌కు వెళ్లే రహదారికి గండిపడింది. ఆర్డీవో పద్మావతి ఈ ప్రాంతాన్ని పరిశీలించారు.



గన్నవరం మండలం ఎన్‌డీఆర్‌ఎఫ్ క్యాంపునకు వెళ్లే దారిలో పడిన గండి



వడ్లమన్నాడులో చెరువును తలపిస్తున్న వరిచేను

జిల్లా యంత్రాంగం అప్రమత్తం, కలెక్టర్ బాలాజీ

కృష్ణానదికి వరదప్రవాహం పెరగడంతోజిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు కలెక్టర్ బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ లంక గ్రామాల్లో ప్రజలను బయటకు తీసుకు వచ్చేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి పడవలను, బస్సులను అందుబాటులో ఉంచామని తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించినట్లు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో మీకోసం కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు చెప్పారు.

గుడివాడలో జనసైనికుల ఆగ్రహం

- రవికిరణ్ పరామర్శకు వచ్చిన పేర్ని నాని
- రాళ్లు, కోడిగుడ్లతో వైసిపి నేత కారుపై దాడి
- పెట్రోల్ పోసి తగలబెట్టే ప్రయత్నం
- నిలువరించేందుకు పోలీసుల ప్రయత్నాలు



8లో..

మునేరు మహోగ్రం

7లో..

ఎనిమిది లంక గ్రామాలు జలదిగ్బంధం

ఆంధ్రజ్యోతి

నవ్య | చిత్రజ్యోతి

సోమవారం • 2 సెప్టెంబరు 2024

cinema@andhrajyothy.com





బాలయ్యతో కలసి ఓ ఫ్యాక్షన్ సినిమా చేయాలని ఉంది

నందమూరి బాలకృష్ణ నటుడిగా సినీ ఇండస్ట్రీలో యాభై వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్ర పరిశ్రమ, అభిమానులు కలసి ఆదివారం బాలయ్య సినీ స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ నోవాటెల్ ఆడిటోరియమ్ వేదికగా జరిగిన ఈ వేడుకకు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.దీనికి నందమూరి కుటుంబ సభ్యులతో పాటు మెగాస్టార్ చిరంజీవి, కమల్‌హాసన్, మోహన్‌బాబు, వెంకటేశ్, టి. సుబ్బరామిరెడ్డి, రఘు రామ కృష్ణం రాజు, కె, రాఘవేంద్రరావు, మురళీమోహన్, విజయేంద్ర ప్రసాద్, అశ్వినీదత్, సుహాసిని, మంచు విష్ణు, మాలాశ్రీ, నవీన్, రవి శంకర్, గోపీచంద్, బోయపాటి శ్రీను, పి.వాసు, జయసుధ కుటుంబం, విశ్వక్ సేన్, తదితరులు పాల్గొన్నారు. కన్నడ పరిశ్రమ నుంచి శివ రాజ్ కుమార్, ఉపేంద్ర కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ 'తెలుగు చిత్ర పరిశ్రమ అంతా కలిసి ఇలా వచ్చినందుకు అభినందిస్తున్నాను. 110 సినిమాలు చేయడం చాల కష్టం, మీరు 50 ఏళ్ల నుంచి సినిమాలు చేసినందుకు అభినందనలు. మీకు ఓపిక ఉన్నంత వరకు, ఊపిరి ఉన్నంత వరకు మీరు సినిమాలు చేయాలి. మేము అంతా మీతో ఉంటాం. జై బాలయ్య అనేది ఒక మంత్రం, అందులో ఉన్నంత ఎనర్జీ ఇంకా ఇక్కడ ఉండదు' అన్నారు. ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ 'బాలకృష్ణగారితో అసెంబ్లీలో కూర్చుంటూ ఉంటాం. ఇప్పుడు ఈ ఫంక్షన్‌లో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో వరదల కారణంగా ముఖ్యమంత్రిగారు రాలేకపోయారు. ఆయన తరపున నేను వచ్చాను. బాలయ్య గారు సినిమా రంగంలో, వైద్య సేవ రంగంలో, రాజకీయ రంగంలో ఇలాగే కొనసాగాలి అని, దేవుడు మిమ్మల్ని నిండు నూరేళ్ళు చల్లగా ఉండేలా దీవించాలని కోరుకుంటున్నాను' అన్నారు. చిరంజీవి మాట్లాడుతూ 'ఇది బాలయ్యకు మాత్రమే కాదు తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించిన వేడుక.



చిరంజీవి

అరుదైన రికార్డ్‌ను బాలయ్య సొంతం చేసుకున్నందుకు ఆనందంగా ఉంది. ఎన్టీఆర్‌గారికి ప్రజల మదిలో ప్రత్యేక స్థానం ఉంది. బాలకృష్ణ తండ్రి చేసిన పాత్రలు సైతం చేసి ప్రేక్షకులను మెప్పించడం సామాన్యమైన విషయం కాదు. నేను ఇంద్ర సినిమా చేయడానికి కారణం బాలకృష్ణ చేసిన 'సమరసింహారెడ్డి' చిత్రం. బాలయ్యతో కలసి ఓ ఫ్యాక్షన్ సినిమా చేయాలన్నది నా కోరిక అన్నారు.

కమల్ హాసన్ మాట్లాడుతూ 'అందరినీ గుర్తుపెట్టుకుని పలకరించే సంస్కారం ఉన్న వ్యక్తి బాలయ్య. ఆయనకు తండ్రి, దైవం, గురువు ఒక్కరే.. ఎన్టీఆర్ గారు. బాలయ్య అంటే స్వచ్ఛమైన మనసు, స్వేచ్ఛగా ఉండే మనిషి. ఆయన నిండు నూరేళ్ళు ఆరోగ్యంతో, ఐశ్వర్యంతో బావుండాలి అని కోరుకుంటున్నాను' అన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'బాలయ్య గారు మీరు యాభై ఏళ్లు ఇలా నటనా రంగంలో ఉండటం, వైద్య రంగంలో ఇలా సేవ చేయడం మేము చూస్తూనే పెరిగాం. నాకు తెలిసిన వాళ్ళు కూడా మీ ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నారు. మీరు ఎప్పుడూ ఇలాగే నవ్వుతూ ఉండాలి' అన్నారు.




లింగవివక్ష, మహిళలపై లైంగిక వేధింపులపై మాలీవుడ్ చిత్ర పరిశ్రమ అట్టుడుకుతున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ ప్రకంపనలు క్రమంగా తెలుగు చిత్రపరిశ్రమను కూడా తాకుతున్నాయి. జస్టిస్ హేమ కమిటీ నివేదిక వెలువడిన నేపథ్యంలో చిత్ర పరిశ్రమలోని మహిళలపై వేధింపులను నిరసిస్తూ టాలీవుడ్ కథానాయిక సమంత మరోసారి గళం విప్పారు. టాలీవుడ్‌లో మహిళలపై జరుగుతున్న వేధింపులపై 2019లో ఏర్పాటు చేసిన సబ్ కమిటీ నివేదికను ఇప్పుడు బయటపెట్టాలని ఆమె తెలంగాణ ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. దాన్ని బహిర్గతం చేయడం వల్ల తెలుగు చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులను అరికట్టేందుకు అవసరమైన విధి విధానాలను రూపొందించడంలో ప్రభుత్వానికి ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. వాయిస్ ఆఫ్ ఉమెన్ ఇన్ టీఎఫ్‌ఐ పేరుతో ఆమె సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ వైరల్ అయింది. ఇండస్ట్రీలో మహిళా సమానత్వం, సురక్షితమైన పని వాతావరణాన్ని సృష్టించడం చాలా ముఖ్యం అని సమంత అభిప్రాయపడ్డారు. ఆ దిశగా అందరూ కలసి కృషి చేయాలని కోరారు. నటి మంచు లక్ష్మి, దర్శకురాలు నందినిరెడ్డి, గాయని చిన్మయి శ్రీపాద యాంకర్ సుమ కనకాల సహా పలువురు నటీనటులు సమంత సందేశాన్ని సోషల్ మీడియాలో షేర్ చేసి ఆమెకు మద్దతు తెలిపారు.

ఆ నివేదికలో ఏముంది?

2018లో నటి శ్రీరెడ్డి మహిళల పట్ల ఇండస్ట్రీ వివక్ష చూపుతోందంటూ ఫిల్మ్ ఛాంబర్ వద్ద నగ్నంగా నిరసన ప్రదర్శనకు దిగారు. ఆ ఘటన నేపథ్యంలో 2019లో సీనియర్ ప్రభుత్వ అధికారులు, పోలీసులు, పౌర సమాజ ప్రతినిధులతో ప్రభుత్వం ఓ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. లైంగిక వేధింపులు, లింగ వివక్ష, వేతనాలు సహా పలు సమస్యలపై ఇండస్ట్రీలోని సంఘాలతో చర్చించిన కమిటీ 2022లో ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. అయితే ఇప్పటివరకూ దాన్ని ప్రభుత్వం బహిర్గతం చేయలేదు. కానీ మీడియాలో ప్రచారం జరిగిన దాని ప్రకారం... మహిళలను వేధించడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించడం ఇండస్ట్రీలో సాధారణంగా మారింది. అలాగే నైట్ షిఫ్ట్‌లో పనిచేసేవారికి రవాణా సదుపాయం కల్పించడం లేదు. వేధింపులపై నోరు విప్పిన వారిని దోషుల్లా చూస్తున్నారు. యూనియన్ సభ్యత్వాల విషయంలో మహిళల పట్ల వివక్ష చూపుతున్నారు. చాలా యూనియన్లలో మహిళల సభ్యత్వం నాలుగు శాతానికి మించలేదు. దళారీ వ్యవస్థను ఉపయోగించుకొని నిర్మాతలు తక్కువ పారితోషికాలతో పని చేయించుకుంటున్నారు. డాన్స్, యాక్టింగ్ స్కూల్స్ నుంచి వచ్చే అమ్మాయిలను దళారులు లక్ష్యంగా చేసుకుంటున్నారు. పని ప్రదేశాల్లో మహిళల సంరక్షణ కోసం ఉద్దేశించిన చట్టాలను పరిశ్రమలోని సంస్థలు అమలు చేయడం లేదు, ఫిర్యాదుల స్వీకరణకు అంతర్గతంగా కమిటీలను ఏర్పాటు చేయాలని, అందులో మహిళలు సభ్యులుగా ఉండేలా చూడాలని కమిటీ నివేదికలో పేర్కొన్నట్లు అప్పట్లో మీడియాలో ప్రచారం జరిగింది.



2019 నాటి సబ్ కమిటీ నివేదికను బయటపెట్టండి

- తెలంగాణ ప్రభుత్వాన్ని కోరిన సమంత
- మద్దతు పలికిన సినీ ప్రముఖులు

ఆ దిశగా ముందడుగు వేద్దాం

ఇండస్ట్రీలో మహిళల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, పరిశ్రమ సంఘాలు కలసి రావాలని సమంత అభ్యర్థించారు. సినీ ఇండస్ట్రీలోని పని ప్రదేశాల్లో లింగ వివక్ష ఏ రూపంలో ఉన్నా అరికట్టాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. హేమ కమిటీ నివేదికను ఉదహరిస్తూ పలు సూచనలు చేశారు. ఆ నివేదిక వచ్చాక చిత్ర పరిశ్రమలోని మహిళల్లో ధైర్యం వచ్చిందన్నారు. పని ప్రదేశాల్లో తాము ఎదుర్కొంటున్న వివక్ష దోపిడీని ప్రశ్నించేందుకు మరింత మంది మహిళలు తమ మౌనం వీడి ముందుకు రావడం మంచి పరిణామం అని చెప్పారు. లింగ అసమానతను అరికట్టేందుకు పారదర్శకమైన వ్యవస్థను కమిటీ సిఫారసు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తదనుగుణంగా లింగ వివక్ష లేని వాతావరణాన్ని పరిశ్రమలో కల్పించేందుకు ప్రభుత్వం, మూవీ ఆర్గనైజేషన్లు కలసి పనిచేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఆ దిశగా పునరాలోచిద్దాం, పునర్నిర్మిద్దాం, ముందడుగు వేద్దాం అని సమంత చెప్పారు.

సినిమా బతకాలి

మాలీవుడ్‌ను పవర్ సెంటర్ నియంత్రిస్తుందన్న హేమ కమిటీ వ్యాఖ్యలను నటుడు మమ్ముట్టి ఖండించారు. అలాంటిదేమీ ఇండస్ట్రీలో లేదు అని వివరణ ఇచ్చారు. అంతిమంగా సినిమా బతకాలనేదే తన కోరిక అని చెప్పారు. ఆయన ఆదివారం సోషల్ మీడియాలో స్పందించారు. 'నివేదిక కోర్టు ముందు ఉంది, నిందితులకు కోర్టు శిక్షలు నిర్ణయిస్తుందని చెప్పారు. షూటింగ్ ప్రదేశాల్లో మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు కమిటీ చేసిన సూచనలను స్వాగతిస్తున్నాను, వాటి అమలు కోసం పరిశ్రమలోని అన్ని సంఘాలు ఏకతాటిపైకి రావాలి, మహిళలకు ఇబ్బందికర పరిస్థితులు రాకుండా దర్శక నిర్మాతలు జాగ్రత్తలు తీసుకోవాల'ని సూచించారు. హేమ కమిటీ నివేదిక గురించి స్పందించాలని మీడియా కోరగా దాని గురించి తనకేం తెలియదని రజనీకాంత్ బదులిచ్చారు.

భయపడేది లేదు

నటుడు జయసూర్య తనను వేధించాడంటూ నటి సోనియా మల్హర్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఆయనపై కేసు నమోదైంది. అయితే ఆ ఆరోపణల్లో నిజం లేదని జయసూర్య ఓ ప్రకటనలో తెలిపారు. తనపై తప్పుడు కేసు పెట్టిందని ఆరోపించారు. న్యాయం కోసం పోరాడుతానని చెప్పారు. దీనిపై సోనియా ఆగ్రహం వ్యక్తం చేశారు. బెదిరింపులకు భయపడేది, లేదు నా వ్యాఖ్యలను వెనక్కు తీసుకునేది లేదు అని తెగేసి చెప్పారు. తను చెప్పిన ప్రతి అంశం నిజమేనని పేర్కొన్నారు.

ఇన్ ప్రోగ్రెస్

రిలీజ్ డేట్ మారింది



రాజ్‌తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా నటించిన 'భలే ఉన్నాడే' చిత్రం ఈ నెల 7న విడుదల కావాలి. అయితే అనివార్యకారణాల వల్ల విడుదల తేదీని వాయిదా వేసినట్లు, 13న రిలీజ్ చేస్తామని చిత్ర నిర్మాత ఎన్.వి కిరణ్‌కుమార్ చెప్పారు. దర్శకుడు మారుతి సమర్పిస్తున్న ఈ చిత్రానికి శివ సాయి వర్ధన్ దర్శకుడు. సీనియర్ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు ఈ సినిమాలో కీలక పాత్ర పోషించారు. అమ్మాయిలకు అందంగా అలంకరణలను చేసే పాత్రను ఇందులో రాజ్‌తరుణ్ పోషించారు. శేఖర్ చంద్ర సంగీతాన్ని అందించిన ఈ చిత్రానికి నగేశ్ బానెల్లా ఛాయాగ్రాహకుడు.

రెండు ముఖాలు



నిఖిల్ దేవాదుల హీరోగా నటిస్తున్న 'ఘటికాచలం' చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఇందులో హీరో రెండు డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తున్నారు. ఒక లుక్ ఇన్నోసెంట్‌గా, మరో లుక్ ఇంటెన్స్‌గా ఉంది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో ఈటీవీ ప్రభాకర్, ఆర్వికా గుప్తా, జోగినాయుడు, సంజయ్‌రాయ్, దుర్గాదేవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. అమర్ కామెపల్లి దర్శకుడు. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తామని చిత్రకథకుడు, నిర్మాత ఎం.సి.రాజు చెప్పారు.

మన బతుకులు కలలు కావు.. కళలు



దిలీప్‌ప్రకాశ్, రెజీనా కసాండ్రా ప్రధాన పాత్రలు పోషించిన 'ఉత్సవం' సినిమా థియేట్రికల్ ట్రైలర్ విడుదల చేశారు. హాస్యనటుడు బ్రహ్మానందం స్టేజ్ ప్లేలోని పవర్‌ఫుల్ డైలాగుతో ట్రైలర్ మొదలైంది. 'మన బతుకులు కలలు కావు.. కళలని గుర్తించే రోజులు రావా' అని ప్రకాశ్‌రాజ్ చెప్పిన డైలాగ్ ఆకట్టుకుంది. దిలీప్, రెజీనాల లవ్‌ట్రాక్ ఈ సినిమాకు మరో ప్రధాన ఆకర్షణ. నాటకాలు అంటే ఇష్టపడే యువతిగా రెజీనా నటించారు. ఈ నెల 13న విడుదలయ్యే 'ఉత్సవం'లో నాజర్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, అలీ, ప్రేమ, ఎల్బీ శ్రీరామ్ తదితరులు నటించారు. అర్జున్ సాయి దర్శకత్వంలో సురేశ్ పాటిల్ ఈ సినిమాను నిర్మించారు.



సున్నా నుంచి 35 మార్కులు

నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజా ప్రధాన పాత్రలు పోషించిన '35.. చిన్న కథ కాదు' చిత్రం ట్రైలర్‌ను అక్కినేని నాగార్జున ఆదివారం విడుదల చేశారు. లెక్కల సబ్జెక్ట్‌తో ఇబ్బంది పడుతున్న ఓ స్టూడెంట్‌ను పరిచయం చేస్తూ ట్రైలర్ మొదలైంది. ఆ పిల్లాడి తల్లితండ్రులుగా నివేద, విశ్వదేవ్ నటించారు. కొడుకు భవిష్యత్ గురించి ఆందోళన చెందుతుంటారు. ఆ పిల్లాడిని టీచర్, క్లాసులో ఇతర స్టూడెంట్స్ 'సున్నా' అని పిలుస్తూ అవహేళన చేస్తుంటారు. ఆ కుర్రాడు సవాళ్లను అధిగమించి, 35 మార్కులతో ఉత్తీర్ణత సాధించడం ఈ చిత్రకథ. దర్శకుడు నందకిశోర్ ఈమని ఆసక్తికరంగా రూపొందించిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదలవుతోంది. రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు.

తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు



హారర్ థ్రిల్లర్ 'డీమాంటీ కాలనీ 2' చిత్రాన్ని ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు హీరో అరుల్ నిధి ధన్యవాదాలు తెలిపారు. ఆగస్టు నెలలో విడుదలైన ఈ చిత్రాన్ని బి.సురేశ్‌రెడ్డి, మానస రెడ్డి తెలుగు ప్రేక్షకులకు అందించారు. ఆదివారం ఇచ్చిన ఇంటర్వ్యూలో అరుల్ నిధి మాట్లాడుతూ ' తమిళంలో మా సినిమా బాగా ఆడుతోంది. తెలుగులో నిర్మాత సురేశ్‌రెడ్డి బాగా ప్రమోట్ చేశారు. అయన వల్లే సినిమా ఇంత పెద్ద విజయం సాధించింది. త్వరలో హైదరాబాద్ వచ్చి సక్సెస్ మీట్ నిర్వహిస్తాం' అన్నారు. ఈ సినిమాకు మరో రెండు సీక్వెల్స్ వస్తాయనీ, 'డీమాంటీ కాలనీ 3' భారీ స్థాయిలో ఉంటుందని, ఇందులో ఊహించని మలుపులు ఉంటాయనీ అరుల్ నిధి చెప్పారు. 'ఈ సినిమా పార్ట్ వన్‌లో ఒక పాత్ర చేశాను. పార్ట్ 2 లో రెండు పాత్రలు పోషించాను. పార్ట్ 3లో దర్శకుడు అజయ్ ఎన్ని పాత్రలు చేయిస్తారో చూడాలి. ఇంతవరకూ ఎక్కువగా థ్రిల్లర్, సస్పెన్స్ మూవీస్ చేశాను. ఇకపై ఇతర చిత్రాల్లో కూడా నటించాలనుకుంటున్నాను' అని చెప్పారు అరుల్ నిధి.

రెండేళ్ల కృషి ఫలించింది



యం.యన్.వి. సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కాలం రాసిన కథలు'. ఇటీవల ఈ చిత్రం విడుదలై అందరినీ అలరిస్తున్న సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో సాగర్ మాట్లాడుతూ 'రెండేళ్ల మా కృషి ఫలించింది. మా సినిమాకు స్పందన బాగుంది. స్టార్స్ లేకున్నా కొత్త నటీనటులను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. మా సినిమాలో హీరోయిన్లు ముగ్గురూ బాగా చేశారు. కిరాక్ కిరణ్ పాత్ర బాగా పండింది' అన్నారు. హీరోయిన్లు హన్సిక శ్రీనివాస్, ఉమా రేచర్ల, శ్రుతీ శంకర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


పెడనలో ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కృష్ణప్రసాద్


పెదయాదరలో పొలాల్లో నీటిలో దిగి పరిశీలిస్తున్న జనసేన నేత బండి రామకృష్ణ


పుట్టగుంటలో బుడమేరు వంతెన వద్ద ఆర్ఐ, ఎస్సై శ్రీనివాస్ బందోబస్తు


మంగళాపురంలో దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న సీపీఐ, రైతుసంఘం నాయకులు

ఉమ్మడి జిల్లా అతలాకుతలం

మచిలీపట్నం టౌన్ : భారీ వర్షాలకు బందరు మండలంలోని చిన్నాపురం, సింహాచలం, సుల్తానగరం,ఎస్ఎన్ గొల్లపాలెం, పెదయాదర, చినయాదర, పెదపట్నం తదితర గ్రామాల్లో వరిచేలు, వేరుశనగ చేలు ముంపునకు గురయ్యాయి. జనసేన అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ సందర్శించారు. పెదయాదర, చినయాదర, తాళ్లపాలెం గ్రామాలను సందర్శించారు. జనసేన నాయకులు గడ్డం రాజు, వంపుగడల చౌదరి, వేణు తదితరులు పాల్గొన్నారు.చిన్నాపురం పంటపొలాలను మాజీ ఎంపిపి కాగిత వెంకటేశ్వరరావు సందర్శించారు. వరి పొలాలను వ్యవసాయశాఖాధికారులు సందర్శించి నివేదికను ఉన్నతాధికారుల దృష్టిలోకి తీసుకుని వెళ్ళాలని తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ డిమాండ్ చేశారు. పోసినవారిపాలెం గ్రామంలో ముంపుకు గురైన పంట పొలాలను వ్యవసాయ శాఖాధికారి శివప్రసాద్ సందర్శించారు. డ్రైన్లలో నీరు పారేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు గుంజలపల్లి నాగమల్లేశ్వరరావు, మురళి, రాములతో చర్చలు జరిపారు. వైసీపీ పాలకులు ఐదేళ్ళపాటు డ్రైనేజి వ్యవస్థను పట్టించుకోకపోవడం వల్ల మచిలీపట్నం నగర ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురి కావల్సి వస్తోందని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈడేపల్లిలో ముంపునకు గురైన ప్రాంతాలను గోపీచంద్ పరిశీలించారు. బందరు నగరంలో మునిసిపల్ అధికారులు, సిబ్బంది డ్రైన్లలో పూడిక తీయించి మోటార్లతో నీటిని తోడిస్తున్నా ఇంకా కొన్ని రోడ్లు ముంపును వీడలేదు.

పెడన మండలంలో..

పెడన : భారీ వర్షాలకు ముంపునకు గురైన పట్టణంలోని లోతట్టు ప్రాంతాలలో ఆదివారం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పర్యటించారు. జిల్లా చేనేత జౌళి శాఖ ఏడికి ఫోన్ చేసి మగ్గాల గోతుల్లోకి నీరు చేరడంతో ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులకు సాయం అందించాలని ఆదేశించారు. దక్షిణతెలుగుపాలెంలో జలమయమైన రోడ్లను ఆయన పరిశీలించారు. రోడ్లపై నిలిచిన నీటిని తొలగించాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ ఎం. గోపాలరావు, టీడీపీ నాయకులు పరసా సూర్యనారాయణ, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు. పెడన రూరల్: పెనుమల్లి, నడుపూరు, లంకలకల వగుంట, చెన్నూరు, నందిగం, నందమూరు, పుల్లపాడు, కొంకేపూడి గ్రామాలలో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవటంతో కచ్చా డ్రైన్‌లు ఏర్పాటుచేసి నీటిని మళ్ళిస్తున్నారు.కొప్పల్లి వద్ద ఇసకపల్ర డ్రైన్ కట్టలు తెగి 350 ఎకరాలలో పంట పొలాలు నీట మునిగాయి. నెరికేపాలెం, నరసప్ప చెరువు, నందిగం, ఉరివి, చేవేంద్ర, కాకర్లమూడి, జింజేరు, మడక, బల్లిపర్రు గ్రామాలలో వందల ఎకరాలు నీటమునిగాయి. మరో 15 రోజులలో పొట్టదశకు సిద్ధంగా ఉన్నందున రైతులు ఆందోళన చెందుదుతున్నారు.

చల్లపల్లి మండలంలో..

చల్లపల్లి : మండల పరిధిలోని రాముడుపాలెం, నాదెళ్లవారిపాలెం, నడకుదురు, నిమ్మగడ్డ, వెలివోలు పరిధిలో కరకట్ట దిగువన వాణిజ్య పంటలు అరటి, పసుపు, కంద, మొక్కజొన్న, కూరగాయలు, పూలతోటలు నీటిముంపుకు గురయ్యాయి. వెలివోలు లంకలో పట్టుపురుగుల షెడ్లు నీటి ముంపుకు గురయ్యాయి. కుండపోత వర్షాలతో పంటచేలు పూర్తిగా మునిగిపోయి రైతులు నష్టపోయారనీ, ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని సీపీఐ, రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. చల్లపల్లి, నడకుదురు, నిమ్మగడ్డ, మేకావారిపాలెం, మంగళాపుర ం, మాజేరు, భోగిరెడ్డిపల్లి గ్రామాల్లో నాయకుల బృందం ఆదివారం పర్యటించి నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. రైతుసంఘం రాష్ట్ర నేత హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ . ప్రతి ఎకరాకు రూ.25వేలు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, రైతు నాయకులు పరుచూరి శ్రీనివాసరావు, వేమూరి రత్నగిరిరావు, అట్లూరి వెంకటేశ్వరరావు, గుత్తికొండ రామారావు, మాలెంపాటి కోటేశ్వరరావు, డొక్కు శ్రీనివాసరావు, తలుపుల సుబ్బారావు, పెనుమత్స రాజారత్నం, చంద్ర సుబ్బారావు, నక్కా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. లక్ష్మీపురం శివారు చింతలమడ, పాగోలు శివారు లంకతోట వెళ్లే రోడ్డులోని అప్రోచ్ రహదారులపై వర్షపునీరు ప్రవహిస్తుండటంతో రోడ్లు కోతకు గురయ్యాయి.

ఘంటసాల మండలంలో

ఘంటసాల : కృష్ణానదికి వరద ఉధృతి పెరుగుతుండటంతో రెవెన్యూ, పోలీసు అధికారులు అప్రమత్తమయ్యాయి. వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందనే సమాచారం ఉండటంతో తహసీల్దార్ బి.విజయప్రసాద్ తన సిబ్బందితో కలసి శ్రీకాకుళం, పాపవినాశనం రేవులను పరిశీలించారు. రెవెన్యూ, పోలీసు సిబ్బందికి తగు సూచనలు చేశారు. పూషడం, యండకుదురు, దాలిపర్రు, లంకపల్లి, చిట్టూరు గ్రామాల్లోని పంట పొలాలు నీటమునిగాయి దేవరకోట సమీపంలోని చిల్లలవాగు పొంగి ప్రవహించటంతో ఆయకట్టు పరిధిలోని పంట పొలాలు నీటి ముంపుకు గురయ్యాయి. బత్తాయి, నిమ్మ, అరటి, మామిడి, కంద, పసుపు పంట పొలాలు మునక బారిన పడ్డాయి.

మోపిదేవి మండలంలో..

మోపిదేవి : మండలి వెంకట్రామ్, మండల ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ సతీష్‌లు సూచించారు. ఆదివారం ఉదయం కె.కొత్తపాలెంలోని దళితవాడ, గౌడపాలెంలలో వరద పరిస్థితిని పరిశీలించి గ్రామస్థులకు పలు సూచనలు చేశారు. అవనిగడ్డ డిఎస్పీ మురళీధర్ వరద ప్రభావిత గ్రామాల్లో పర్యటించి వరద పరిస్థిని అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ ఎం.శ్రీవిద్య, పంచాయతీ కార్యదర్శి ఎం.రామకోటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, జనసేన అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, సర్పంచ్‌లు కొక్కిలిగడ్డ మాధవీ, దొప్పలపూడి గంగాభవాని, కూటమి నాయకులు కోనేరు నాని, చందన రంగారావు, తదితరులు వారి వెంట ఉన్నారు. వరద ఉధృతి గంట గంటకు పెరుగుతుండటంతో మండలంలోని నదీ తీర గ్రామాల ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాగాయలంక మండలంలో..

నాగాయలంక : నదీ పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎం.హరనాథ్‌బాబు కోరారు. ఎదురుమొండి, ఈలచెట్లదిబ్బ, నాచుగుంట ప్రజలకు నిత్యావసర వస్తువులు, మందులతో పాటు సిబ్బంది నియమించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఎదురుమొండి నుంచి జింకపాలెం వెళ్లే రోడ్డు వరద కోతకు గురైంది. ఈ ప్రాంతంలో ఉన్న బ్రహ్మయ్య గారి మూల, గొల్లమంద, జింకపాలెం, నాచుగుంట గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాగాయలంక మండలానికి ప్రత్యేకాధికారిగా నిత్యానంద్‌ను జిల్లా కలెక్టర్ డికే.బాలాజీని నియమించారు. ఎస్‌డిఆర్ఎఫ్ నుంచి 17 మంది సభ్యులను నియమించారు.

మొవ్వ మండలంలో..

కూచిపూడి : వర్షాలకు మండలంలోని వేలాది ఎకరాల్లో వరి చేలు నీటమునిగాయని, ప్రభుత్వం రైతులను, కౌలు రైతులను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఎం నేతలు మండలంలోని నిడుమోలు, వీరాయిలంక, కాజ, మందపాలెం ఆవిరిపూడి గ్రామాల్లో పంట దెబ్బతిన్న పొలాలను పరిశీలించారు. కాజ శివారు మందపాలెం గ్రామంలో కోతకు గురైన కరకట్టను పరిశీలించి ప్రమాదకర స్థితిలో కరకట్ట ఉన్నందున యుద్ధప్రాతిపదికన మరమ్మత్తులు చేయాలని కోరారు. శీలం నారాయణరావు, మద్దుల బసవయ్య, ఉప్పలపు వెంకటాద్రి, కొడాలి కరుణకరరావు, కొనకళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు

గుడివాడ మండలంలో...

గుడివాడ రూరల్: భారీ వర్షాలకు మండలంలో వేలాది ఎకరాల వరి పొలాలు నీటమునిగాయి. వలివర్తిపాడు, పర్నాస, గుంటా కోడూరు, దొండపాడు తదితర గ్రామాల్లోని వేలాది ఎకరాల వరి నీటమునిగి పనికి రాకుండా పోయింది. గుడివాడ, నందివాడ, పెదపారుపూడి మండలాల్లోని వరి పొలాలను ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి పరిశీలించారు. మూడు మండలాల్లో 8500 ఎకరాల వరి పంట ముంపుకు గురైందని తెలిపారు.

పామర్రు : భారీ వర్షాలకు వరి చేలు నీట మునిగి కొరిమెర్ల, ఎలకుర్రు, ప్రాకెర్ల, నిమ్మలూరు తదితర గ్రామాల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు సూరపనేని బాబురాజేంద్ర, అడుసుమిల్లి శివప్రసాద్, బోడే రామకోటేశ్వరరావు తదితర రైతులు 2,255 ఎకరాలు నీటిలో ముంపుకు గురైనట్లు చెప్పారు.

కోడూరు : మండలంలో ముంపునకు గురైన పంట పొలాలను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశాల మేరకు ఆయన అల్లుడు శీలం అశ్విని కుమార్, స్థానిక ఎన్డీఏ శ్రేణులతో కలసి పరిశీలించారు. ద్వారక, ఇరాలి, జరుగువానిపాలెం, పాత రెడ్డిపాలెం, మందపాకల గ్రామాల్లో పర్యటించి ముంపుకు గల కారణాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కరకట్ట గట్టు బలహీనంగా ఉన్న ప్రదేశాల్లో పటిష్ఠ పర్చటానికి కోడూరు ఇరిగేషన్ కార్యాలయం నుంచి ఇసుక మూటలు ఆదివారం తరలించారు. కోడూరు మండలం కొత్తపాలెం నుంచి హంసలదీవి వరకు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేస్తున్నట్లు ఇరిగేషన్ డీ రావెళ్ల రవికిరణ్ తెలిపారు. కరకట్టను తహసీల్దార్ శ్రీను నాయక్, ఎంపీడీవో ఆర్.శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఏఈ విజయ్ కుమార్ పరిశీలించారు. విశ్వనాథపల్లి, హంసలదీవి గ్రామాల సమీపంలో నివశిస్తున్న 41 మందిని ఉల్లిపాలె ం, విశ్వనాథపల్లి ఎంపీయూపీ పాఠశాలలకు తరలించి రక్షణ చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ శ్రీను నాయక్ తెలిపారు.

నందివాడ (పుట్టగుంట) పుట్టగుంట వద్ద బుడమేరు వంతెన మునగటంతో ఆదివారం గుడివాడ నుంచి జంక్షన్ వెళ్లే బస్సులు రెవెన్యూ, పోలీసు అధికారులు నిలుపుదల చేశారు. బుడమేరు వంతెనపై నీటి ప్రవాహం అధికమవ్వటంతో ప్రజలు కూడ నడిచి వెళ్లటానికి వీలు లేకుండా మారింది. ఆర్డీవో పద్మావతి బుడమేరును పరిశీలించి రెవెన్యూ అధికారులను గ్రామాల్లోని ముంపు ప్రాంతాలకు పంపి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. బుడమేరు నీటి ప్రవాహం పెరుగుతుండటంతో ఆర్ఐ గణేష్, రెవెన్యూ సిబ్బంది, ఎస్ఐ శ్రీనివాస్ తన సిబ్బందితో బుడమేరు వంతెన వద్ద రాకపోకలు జరుగకుండా గట్టి బందోబస్తు చేపట్టారు. 2600 ఎకరాల్లో పంట మునిగిపోయినట్లు మండల వ్యవసాయాధికారి భాను ప్రకాష్ తెలిపారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదేశాల మేరకు నందివాడ మండల టీడీపీ అధ్యక్షుతు దానేటి సన్యాసిరావు మండలంలోని ముంపుకు గురైన పెదలింగాల, చిన్నలింగాల, పుట్టగుంట, ఒద్దుల మెరక, చినలింగాల, జొన్నపాడు, ఆరిపిరాల, ,చేదుర్తిపాడు, పలు గ్రామాల్లో మునిగిపోయిన ప్రదేశాలను పరిశీలించారు.

గుడ్లవల్లేరు: కౌతవరం, వేమవరం, వడ్లమన్నాడు, ఉలవలపూడి, డోకిపర్రు, పెసరమిల్లి,లంకదొడ్డి గ్రామాల్లో వరి చేలు నీటమునిగాయి. గుడ్లవల్లేరు ఇన్‌చార్జ్ తహసీల్దార్ కనకదుర్గ, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, ఎయిర్ పోర్ట్ అభివృద్ధి కమిటీ సభ్యులు తులసి తదితరులు ముంపు ప్రాంతాలను పరిశీలించారు.



పసుమర్రులో 300 మందికి ఉచిత వైద్యపరీక్షలు

పామర్రు : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాజాస్ హెల్పింగ్ హ్యాండ్ ఛైర్మన్ కాజ చక్రధర్‌బాబు, వెంకటరమణి అన్నారు. పసుమర్రులో లయన్స్ ఇంటర్నేషనల్ తాడిగడప, కాజాస్ హెల్పింగ్ హ్యాండ్ ఆధ్వర్యంలో వివాన్ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం లయన్స్ మాజీ గవర్నర్ వైపిసి ప్రసాద్ ప్రారంభించారు. 300 మందికి పరీక్షలు జరిపి దాదాపు రూ.4.50లక్షల విలువ గల మందులను పంపిణీ చేశారు. వైద్య శిబిరం ప్రధాన నిర్వాహకుడు కెవిఎస్‌చౌదరి గుడివాడ వివాన్ హస్పటల్‌చెందిన వివిధ విభాగాల వైద్యానిపుణులు యడ్లపల్లి హర్ష, కొల్లి చందన, పి.సందీప్, జి.పృధ్వీవిజయ్ వైద్య పరీక్షలు జరిపారు. గ్రామ సర్పంచ్ కాకి నాగేంద్రం, మాజీ సర్పంచ్ బొప్పన కోటేశ్వరరావు, వై.శ్రీనివాస్, కెవిచౌదరి ఎల్ఎస్‌కుమార్ వై.సురేష్ ,తదితరులు పాల్గొన్నారు..

టీడీపీ సీనియర్ నేత గోపాలస్వామి మృతి

నాగాయలంక : గణపేశ్వరం శివారు దిండి గ్రామానికి టీడీపీ సీనియర్ నేత గుర్రం గోపాలస్వామి (75) ఆదివారం మరణించారు. మృతునికి భార్య, నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. నాయకులు వర్రే రాంబాబు, కారంకి కృష్ణ తదితరులు గోపాలస్వామి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సీపీఎస్ రద్దు చేయాలి

మచిలీపట్నం టౌన్ : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలంటూ ఆదివారం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ఏపీటీఎఫ్ కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి తమ్ము నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి, జిల్లా అధ్యక్షుడు శేషగిరి, ప్రధాన కార్యదర్శి లంకేష్, జిల్లా గౌరవాధ్యక్షుడు నడకుదిటి రామబ్రహ్మం తదితరులు ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు.**కూచిపూడి:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టాలని చూస్తున్న (యునైటెడ్ పెన్షన్స్ స్కీమ్) పథకాన్ని రద్దు చేయాలని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మొవ్వలో ఆదివారం నిరసన చేపట్టారు. యువి.రామారావు, సోమేశ్వరమ్మ, పిపి.సి. ప్రసాద్, ఏ.సురేష్, ఎన్.శివలక్ష్మి, వెంకటేశ్వరరావు, కిషోర్‌బాబు, మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

హంసలదీవి బీచ్ గేట్లు మూసివేత

కోడూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో కోడూరు మండల శివారు హంసలదీవి బీచ్ గేట్లు ఆదివారం అధికారులు మూసివేశారు.మరలా ఉన్నతాధికారుల ఆదేశం వచ్చేంత వరకు బీచ్ గేట్లు మూసి ఉంటాయని తెలిపారు. కావున పర్యాటకులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని, హంసలదీవి రావద్దని మెరైన్ ఎస్ఐ ఉజ్వల్ విజ్ఞప్తి చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112, 121, 132
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.95

లంక గ్రామాలు జలదిగ్బంధం

తోట్లవల్లూరు : కృష్ణమ్మ ఉగ్ర రూపం దాల్చింది. వరదకు తోడేళ్ళదిబ్బలంకలో 430 మంది, కాళింగదిబ్బలంకలో 205 మంది, పాములలంకలో 1391 మంది, తుమ్మలపచ్చిక లంకలో 69 మంది, పిల్లివానిలంకలో 184 మంది, పొట్టిదిబ్బలంకలో 230 మంది, కనిగిరిలంకలో 482 మంది, ములకలపల్లిలంకలో 133 మంది మొత్తం 3,124 మంది ప్రజలు చిక్కుకుపోయారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలీ శర్మ, ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, ఆర్డీవో డి రాజు, తహసీల్దార్ ఎం కుసుమకుమారి, ఎంపీడీవో టి స్వర్ణలత, వరద ప్రత్యేకాధికారి, ఇన్‌చార్జి డీపీవో నాగేశ్వరరావు నాయక్, టీడీపీ నాయకులు వీరంకి వెంకట గురుమూర్తి, వీరపనేని శివరామ్‌ప్రసాద్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించి పడవలపై తోడేళ్ళదిబ్బలంక, పాములలంక, కాళింగదిబ్బలంక గ్రామాలకు వెళ్ళి వరద అధికంగా వస్తోందని, పునరావాస కేంద్రాలకు తరలి రావాలని కోరారు. ప్రత్యేకంగా బోట్లను రప్పించి లంక గ్రామాలకు పంపిస్తున్నామని, పునరావాస కేంద్రాలకు తీసుకు వచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని జేసీ గీతాంజలీ శర్మ తెలిపారు. వల్లూరుపాలెం, తోట్లవల్లూరు హైస్కూళ్ళు, భద్రిరాజుపాలెం, దేవరపల్లి ఎంపీయూపీ స్కూళ్ళలో నాలుగు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి రావాలని, ఎవ్వరు అధైర్యపడొద్దని, ప్రభుత్వం పూర్తిగా అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే కుమార్ రాజా పాములలంక ప్రజలకు విజ్ఞప్తి చేశారు.


వరద సహాయ చర్యలపై జాయింట్ కలెక్టర్ గీతాంజలీ శర్మ, ఎమ్మెల్యే కుమార్ రాజా, ఆర్డీవో రాజు సమీక్ష)

జలదిగ్బంధంలో జగ్గయ్యపేట

జగ్గయ్యపేట : జగ్గయ్యపేట పట్టణం నీటమునిగింద. అపరకర్మల కోసం వెళ్లిన రంగు రమణ కుటుంబీకులు అపరకర్మల సత్రంలో వరదనీటిలో చిక్కుకోవటంతో 15 మందిని నాటు పడవల్లో సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఎమ్మెల్యే తాతయ్య స్వయంగా పర్యవేక్షించారు. వేపల వాగు పోటెత్తటం, ఎర్రకాల్వలో నీరు ఎగతన్నటంతో పట్టణంలో అయ్యప్పనగర్ నుంచి కాకానినగర్, తొర్రగుంట పాలెం, డాంగే నగర్ ప్రాంతాల్లో వరద ముంపుకు గురైయ్యాయి. విశాఖ స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్ వద్ద పాలేరు పొంగి బ్రిడ్జిని తాకటంతో జగ్గయ్యపేట రవాణా బంద్ అయింది. వత్సవాయి మండలం లింగాల మునేటిలో మక్కపేటకు చెందిన ఐదుగురు చిక్కుకోవటంతో ఎమ్మెల్యే తాతయ్య రావిరాల నుంచి మరబోట్లను లింగాల పంపించి చిక్కుకున్న వారిని మక్కపేటకు రప్పించారు. ఎమ్మెల్యే తాతయ్య ఆదివారం ఉదయం అంతా సహ యక చర్యల్లో మునిగిపోయారు. మునిసిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. వేపలవాగు పొంగటంతో కొడవటి రుత్విక్ అనే ఎనిమిదేళ్ల బాలుడు కొట్టుకుపోవటంతో ఆ ప్రాంతంలో ఉన్న షేక్ ఆదిల్ అహ్మద్ నీటిలో దూకి ఆ బాలుడిని ఎంతో సాహసంతో కాపాడాడు.

జగ్గయ్యపేట రూరల్ : జగ్గయ్యపేట మండలం అతలాకుతలమైంది. కష్ణా, పాలేటి నీటితో వందలాది ఎకరాలలో పంట నీట మునగగా అన్నవరం, బూదవాడ, రావిరాల, ముక్త్యాల, కెఅగ్రహారం, వేదాద్రి గ్రామాలు జలదిగ్బందంలో ఉన్నాయి. రావిరాలకు కృష్ణానది వరద నీరు పోటెత్తటంతో గ్రామం నీటిలో మునిగింది. షేర్‌మహ్మద్‌పేట, గండ్రాయి., చిల్లకల్లు, వేదాద్రి, జగ్గయ్యపేట, బలుసుపాడు అన్నవరం గ్రామాలలో రోడ్లపైకి నీరు చేరటంతో ఆయా గ్రామాల నుంచి అన్ని ప్రధాన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాలతో మండలంలోని ధర్మవరప్పాడు తండ, జయంతిపురం, షేర్‌మహ్మద్‌పేట, గండ్రాయి గ్రామాలకు వెళ్లే రహదారులపై చెట్లు పడటంతో రాకపోకలు నిలిచిపోవటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వేలాది ఎకరాల పంటలు వరద నీటిలో మునిగాయని రైతులు అంటుండగా అధికారులు మాత్రం పత్తి 4,300, వరి 7,200, మిర్చి 3,500 ఎకరాలలో నీట మునిగిందని నివేదికలు పంపటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

21,577 హెక్టార్లలో పంటలు నీటమునక

మచిలీపట్నం : జిల్లాలో గత రెండురోజులుగా కురిసిన భారీవర్షాలతోపాటు, కృష్ణానదికి వస్తున్న వరదల కారణంగా 21,577హెక్టార్లలో పంటలు నీటమునిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు ఆదివారం ప్రభుత్వానికి నివేదికను పంపారు. నాగాయలంక మండలం మినహా 24మండలాల్లో 274 గ్రామాల్లో వరి, మినుము, పత్తిపైరు మునిగినట్లు నివేదికలో పేర్కొన్నారు. దుబ్బుచేసే దశలో ఉన్న వరిపైరు, ఏపుగా పెరుగుతున్న పత్తి, మినుము పైరు నీటమునిగినట్లు నివేదికలో పేర్కొన్నారు.

జాతీయ రహదారిపైకి నీరు

నందిగామ : ఐతవరం వద్ద జాతీయ రహదారిపైకి నీరు చేరింది. మునేరు ఉగ్రరూపం దాల్చడంతో పొలాలు పూర్తిగా నీటమునిగాయి. నందిగామ పట్టణంలోని మధిర రోడ్డుపైకి నీరు చేరాయి. మునేటి వరద జాతీయ రహదారిపైకి నీరు చేరడంతో లారీలు, బస్సులు పెద్దయెత్తున నిలిచిపోయాయి. ప్రయాణికులు, డ్రైవర్లకు మాజీ మంత్రి వసంత ఆధ్వర్యంలో గ్రామస్థులు భోజనాలు, మంచినీరు అందజేశారు. నందిగామ పట్టణంలోని కుమ్మరివాగులో చిక్కుకున్న 25 మంది కూలీలను ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది రక్షించారు. ట్రాక్టర్లు, బోట్ల సాయంతో వారిని ఒడ్డుకు చేర్చడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. **చందర్లపాడు :** అప్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు నల్లవాగు పొంగి మండలంలోని కొత్తబెల్లంకొండవారి పాలెం గ్రామంలో ఒక కోళ్లఫారంను ముంచేసింది. ఆదివారం ఉదయం ఒక్కసారిగా వరద నీరు కోళ్లఫారంలోకి చేరడంతో రూ. పది లక్షల వరకూ నష్టం వాటిల్లినట్లు ఫారం యజమాని శ్రీరామినేని సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. చింతపాడు గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది.


జంక్షన్ వద్ద ఏలూరు రోడ్డులో అప్పనీడు హైస్కూల్ వద్ద జాతీయ రహదారి మీదుగా వరద ప్రవాహం

పెనుగంచిప్రోలులో

పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు లోతట్టు ప్రాంతాలైన బోస్ పేట, తూర్పు దళితవాడ , బంగారు కాలనీ, తూర్పు బజారు, వినాయకుడి గుడి, శివాలయం వీధి అన్ని వరదనీటిలో ఉన్నాయి. తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద చిరు వ్యాపారులు తమ వస్తువులను గ్రామంలోకి చేర్చుకున్నారు. ఇబ్బంది పడుతున్న పేద ప్రజల కోసం తిరుపతమ్మ దేవస్థానం సత్రంలో భోజన వసతిని కల్పించారు. ఎస్సై అర్జున్, రెవెన్యూ అధికారులు, ఎంపీడీవో హర్ష సాయి నిరంతరం తమ సిబ్బందితో పర్యవేక్షణ చేస్తున్నారు. వరదనీటిలో కారులో చిక్కుకున్న వరంగల్‌కు చెందిన ఇరువురు వృద్ధులను ఎస్సై అర్జున్ కాపాడారు.

బొమ్ములూరు వద్ద నిలిచిన ట్రాఫిక్

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : బొమ్ములూరు వద్ద జాతీయ రహదారిపై మూడు అడుగుల ఎత్తులో వరదనీరు ప్రవహిస్తుండటంతో ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచింది. అర్ధరాత్రి 12గంటలకు ఆగిపోయిన ట్రాఫిక్ ఉదయం 9గంటల తరువాత కదిలింది. సీఐ సత్యన్నారాయణ, ఎస్సై జనార్ధన్ సిబ్బందితో ట్రాఫిక్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. కాకులపాడు, ఆరుగొలను, రంగయ్యప్పారావుపేట, రామన్నగూడెం తదితర గ్రామాల్లో ఇటీవలే నాట్లు వేసిన చేలు మోకాలు లోతు నీరు చేరి పొలాల ఆనవాలు లేకుండా చెరువులను తలపిస్తున్నాయి. **గన్నవరం:** రహదారుల పైకి వరద నీరు చేరడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద ఉధృతిని గుడివాడ ఆర్డీవో పద్మావతి పరిశీలించారు. ముస్తాబాద, కొండపావులూరు సర్వే నెంబర్ 6లోని ఎన్డీఆర్ఎఫ్‌కు వెళ్లే రహదారిని పరిశీలించారు. ఆ రహదారి కోతకు గురైంది. రాకపోకలు ఆగిపోయాయి. తహసీల్దారు శివయ్య ఆర్ఐ ఉదయ్‌కుమార్, పంచాయితీరాజ్ ఏఈ దాసు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : రామిలేరు వాగు దాదాపు 25 ఏళ్ల తరువాత పొంగి తన ఉధృత రూపాన్ని చూపింది. బొమ్ములూరు, అప్పనవీడు గ్రామాలు వద్ద రహదారి మీద పెద్ద ఎత్తున వరద నీరు ప్రవహించడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అప్పనవీడు మీదుగా ఏలూరు సాగాల్సిన వాహనాలను జంక్షన్ సెంటర్ నుండి జంక్షన్ ఎస్సై జనార్దన్ గుడివాడ రోడ్డు మీదుగా మళ్లించి బైపాస్‌లో పంపించారు.బొమ్ములూరు వద్ద కూడా వరదనీరు రహదారి మీద ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.


నీటమునిగిన ముస్తాబాద ప్రధాన రహదారి

పునరావాస కేంద్రాలు ఏర్పాటు

●ఎమ్మెల్యే సుజనా చౌదరి

వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని వరద ముప్పు ప్రాంతాల బాధితులకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) అన్నారు. వరద ఉధృతిపై తన పి.ఎస్ ప్రత్తిపాటి శ్రీధర్‌తో ఫోన్‌లో సంప్రదించి ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నారు. కలెక్టర్‌తో పాటు పశ్చిమ తహసీల్దార్, జోనల్ కమీషనర్‌లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. విద్యాధరపురం, భవానీపురం వరద ముప్పు ప్రాంతాలలో బాధితులకు సుజనా ఫౌండేషన్ ప్రతినిధులు, ఎమ్మెల్యే కార్యాలయం కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, ఇతర నాయకులు ఆయా ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు ఆహారం, మంచినీటి ప్యాకెట్లు అందిస్తూ భరోసా కల్పిస్తున్నారు. 43వ డివిజన్ ఏకలవ్య నగర్‌లో మూడు నెలల చంటిబిడ్డతో ఉన్న కుటుంబాన్ని శ్రీధర్ పడవ ద్వారా పునరావాస కేంద్రానికి తరలించారు. పునరావాస కేంద్రంలో ఉన్నవారికి భోజనం ఏర్పాట్లు కల్పించారు. శ్రీధర్ మాట్లాడుతూ బాధితులు ఎటువంటి ఇబ్బందిపడకుండా తగిన చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఏదైనా అవసరం అయితే వెంటనే ఎమ్మెల్యే కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

మూడో రోజూ విచారణ

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్లో హిడెన్ కెమారాల , వీడియోల అభియోగాల పై ఆదివారం కూడా దర్యాప్తు కొనసాగింది. అభియోగాలు ఎదుర్కొంటున్న విద్యార్థినిని కళాశాల లోనే ఎస్పీ పర్యవేక్షణలో దాదాపు ఆరు గంటల పాటు అన్ని కోణాలలో విచారించినట్లు సమాచారం. కళాశాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తీని ఆదివారం కూడా కొనసాగించారు.

జనసేన మెగా రక్తదాన శిబిరం

గుడివాడ : ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదినం సందర్భంగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన రక్తదాన శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు స్వయంగా రక్తదానం చేశారు. కామేపల్లి తులసీబాబు, వసంతవాడ దుర్గారావు, పొట్లూరి కృష్ణారావు, మజ్జి శ్రీనివాసరావు, వేమూరి త్రినాథ్, సాయన రాజేష్, పంచకర్ల మహేష్, సుంకర వెంకట్, కోసూరు ఆంజనేయులు, పడాల పూర్ణ, వినోద్, సాయికృష్ణ, నవీన్, సతారాం, నాని, వెంకటేష్, భాను, అజయ్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గన్నవరం నుంచి బెంగళూరుకు ఎయిర్ ఇండియా సర్వీస్ ప్రారంభం

గన్నవరం :ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ ఆదివారం బెంగళూరు నుంచి గన్నవరం విమానాశ్రయానికి నూతన విమాన సర్వీస్‌ను ప్రారంభించింది. బెంగళూరు నుంచి ఈ విమానం సాయంత్రం 5.40 గంటలకు ఇక్కడికి చేరుకుంది. తిరిగి 6.10 గంటలకు ఇక్కడి నుంచి బెంగళూరు బయలుదేరింది. తొలుత బెంగళూరు వెళ్లే ప్రయాణికులకు ఎయిర్పోర్ట్ డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంతరెడ్డి చేతుల మీదుగా బోర్డింగ్ పాస్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ అత్యంత రద్దీగా ఉండే బెంగళూరు-విజయవాడ రూట్‌లో ప్రస్తుతం ఇండిగో, అలయన్స్ ఎయిర్ సంస్థలు 78 మంది ప్రయాణికుల సామర్థ్యం కలిగిన బోయింగ్ 737 మ్యాక్స్ నడుపుతుండడం సంతోషకరమన్నారు. దీని వల్ల తక్కువ ధరకే ఈ రూట్లో ప్రయాణించవచ్చని తెలిపారు. కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరపు రామ్మోహన్నాయుడు చొరవతో కొత్త సర్వీస్‌లు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. ఎయిరిండియా ఎక్స్ ప్రెస్ కమర్షియల్ హెడ్ అభయ్ జార్జ్, స్టేషన్ మేనేజర్ సుబ్రమణ్యేశ్వరరావు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.





బుడమేరు వరద నీటిలో సింగ్‌నగర్, పాయకాపురం తదితర ప్రాంతాలు



బొమ్ములూరు వద్ద జాతీయ రహదారిపై వరద నీరు

గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలు.. పొంగిన బుడమేరు విజయవాడ నగరంలోని పలు ప్రాంతాలను ముంచేశాయి.. నగర శివారుతో పాటు 56వ డివిజన్, పాతరాజరాజేశ్వరి పేటను పూర్తిగా బుడమేరు ఆక్రమించింది. వర్షం తగ్గుతుందిలే అనుకున్న ఈ ప్రాంతవాసులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఉదయం 7 గంటల నుంచి బుడమేరు ఉరకలెత్తింది. ఇళ్లలోకి నీరు చేరింది. బుడమేరు సింగ్‌నగర్ ప్రాంతాలను పూర్తి స్థాయిలో వరద ముంచెత్తింది.



ముంచేసిన బుడమేరు

- బుడమేరుకు భారీ వరద.. పొంగిన వాగులు
- వెలగలేరుకు 30 వేల క్యూసెక్కుల వరద
- గేట్లు ఎత్తి దిగువకు వరద నీరు విడుదల
- విజయవాడతో పాటు బుడమేరు పరీవాహక ప్రాంతాల మునక

జి.కొండూరు, సెప్టెంబరు 1 : మైలవరం, తిరువూరు నియోజకవర్గాలతో పాటు ఎ.కొండూరు మండలంలో కురిసిన వర్షాలకు భారీగా వరద నీరు చేరడంతో బుడమేరు ఉగ్ర రూపం దాల్చింది. శనివారం రాత్రికి వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్దకు సుమారు 30 వేల క్యూసెక్కుల వరద నీరు చేరింది. బుడమేరు వరద నీరు మళ్లింపు కాలువ (బీడీసీ) ద్వారా సుమారు 8 వేల క్యూసెక్కులు, హెడ్ రెగ్యులేటర్‌కు 11 గేట్లు పూర్తిగా ఎత్తి మిగిలిన వరదను దిగువకు విడుదల చేశారు. ఆదివారం వరద కూడా బుడమేరుకు వరద ప్రవాహం కొనసాగుతూనే ఉంది. గడచిన 30 ఏళ్లలో ఈస్థాయిలో బుడమేరుకు వరద వచ్చింది లేదు. ఆదివారం సాయంత్రం కూడా ఏడు అడుగుల వరద వస్తుంది. సుమారు 15 వేల క్యూసెక్కుల వరద నిలకడగా ఉంది. అయితే గేట్లు దింపాలని విజయవాడ పల్లపు ప్రాంతాల నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిడి వస్తున్నది. ఇదిలా ఉంటే బీడీసీకి పలు చోట్ల గండ్లు పడ్డాయి. శాంతినగర్ వద్ద, ఇంకా అనేక చోట్ల బీడీసీకి గండ్లు పడి వరద ప్రవాహం ఊళ్ల మీద పడింది.

ఉధృతంగా పులివాగు..

బుడమేరుకు అత్యధికంగా వచ్చి చేరే వరదలో పులివాగు ఒకటి. జి.కొండూరు మండలం పడమర వైపు ఉన్న అటవీ ప్రాంతంలో పుట్టిన పులివాగులోకి గడ్డమణుగు లోయ ప్రాంతంలోని దొర్లింతల వాగు తోడై ఉధృతంగా ప్రవహిస్తున్నది. పులివాగు వరదలో తహసీల్దార్ సీహెచ్ వెంకటేశ్వర్లు చిక్కుకున్నారు. కారును తాళ్ల సాయంతో బయటకు తీశారు. గత 30 ఏళ్లలో పులివాగు ఆస్థాయిలో ప్రవహించింది లేదని జనం అంటున్నారు. విజయవాడ-మైలవరం వైపు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

వేలఎకరాల్లో పంటలు మునక

బుడమేరు, పులివాగు ఉగ్రరూపం దాల్చడంతో జి.కొండూరు మండలంలోని వెల్లటూరు, ఆత్కూరు, జి.కొండూరు, హెచ్.ముత్యాలంపాడు, కందులపాడు, కవులూరు, వెలగలేరు గ్రామాలతో పాటు విజయవాడ రూరల్ మండలంలోని కొత్తూరు తాడేపల్లి, పైడూరుపాడు, రాయనపాడు, జక్కంపూడి, షాబాద తదితర ఏరియాల్లో వేల ఎకరాలు వరి పొలాలు, కొన్ని చోట్ల పత్తి పొలాలు ముంపు బారిన పడ్డాయి.

బాహ్య ప్రపంచంతో తెగిన సంబంధాలు

బుడమేరు వరద ఉధృతికి హెచ్.ముత్యాలంపాడు, కవులూరు గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. హెచ్.ముత్యాలంపాడు, కవులూరు గ్రామాల చుట్టూ బుడమేరు వరద కమ్మేసింది. ఈరెండు గ్రామాలల్లోకి వెళ్లేందుకు అసలు ఏమార్గం లేకుండా చుట్టూ వరద చుట్టేసింది. ఆదివారం సైతం వరద తగ్గక పోవడంతో రెండు గ్రామాల్లో అసలు ఏం జరుగుతుందో తెలియని స్థితి నెలకొంది. పైగా ఫోన్స్ కూడా సరిగ్గా పని చేయకుండా పోయాయి. ఇంటర్నెట్ వ్యవస్థ పని చేయడం లేదు.

జల దిగ్బంధంలో పరీవాహక గ్రామాలు

ఇబ్రహీంపట్నం రూరల్ : రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు కృష్ణా పరీవాహక ప్రాంత గ్రామాలు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దాములూరు, చిలుకూరు గ్రామల చుట్టూ వరద నీరు చేరడంతో ఆగ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేల ఎకరాల్లో పంటలు నీటి మునిగాయి. వాణిజ్య పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు. పడవల సాయంతో ఆయా గ్రామాల్లో కూటమి నేతలు బాధితులను పరామర్శించి ధైర్యం చెబుతున్నారు.

అంధకారంలో రాయనపాడు

గొల్లపూడి : విజయవాడ రూరల్ మండలంలో అంధకారం నెలకొంది. సోమవారం కూడా విద్యుత్ సరఫరా జరుగుతుందో లేదోనని జనం ఆందోళన చెందుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులతో పాటు పలువురు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాయనపాడు ఎస్సీ కాలనీల మధ్య కాలువకు వరద పోటెత్తింది. గొల్లపూడిలోని లోతట్టు ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్ కింద భాగాల్లోకి వరద నీరు చేరడంత జనం ఇబ్బందులు పడ్డారు. రాయనపాడు స్టేషన్ వరదలో చిక్కుకుంది.

వత్సవాయిలో..

వత్సవాయి : పోలంపల్లి మునేరు ఆనకట్ట వద్ద 20 అడుగుల వరద ప్రవహిస్తుంది. పోలంపల్లి, పోచవరం, అల్లూరుపాడు వద్ద మునేరు కట్టకు గండ్లు పడ్డాయి. వేలాది ఎకరాలు నీట మునిగాయి. మక్కపేట చెరువు కట్ట తెగి పోవడంతో వరి, మిర్చి, పంటలు మునిగిపోయాయి. జీవాలు దొడ్లలోనే నిలిచిపోయాయి. విద్యుత్ ఉద్యోగులు మునేరు వద్ద తాత్కాలిక మరమ్మతులు చేస్తుండగా వరదలో చిక్కుకున్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్, ఆర్డీవో రవీంద్ర, రెవెన్యూ, పోలీస్‌లు వారిని కాపాడారు.

మహిళ, లైన్‌మెన్ గల్లంతు

జి.కొండూరు/ఇబ్రహీంపట్నం రూరల్ : హెచ్.ముత్యాలంపాడు గ్రామానికి చెందిన 10 మంది ట్రాక్టర్ ఇంజన్‌పై బుడమేరు వరదను దాటుకుంటూ గ్రామంలోకి ఆదివారం సాయంత్రం వెళుతున్నారు. ట్రాక్టర్ కొంత దూరం వెళ్లగానే ప్రవాహం పెరగడంతో ట్రాక్టర్ పల్టీ కొట్టింది. అందరూ వరదలో కొట్టుకుపోతుండగా సమాచారం అందుకున్న ఎస్సై కె.సతీష్, పోలీసులు 9 మందిని రక్షించగలిగారు. మరో మహిళ గొర్రె శివపార్వతి (25) వరద ప్రవాహంలో గల్లంతయ్యింది. ఈమె ఉపాధిహామి పథకంలో ఎఫ్ఏగా పని చేస్తున్నది.

మూలపాడు వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆదివారం రాత్రి మరమ్మతులు చేస్తుండగా ఒక్క సారిగా కృష్ణానది వరద రావడంతో ప్రమాదవశాత్తు లైన్‌మేన్ వి.కోటేశ్వరరావు గల్లంతయ్యాడు. అతను పశ్చిమ ఇబ్రహీంపట్నం నివాసం ఉంటున్నాడు.

ఉపొంగిన వాగులు.. ఒక్కరి గల్లంతు

ఎ.కొండూరు : పోలిశెట్టిపాడు-మారేపల్లి, రేపూడి- గొల్లమందల, కుమ్మరికుంట్ల- విస్సన్నపేట, చీమలపాడు-గంపలగూడెం రహదారుల మధ్య చెరువులు పొంగి ఉధృత్తంగా ప్రవహించాడంతో గ్రామాల మధ్య సంబంధాలు తెగిపోయాయి. రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఆర్ల పున్నయ్య(68) గేదలు కాపలాకు వేళ్లి తిరిగి ఇంటికి రాలేదు. సమీపంలోని పెద్దవాగులో గల్లంతు అయినట్టుగా అనుమనంతో గాలించిన ఆచూకీ లభ్యం కాలేదు. వందలాది ఎకరాల్లో వరి, పత్తి, మిరప, ఇతర పంటలు నీట మునిగాయి.

వరదలో చిక్కుకొని వృద్ధుడు మృతి

రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలం కుదప శివారు బుద్దారం గ్రామానికి చెందిన కొసరాజు వెంకటేశ్వరరావు (70) శనివారం తన పాడి గేదెలను మేత కోసం తోలుకొని పొలానికి వెళ్లాడు. శనివారం సాయంత్రానికి గేదెలు ఇంటికి వచ్చాయి. అయితే వెంకటేశ్వరరావు ఇంటికి రాలేదు. ఆదివారం రెవెన్యూ అధికారులకు చెరువులో శవమై కనిపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మునేరు మహోగ్రం

కంచికచర్ల : ఉగ్రరూపం దాల్చిన మునేరు ఆదివారం మధ్యాహ్నం ఎన్టీఆర్ జిల్లాలో రోడ్డెక్కింది. నందిగామ మండలం ఐతవరం వద్ద 65వ నెంబరు జాతీయ రహదారిపై నాలుగు అడుగుల ఎత్తున పొంగుతోంది. విజయవాడ - హైదరాబాద్ మార్గంలో వాహనాల రాకపోకలు పూర్తిగా బంద్ అయ్యాయి. ఎగువ ప్రాంతం తెలంగాణా రాష్ట్రం వరంగల్, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు కురవటంతో మునేరుకు వరద పోటెత్తింది. శనివారం అర్ధరాత్రి నుంచి వరద ఉగ్రరూపం దాల్చింది. ప్రమాద స్థాయిని మించి 2.50 లక్షల క్యూసెక్కులకు పైగా వస్తున్నది. వైరాయేరు, కట్లేరు కల్సి మరో 50 వేల క్యూసెక్కులు వస్తున్నాయి. ఉగ్రరూపం దాల్చిన మునేరు కీసర వంతెన, ఐతవరం గ్రామాల మధ్య రెండు చోట్ల జాతీయ రహదారిపైకి చేరింది. నాలుగు అడుగుల ఎత్తున వరద ప్రవహిస్తుండటంతో ఆదివారం మధ్యాహ్నం నుంచి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. దాదాపు 40 వాహనాలు వరద మధ్యలో మెరక ప్రాంతంలో చిక్కుకుపోయాయి. సాయంత్రానికి వాహనాల వద్దకు వరద చేరటంతో ప్రయాణీకులు భయాందోళన చెందుతున్నారు. టోల్‌గేట్‌కు చెందిన భారీ క్రేన్ సాయంతో ప్రయాణీకులను ఒడ్డుకు తీసుకువస్తున్నారు. నందిగామ ఆర్డీఓ ఎ. రవీంద్రరావు పరిస్థితిని సమీక్షిస్తూ, ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలుపుతున్నారు. ఏలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులు పవారా కాస్తున్నారు. కీసర టోల్‌గేట్ వద్ద, ఐతవరం వద్ద వేల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. విజయవాడ నుంచి హైదరాబాదు వైపు వెళ్లే వాహనాలను ఇబ్రహీంపట్నం, తిరువూరు, ఖమ్మం రూటులో రూటులో మళ్లిస్తున్నారు. హైదరాబాదు నుంచి విజయవాడ వైపు వచ్చే వాహనాలను సూర్యాపేట, కోదాడ వద్ద ఖమ్మం రూటులో మళ్లిస్తున్నారు. చిల్లకల్లు - వైరా రూటులో కూడా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. లింగాల కాజ్‌వేపై మునేరు పదడుగుల ఎత్తున పొంగుతోంది. పెనుగంచిప్రోలు వంతెనను మూసివేశారు.



కీసర - ఐతవరం గ్రామాల మధ్య జాతీయ రహదారిపై మునేరు ఉధృతి

వేల ఎకరాల్లో పంటలు మునక

కంచికచర్ల: భారీ వర్షాలు, వరదలకు నందిగామ డివిజన్‌లో వేలాది ఎకరాల పంటలు దెబ్బతిన్నాయి. రెండు రోజుల్లోనే పంటలు దెబ్బతినటం, కోట్లలో నష్టం వాటిల్లటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కంచికచర్ల మండలం కునికినపాడు, మున్నలూరు, చెవిటికల్లు పథకాల ఆయకట్టులో 15 వందల ఎకరాల్లో పైగా వరి నాట్లు వేశారు. భారీ వర్షాలు నట్టేట ముంచాయి. మూడు అడుగుల ఎత్తున వరద నీరు పారుతున్నది. వరి బతకటం చాలా కష్టమని రైతులు చెపుతున్నారు. పరిటాల చెరువు ఆయకట్టులో కూడా వందలాది ఎకరాల్లో రైతులు వరి విత్తనాలు చల్లారు. చెరువుకు వచ్చే యేనుగుగడ్డవాగు మహోగ్రరూపం దాల్చింది. చెరువు కట్టకు రెండు చోట్ల గండి పడింది. ఆయకట్టు భూములపై వరద పారుతున్నది. వరి పూర్తిగా దెబ్బతిన్నదని రైతులు వాపోతున్నారు. నందిగామ మండలం ఐతవరం, అంబారుపేట, కంచెల తదితర గ్రామాల్లో వేసిన వరి నాట్లు కూడా దెబ్బతిన్నాయి. ఉగ్రరూపం దాల్చిన మునేరు వరద పంట పొలాలను ముంచెత్తింది. మున్నలూరు, మోగులూరు, చందర్లపాడు మండలం ఏటూరు గ్రామాలకు చెందిన లంక భూముల్లోని అరటి, కంద, పసుపు, మొక్కజొన్న, పత్తి చేలు మూడు రోజుల నుంచి నీటిలో తేలియాడుతున్నాయి. భారీ వర్షాలు, వరదల వల్ల డివిజన్ పరిధిలోని రైతులకు కోలుకోలేనంతగా దెబ్బతగిలింది.



కునికినపాడు వద్ద నీట మునిగిన మాగాణి వరి చేలు

రైల్వే హెల్ప్‌లైన్ నెంబర్లు

రైల్వే స్టేషన్ : భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ హెల్ప్ లైన్ నెంబర్లను ఏర్పాటు చేసినట్లు సంబంధిత రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు రైళ్లను రద్దు చేయగా, మరికొన్ని రైళ్లను దారిమళ్లించినట్లు పేర్కొన్నారు. ముఖ్యమైన స్టేషన్లలో హెల్ప్‌లైన్ నెంబర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విజయవాడ - 7569305697, రాజమండ్రి - 088324 20541, తెనాలి - 08644-227600, తుని - 7815909479, నెల్లూరు - 7815909469, గూడూరు - 08624 - 250795, ఒంగోలు - 7815909489, గుడివాడ - 7815909462, భీమవరం టౌన్ - 7815909402, నిడదవోలు 08813 - 223325, తాడేపల్లిగూడెం - 08818 - 226162, ఏలూరు - 7569305268 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

కృష్ణమ్మ ఉగ్రరూపం..



నాగాయలంకలోని శ్రీరామపాదక్షేత్రం వద్ద ఆదివారం సాయంత్రానికి కృష్ణవేణి నడుం వరకు చేరిన నీరు

- బ్యారేజీ నుంచి 9 లక్షల క్యూసెక్కుల నీరు
- అవనిగడ్డలో హైటెన్షన్
- ఆరుచోట్ల పునరావాస శిబిరాలు

అవనిగడ్డ, సెప్టెంబరు 1 : ప్రకాశం బ్యారేజీకి పెద్ద ఎత్తున వరద పోటెత్తడంతో కృష్ణానది ఉగ్రరూపం దాల్చింది. ఎగువన ఉన్న పులిచింతల, మున్నేరు నుంచి దాదాపు 9 లక్షల క్యూసెక్కుల వరద నీరు ఒక్కసారిగా ప్రకాశం బ్యారేజీకి వచ్చి చేరుతుండటంతో అధికారులు ఒక్కసారిగా వరద నీటిని దిగువకు విడుదల చేయటంతో అవనిగడ్డ నియోజకవర్గంలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఆదివారం సాయంత్రానికే పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద దాదాపుగా 19 అడుగులకుపైగా వరద మట్టం నమోదు కాగా, ఆదివారం ఉదయం ఇక్కడికి చేరేందుకు కొంత సమయం ఉండటంతో ఈ రాత్రికే కృష్ణానది వరద పులిగడ్డ ఆక్విడెక్ట్ పైగా ప్రవహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. శనివారం వరకు 3.40 లక్షల క్యూసెక్కుల వరద కొనసాగగా, మున్నేరు, కట్టలేరు, వైరా తదితర వాగుల నుంచి పెద్ద ఎత్తునప్రకాశం బ్యారేజీకి వచ్చి చేరటం, పులిచింతలలో విడుదల చేసిన దాదాపు 7 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజీకి రావటంతో ఈ మొత్తం నీటిని దిగువకు విడుదల చేయటంతో కృష్ణానది ఉగ్రరూపంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు, నది పరివాహక ప్రాంతాల వాసులు, లంక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఆరు గ్రామాలకు వరద ముప్పు

అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని ఆరు గ్రామాలకు వరద ముప్పు పొంచి ఉంది. చల్లపల్లి మండల పరిధిలోని ఆముదార్లంక, మోపిదేవి మండల పరిధిలోని కె.కొత్తపాలెం ఎస్సీ కాలనీ, అవనిగడ్డ మండల పరిధిలోని పులిగడ్డ శివారు గ్రామాలు, దక్షిణచిరువోలులంక, పాత ఎడ్లంక గ్రామాలకు, నాగాయలంక పరిధిలోని చిన్న కరకట్టపల్లెపాలెం ప్రాంతాలకు వరద నీరు చేరుతుందని అంచనా వేసిన అధికారులు అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. మోపిదేవి మండలం కె.కొత్తపాలెం ఎస్సీ కాలనీకి చెందిన 500 మందిని కొత్తపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన సహాయ శిబిరానికి తరలించగా, పులిగడ్డ శివారు రేగుల్లంక, పులిగడ్డ పల్లెపాలెం గ్రామాల ప్రజలను పులిగడ్డ యుపి పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరానికి తరలించారు.

తీవ్ర ఆందోళనలో ఎదురుమొండి దీవులు

కృష్ణానదికి పెద్ద ఎత్తున వరద రావటంతో జిల్లాలో అతి పెద్ద దీవి గ్రామాల సమూహమైన ఎదురుమొండి దీవుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వరద ఉధృతికి ఇప్పటికే ఎదురుమొండి నుంచి జింకపాలెం వెళ్లే రహదారి బ్రహ్మయ్యగారి మూల దాటిన తర్వాత పూర్తిగా కోసుకుపోయి నదిలో కలిసి పోవటంతో వరద తగ్గిన తర్వాత రాకపోకలకు ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు ఎదురుమొండి దీవులకు రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు.

వరదల కారణంగా ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ అమెరికా నుంచి విడుదల చేసిన వీడియో సందేశంలో పేర్కొన్నారు.



పులిగడ్డ అక్విడెక్ట్‌ను తాకుతూ ప్రవహిస్తున్న వరద నీరు

ఇసుక బ్యాగ్‌లు సిద్ధం చేస్తున్న అధికారులు

కృష్ణానదికి 1098 స్థాయిలో వరదలు ముంచెత్తటంతో అధికారులు ముందు జాగ్రత్త చర్యగా ఇరిగేషన్ అధికారులు ఇసుక బస్తాలు సిద్ధం చేస్తున్నారు. డిఎల్‌పివో జ్యోతిర్మయి నేతృత్వంలో పునరావాస కేంద్రాల్లో శానిటేషన్ పనులను నిర్వహించటంతోపాటు వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు.



కొండ చరియలు విరిగిపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

రక్షణ చర్యలపై దృష్టి పెడతాం

- మంత్రి నారాయణ

గుణదల : కొండ ప్రాంతాల్లో నివాసితుల విషయంలో ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవాలన్న దానిపై దృష్టి పెడతామని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. సున్నపు బట్టీల సెంటర్లో శనివారం కొండచరియలు విరిగి పడి ఐదుగురు చనిపోయిన ప్రదేశాన్ని మంత్రి నారాయణ, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్‌రావులు ఆదివారం ఉదయం పరిశీలించారు. శిధిలాల తొలగింపు పనులను పరిశీలించి సహాయ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చనిపోయిన వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. బండరాళ్ళు పడి ఐదుగురు చనిపోవడం దురదృష్టకరమన్నారు. కొండరాళ్లు పడిన ఘటనలో చికిత్స పొందుతున్న మరో నలుగురి పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ప్రస్తుతం ఇంకా శిధిలాల తొలగింపు జరుగుతుందని తెలిపారు. భవిష్యత్ కాలంలో ఇటువంటి ఘటనలు జరగకుండా అధికారులతో మాట్లాడి తగు జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్‌లపై పోస్టులు పెట్టిన వ్యక్తి అరెస్టు

ఆంధ్రజ్యోతి - గుడివాడ : ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఫోటోలను మార్ఫింగ్ చేస్తూ సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెడుతున్న వైసిపి కార్యకర్త ఇంటూరి రవికిరణ్‌ను గుడివాడ పోలీసులు హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. టిడిపి సోషల్ మీడియా మచిలీపట్నం కన్వీనర్ అసిలేటి నిర్మల ఫిర్యాదు మేరకు రవికిరణ్‌ను పోలీసులు అరెస్టు చేసి వన్‌టౌన్‌కు తరలించారు. గత కొంతకాలంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లపై అవమానపరిచేలా మార్ఫింగ్ చేసి పోస్టులను పెడుతున్నాడని అసిలేటి నిర్మల పేర్కొన్నారు. వైసిపి కార్యకర్త రవికిరణ్‌ను పరామర్శించేందుకే మాజీ మంత్రి పేర్ని నాని గుడివాడ రాగా ఆయనకు నిరసన సెగ తగిలింది.



చెప్పులు చూపిస్తున్న జనసేన, టిడిపి నాయకులు

- రవి కిరణ్ పరామర్శకు వచ్చిన పేర్ని
- రాళ్లు, కోడిగుడ్లతో వైసిపి నేత కారుపై దాడి
- పెట్రోల్ పోసి తగలబెట్టే ప్రయత్నం
- నిలువరించేందుకు పోలీసుల ప్రయత్నాలు

గుడివాడలో జనసైనికుల ఆగ్రహం

ఆంధ్రజ్యోతి - గుడివాడ : వైసీపీ కార్యకర్త ఇంటూరి రవికిరణ్‌ను పరామర్శించేందుకు వచ్చిన మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నానిపై జనసైనికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకప్పుడు వైసీపీ అధినేత జగన్ కనుసైగతో పవన్‌పై నోటికి వచ్చినట్టు విరుచుకుపడ్డ మాజీ మంత్రి పేర్ని నానికి జనసేన నాయకులు, కార్యకర్తలు చుక్కలు చూపించారు. చేసిన అవమానానికి తగిన రీతిలో ప్రతిగా చెప్పులు చూపించి దడ పుట్టించారు. బయటకు రా తేల్చుకుందాం అని ప్రతి సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వైసీపీ కార్యకర్త ఇంటూరి రవికిరణ్‌ను ఒన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ నేపధ్యంలో రవికిరణ్‌ను పరామర్శించేందుకే మాజీ మంత్రి పేర్ని నాని గుడివాడ వచ్చినట్టు జనసేన నాయకులు ఆరోపిస్తున్నారు. అనంతరం స్థానిక వైసీపీ నేత తోట శివాజీ ఇంటికి నాని చేరుకున్నారు.

మాజీ మంత్రి పేర్ని గుడివాడ వచ్చినట్టు తెలుసుకున్న జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు శివాజీ ఇంటికి చేరుకుని అపార్టుమెంట్ ఎదురుగా రోడ్డుపై బైఠాయించారు. ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపలోకి తీసుకువచ్చేందుకు విశ్వప్రయత్నం చేశారు. పేర్ని నాని క్షమాపణ చెప్పే వరకు ధర్నాను విరమించబోమని జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు భీష్మించుకు కూర్చున్నారు.

అధికారంలో ఉండగా మాజీ మంత్రి పేర్ని నాని చెప్పు చూపించి తేల్చుకుందాం రా.. అని పవన్‌కు సవాల్ విసిరారు. దీనికి సమాధానంగా గుడివాడ జనసేన, టిడిపి నాయకులు తలా ఒక చెప్పు చేతబట్టి ప్రతి సవాల్ విసిరారు. దమ్ముంటే బయటకు వచ్చి తేల్చుకోవాలని, పిరికిపందలా ఇంట్లో దాక్కోవడం ఏమిటని యద్దేవ చేశారు.

రాళ్ళు, కోడిగుడ్లతో దాడి..

స్థానిక వైసీపీ నేత పాలేటి చంటికి చెందిన కారుపై రాళ్లు, కోడిగుడ్లతో జనసైనికులు దాడిచేశారు. వాహనం అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పేర్ని నాని కారుపై పెట్రోలు పోసి నిప్పంటించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

స్పోర్ట్స్

విజయవాడ ● సోమవారం 2 సెప్టెంబరు 2024

ధనుష్‌కు రికార్డు స్వర్ణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రపంచ బధిర షూటింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన ధనుష్ శ్రీకాంత్ వరల్డ్ రికార్డుతో పసిడి పతకం సొంతం చేసుకున్నాడు. ఆదివారం జర్మనీలోని హనోవర్‌లో జరిగిన ఎయిర్ రైఫిల్ 10 మీటర్ల ఈవెంట్‌లో ధనుష్ 632.7 స్కోరు చేసి విజేతగా నిలిచాడు. ఈ క్రమంలో 625.1 స్కోరుతో ఉన్న ప్రపంచ రికార్డును ధనుష్ బద్దలుకొట్టాడు. సోమవారం జరిగే టీమ్, మిక్స్‌డ్ ఈవెంట్లలోనూ ధనుష్ తలపడనున్నాడు.

ఇంగ్లండ్ ఘన విజయం

లార్డ్స్: శ్రీలంకతో రెండో టెస్ట్‌లో ఇంగ్లండ్ 190 పరుగులతో ఘన విజయం సాధించింది. 483 పరుగుల భారీ ఛేదనలో 53/2తో ఆదివారం, నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పర్యాటక జట్టు 292 పరుగులకు ఆలౌటైంది. చాందిమల్ (58), కరుణరత్నే (55), కెప్టెన్ ధనంజయ డిసిల్వా (50) అర్ధశతకాలు సాధించారు. పేసర్ అట్కిన్సన్ (5/62) ఐదు వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 427, శ్రీలంక 196 రన్స్ చేయగా, ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 251 పరుగులు సాధించింది. అట్కిన్సన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. ఇక..మూడు టెస్ట్‌ల సిరీస్‌లో ఆతిథ్య జట్టు 2-0 ఆధిక్యంతో కొనసాగుతోంది. మూడో, ఆఖరి టెస్ట్ ఈనెల 6 నుంచి జరగనుంది.

లిట్టన్ దాస్ శతకం

బంగ్లా 262
పాక్ 9/2

రావల్పిండి: సెంచరీ హీరో లిట్టన్ దాస్ (138), మెహ్దీ హసన్ మిరాజ్ (78) పోరాడడంతో.. పాకిస్థాన్‌తో రెండో టెస్ట్‌లో బంగ్లాదేశ్ దీటుగానే బదులిచ్చింది. ఆటకు మూడోరోజైన ఆదివారం 10/0తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లా 262 పరుగులకు ఆలౌటైంది. 26/6తో పీకల్లోతు కష్టాల్లోపడ్డ తరుణంలో దాస్, హసన్ ఏడో వికెట్‌కు 165 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. పేసర్ ఖుర్రమ్ షెహజాద్ 6 వికెట్లు పడగొట్టాడు. 12 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన పాక్ ఆట ముగిసేసరికి 9/2 స్కోరు చేసింది. సలీమ్ అయూబ్ (6) క్రీజులో ఉన్నాడు. పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 274 పరుగులు చేసింది.

నిషద్‌కు రజతం

పారాలింపిక్స్

హైజంప్‌లో రెండోస్థానం
200 మీ. రేసులో ప్రీతికి కాంస్యం

షట్లర్లకు మూడు పతకాలు ఖరారు
ఫైనల్లో నితేశ్, సుహాస్




నితేశ్

పారిస్: పారాలింపిక్స్‌లో నాలుగో రోజు పతకం లేకుండానే ముగుస్తుందనుకున్న వేళ.. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో మన అథ్లెట్లు రెండు మెడల్స్‌తో శభాష్ అనిపించారు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన పురుషుల హైజంప్ టీ47 ఈవెంట్‌లో స్టార్ అథ్లెట్ నిషద్ కుమార్ రజతంతో మురిపించాడు. నిషద్ 2.04 మీటర్ల ఎత్తులో జంప్ చేయడంతో పాటు సీజన్ బెస్ట్ మార్క్‌ను నమోదు చేశాడు. నిషద్‌కు ఇది రెండో పారాలింపిక్ పతకం. 2020 టోక్యో గేమ్స్‌లోనూ అతను రజతం అందుకున్నాడు. కాగా, ఓవరాల్‌గా పారాహైజంప్‌లో భారత్‌కిది ఏడో పతకం. ఇదే పోటీలో పాల్గొన్న రామ్ పాల్ మాత్రం 1.95మీ.తో ఏడో స్థానంలో నిలిచాడు. మరోవైపు మహిళల 200మీ. టీ35లో ప్రీతి పాల్ కాంస్యం సాధించింది. దీంతో ఈ క్రీడల్లో భారత్ ఖాతాలో ఓ స్వర్ణం, 2రజతాలు, 4 కాంస్యాలు చేరాయి.

రాకెట్ రయ్‌మంటూ..


సుహాస్

పారాలింపిక్స్‌లో నాలుగో రోజు భారత షట్లర్ల హవా సాగింది. తమదైన ప్రదర్శనతో దేశానికి కనీసం మూడు రజత పతకాలు ఖాయం చేశారు. ఆదివారం జరిగిన పురుషుల బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో నితేశ్ కుమార్, సుహాస్ యతిరాజ్ తమ విభాగాల్లో తుది పోరుకు అర్హత సాధించారు. మొదట జపాన్ షట్లర్ డైసుకె ఫుజిహరతో జరిగిన ఎస్ఎల్3 కేటగిరీ సెమీస్‌లో నితేశ్ 21-16, 21-12 తేడాతో సునాయాసంగా గెలిచాడు. సోమవారం జరిగే ఫైనల్లో డానియెల్ బెథెల్ (గ్రేట్ బ్రిటన్)తో నితేశ్ తలపడతాడు. ఫైనల్లో ఓడినా అతనికి కనీసం రజతం దక్కుతుంది. ఐఐటీ మండి గ్రాడ్యుయేట్ అయిన 29 ఏళ్ల నితేశ్‌కు పారాలింపిక్స్‌లో ఇదే తొలి పతకం కానుంది. కాగా, టోక్యో పారాగేమ్స్‌లో ఇదే విభాగం నుంచి ప్రమోద్ భగత్ స్వర్ణం గెలిచాడు. అలాగే ఎస్ఎల్4 కేటగిరీలో జరిగిన మరో సెమీఫైనల్స్‌లో సుహాస్ యతిరాజ్ తన సహచర షట్లర్ సుకాంత్ కదమ్‌పై 21-17, 21-12 తేడాతో గెలిచాడు. యూపీ ఐఏఎస్ అధికారిగా ఉన్న సుహాస్ ఖాతాలో మరో పారాలింపిక్ మెడల్ చేరనుంది. టోక్యో గేమ్స్‌లో తను రజతం సాధించిన విషయం తెలిసిందే. ఇక, మహిళల సింగిల్స్ ఎస్‌యూ 5 విభాగంలోనూ ఇద్దరు భారత షట్లర్లు మనీషా రామదాసు, తులసిమతి మురుగేశన్ అమీతుమీ తేల్చుకోనున్నారు. తులసిమతి శనివారమే ఫైనల్ చేరగా.. ఆదివారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో 19 ఏళ్ల మనీషా 21-13, 21-16 తేడాతో మమికో టోయోడా (జపాన్)ను ఓడించింది. మనీషా, తులసిమతి సెమీస్ పోరుతో కనీసం మరో రజతం భారత్ ఖాతాలో పడనుంది. అలాగే మహిళల సింగిల్స్ వ్యక్తిగత విభాగం ఎస్‌హెచ్6 సెమీ ఫైనల్లో నిత్యశ్రీ సివాన్ 13-21, 19-21 తేడాతో లిన్ షువాంగ్‌బావో (చైనా) చేతిలో ఓటమిపాలైంది. ఇక, నిత్యశ్రీ కాంస్య కోసం పోరాడనుంది. అయితే మిక్స్‌డ్ డబుల్స్ ఎస్‌హెచ్6 సెమీస్‌లో భారత జంట శివరాజన్-నిత్యశ్రీ 21-17, 14-21, 13-21 తేడాతో అమెరికా జోడీ చేతిలో ఓడింది. ఈ ద్వయం కాంస్య పతకం కోసం తలపడనుంది. మహిళల సింగిల్స్ ఎస్ఎల్3లో మన్‌దీప్ కౌర్, ఎస్ఎల్ 4లో పాలక్ కోహ్లీ పోరు క్వార్టర్స్‌లోనే ముగిసింది.

షూటింగ్‌లో గురి తప్పింది: పారాగేమ్స్‌లో ఇప్పటికే నాలుగు పతకాలతో అదరగొట్టిన షూటర్లు ఆదివారం మాత్రం తమ లక్ష్యానికి దూరంగా ఉండిపోయారు. ఇదివరకే వ్యక్తిగత విభాగంలో స్వర్ణం సాధించిన అవనీ లేఖారా, మిక్స్‌డ్ ఈవెంట్‌లో నిరాశపరిచింది. అవని, సిద్ధార్థ బాబు ద్వయం మిక్స్‌డ్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ప్రోన్ ఎస్‌హెచ్1లో ఫైనల్ చేరడంలో విఫలమైంది. క్వాలిఫికేషన్‌లో అవని 632.8 పాయింట్లతో 11వ స్థానం, సిద్ధార్థ 628.3 పాయింట్లతో 28వ స్థానంలో నిలిచారు. అలాగే మిక్స్‌డ్ 10మీ. ఎయిర్ రైఫిల్ ప్రోన్ ఎస్‌హెచ్2 క్వాలిఫికేషన్‌లో షూటర్ శ్రీహర్ష దేవరడ్డి 26వ స్థానంలో నిలవడంతో ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయాడు.

పాయింట్ తేడాతో కాంస్యం చేజారె..



వరల్డ్ నెంబర్‌వన్, భారత ఆర్చర్ రాకేశ్ కుమార్ పారాలింపిక్స్‌లో తృటిలో కాంస్య పతకం చేజార్చుకున్నాడు. ఆదివారం జరిగిన పురుషుల కాంపౌండ్ ఓపెన్ కేటగిరీ కాంస్య పతక పోరులో రాకేశ్ 146-147 తేడాతో హి జిహావో (చైనా) చేతిలో ఓడాడు. అంతకుముందు సెమీస్‌లో రాకేశ్ 143-145తో చైనాకు చెందిన జిన్ లియాంగ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. అయితే ప్రీక్వార్టర్స్, క్వార్టర్స్‌లో స్కోర్లు సమమైనా షూటాఫ్‌లో గట్టెక్కాడు.

రవి రాణించినా..



అథ్లెటిక్స్, రోయింగ్, షూటింగ్‌లో భారత్‌కు చేదు ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల షాట్‌పుట్ ఎఫ్40 ఫైనల్స్‌లో తెలుగు అథ్లెట్ రవి రొంగలి ఇనుప గుండును 10.63 మీటర్ల దూరం విసిరి తన అత్యుత్తమ ప్రదర్శన చూపాడు. కానీ ఓవరాల్‌గా అతను ఐదో స్థానంలో నిలవడంతో పతకం దూరమైంది. గతేడాది ఆసియా పారాగేమ్స్‌లో రవి రజతం అందుకున్నాడు. ఇక రోయింగ్ పీఆర్3 మిక్స్‌డ్ డబుల్ స్కల్స్ ఫైనల్ బి రెపిచేజ్‌లో మరో తెలుగు అథ్లెట్ నారాయణ-అనిత జోడీ 8 నిమిషాల 16.96 సెకన్ల టైమింగ్‌తో రెండో స్థానంలో నిలిచింది. అయితే ఈ పోటీ 7 నుంచి 12 స్థానాల కోసం కావడంతో వీరు మొత్తంగా ఎనిమిదో ప్లేస్‌తో తమ ప్రస్థానాన్ని ముగించారు. మహిళల 1500 మీటర్ల టీ11 హీట్3 తొలి రౌండ్‌లో రక్షిత రాజు 5 నిమిషాల 29.92 సెకన్ల టైమింగ్‌తో నాలుగో స్థానంలో నిలిచి వెనుదిరిగింది. ప్రతీ హీట్ నుంచి టాప్-2 ప్లేయర్స్ మాత్రమే ఫైనల్ వెళతారు.

ప్రీతి చరిత్ర



పారిస్: పారాలింపిక్స్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో యువ అథ్లెట్ ప్రీతి పాల్ సంచలన ప్రదర్శన నమోదుచేసింది. ఈ క్రీడల్లో రెండో పతకంతో చరిత్ర సృష్టించింది. రెండ్రోజుల క్రితమే మహిళల 100 మీటర్ల రేసులో కాంస్య పతకం సాధించిన 23 ఏళ్ల ప్రీతి.. 200 మీటర్ల టీ35 విభాగం రేసులోనూ సత్తా చాటుతూ కాంస్యం కొల్లగొట్టింది. ఈ విభాగంలో దేశానికిదే తొలి మెడల్ కావడం విశేషం. ఆదివారం జరిగిన ఫైనల్ రేసులో ప్రీతి 30.01 సెకన్ల టైమింగ్‌తో మూడో స్థానంలో నిలిచి ఈ క్రీడల్లో డబుల్ సాధించింది. దీంతో పారాగేమ్స్ అథ్లెటిక్స్‌లో రెండు పతకాలు అందుకున్న ఏకైక భారత అథ్లెట్‌గా ప్రీతి రికార్డులకెక్కింది. ఇక.. ఈ క్రీడల్లో ఓ స్వర్ణం, రజతం, నాలుగు కాంస్యాలతో కలిపి మొత్తం ఆరు పతకాలు భారత్ ఖాతాలో చేరాయి.

హర్మన్‌కు నో చాన్స్

బిగ్‌బాష్‌లో మంధాన సహా ఆరుగురు భారత క్రికెటర్లు

మెల్‌బోర్న్: టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు మహిళల బిగ్‌బాష్ లీగ్‌లో ఈసారి చాన్స్ దక్కలేదు. ఆదివారం నిర్వహించిన లీగ్ డ్రాఫ్ట్ (వేలం)లో హర్మన్‌ను ఎవరూ కొనుగోలు చేయలేదు. గతంలో ఈ లీగ్‌లో అదరగొట్టిన హర్మన్‌పై ఏ ఫ్రాంచైజీ ఆసక్తిచూపకపోవడం గమనార్హం. ఇక, ఈసారి స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన సహా ఆరుగురు భారత ప్లేయర్లు బిగ్‌బాష్ లీగ్‌కు ఎంపికయ్యారు. కాగా, అడిలైడ్ స్ట్రయికర్స్ తరఫున ఆడేందుకు మంధాన ముందుగానే ఒప్పందం చేసుకోగా.. టాపార్డర్ బ్యాటర్ దయాళన్ హేమలతను పెర్త్ స్కార్చర్ దక్కించుకొంది. ఆల్‌రౌండర్ దీప్తి శర్మతోపాటు వికెట్ కీపర్ యాస్తిక భాటియాను మెల్‌బోర్న్ స్టార్స్ కొనుగోలు చేసింది. పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ శిఖా పాండేతోపాటు జెమీమా రోడ్రిగ్స్‌ను బ్రిస్బేన్ హీట్ ఖరీదు చేసింది. అక్టోబరు 27 నుంచి బిగ్‌బాష్ లీగ్ జరగనుంది.

స్వియటెక్, సిన్నర్ జోరు

ప్రీక్వార్టర్స్‌కు టాప్‌సీడ్లు
యూఎస్ ఓపెన్


స్వియటెక్

న్యూయార్క్: వరల్డ్ నెంబర్‌వన్ ర్యాంకర్లు ఇగా స్వియటెక్, జానిక్ సిన్నర్ యూఎస్ ఓపెన్‌లో సింగిల్స్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో టాప్‌సీడ్ స్వియటెక్ 6-4, 6-2తో అనస్టాసియా పల్యుచెన్కోవా (రష్యా)ను చిత్తు చేసింది. ఇతర మ్యాచ్‌ల్లో 22వ సీడ్ హదద్ మయా 6-3, 6-1తో 15వ సీడ్ కలిన్‌స్కయాకు షాకివ్వగా, పెజ్నియాకి 6-3, 6-2తో పోస్పెట్‌ని, బడోసా 6-1, 6-2తో వాంగ్‌ని ఓడించి నాలుగో రౌండ్‌లో ప్రవేశించారు. పురుషుల సింగిల్స్ మూడో రౌండ్‌లో టాప్‌సీడ్ సిన్నర్ 6-1, 6-4, 6-2తో క్రిస్ ఓ కొనెల్ (ఆస్ట్రేలియా)పై గెలిచాడు. ప్రీక్వార్టర్స్‌లో 14వ సీడ్ టామీ పాల్ (అమెరికా)తో సిన్నర్ తలపడతాడు. మూడో రౌండ్‌లో పాల్ 6-7 (7), 6-3, 6-1, 7-6 (3)తో గాబ్రియెల్ డియాలోపై, ఐదో సీడ్ మెద్వెదెవ్ 6-3, 6-4, 6-3తో కొబోలీపై, 10వ సీడ్ డిమినార్ 6-3, 6-7 (7), 6-0, 6-0తో ఇవాన్స్‌పై గెలుపొందారు.

మిక్స్‌డ్ క్వార్టర్స్‌లో బోపన్న జోడీ: మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత స్టార్ ఆటగాడు రోహన్ బోపన్న క్వార్టర్‌ఫైనల్ చేరాడు. ప్రీక్వార్టర్స్‌లో 8వ సీడ్ బోపన్న/అల్డిలా సుజియాది (ఇండోనేసియా) ద్వయం 0-6, 7-6 (5), 10-7తో జాన్ పియర్స్ (ఆస్ట్రేలియా)/ సినియకోవా (చెక్ రిపబ్లిక్) జోడీపై నెగ్గింది. ఇక, పురుషుల డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో భారత్‌కు చెందిన యుకీ బాంబ్రి/అల్బనో ఒలివేటి (ఫ్రాన్స్) జోడీ 2-6, 2-6తో గ్రానోలెర్స్ (స్పెయిన్)/జబలోస్ (అర్జెంటీనా) జోడీ చేతిలో ఓడింది.

ఆగస్టు జీఎస్‌టీ వసూళ్లు
రూ.1.75 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: ఈ ఏడాది ఆగస్టు నెల జీఎస్‌టీ వసూళ్లు రూ.1,74,962 కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే కాలంలో వసూలైన రూ.1,59,069 కోట్లతో పోలిస్తే ఇది 10 శాతం ఎక్కువ. అయితే ఈ ఏడాది జూలైతో పోలిస్తే మాత్రం ఇది తక్కువే. ఈ ఏడాది జూలైలో జీఎస్‌టీ వసూళ్లు రూ.1,82,075 కోట్లుగా ఉన్నాయి. కాగా ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు జీఎస్‌టీ ద్వారా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ఖజానాకు రూ.9.13 లక్షల కోట్లు చేరాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో వసూలైన రూ.8.29 లక్షల కోట్లతో పోలిస్తే ఇది 10.1 శాతం ఎక్కువ.

అన్నింటా పెరుగుదల: గత నెల సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ, ఐజీఎస్‌టీలతో పాటు సెస్సుల వసూళ్లలోనూ పెరుగుదల కనిపించింది. సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీల వసూళ్లు గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 9.2 శాతం పెరిగి రూ.1.25 లక్షల కోట్లకు చేరాయి. ఇదే సమయంలో దిగుమతి వస్తువులపై విధించే జీఎస్‌టీ వసూళ్లు 12.1 శాతం పెరిగి రూ.49,976 కోట్లకు చేరాయి. ఆగస్టు నెల రిఫండ్స్ కూడా గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 38 శాతం పెరిగి రూ.24,460 కోట్లుగా నమోదయ్యాయి. రిఫండ్స్ పోనూ ఆగస్టు నెల నికర జీఎస్‌టీ వసూళ్లు 6.5 శాతం పెరిగి రూ.1.5 లక్షల కోట్లకు చేరాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో జీఎస్‌టీ వసూళ్లు రూ.2.10 లక్షల కోట్లకు చేరి రికార్డు సృష్టించాయి.

9న జీఎస్‌టీ మండలి భేటీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన జీఎస్‌టీ మండలి ఈ నెల 9న భేటీ కానుంది. కొన్ని వస్తువులపై జీఎస్‌టీ హేతుబద్ధీకరణ, టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీలను జీఎస్‌టీ నుంచి మినహాయించడం వంటి అంశాలపై ఈ సమావేశం స్పష్టత ఇస్తుందని భావిస్తున్నారు.

ఐఓసీ చైర్మన్‌గా సతీష్ కుమార్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని చమురు రిటైల్ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) చైర్మన్‌గా వీ సతీశ్ కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఐఓసీ మార్కెటింగ్ విభాగం డైరెక్టర్‌గా ఉన్న ఆయనకు ప్రభుత్వం అదనపు బాధ్యతగా ఈ పదవి కట్టబెట్టింది. కంపెనీకి పూర్తి స్థాయి చైర్మన్‌ని నియమించే వరకు ఆయన ఈ పదవిలో ఉంటారు. పెట్రో ఉత్పత్తుల మార్కెటింగ్‌లో విశేష అనుభవం ఉన్న సతీశ్ కుమార్ నేతృత్వంలో ఐఓసీ కొత్తపుంతలు తొక్కింది.

బిజినెస్

9న బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓ

న్యూఢిల్లీ: బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 9న ప్రారంభమై 11న ముగియనుంది. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.6,560 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఇష్యూలో భాగంగా రూ.3,560 కోట్లకు కొత్తగా ఈక్విటీ షేర్లు జారీ చేయనుండగా మాతృసంస్థ బజాజ్ ఫైనాన్స్ ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా రూ.3,000 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నట్లు రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (ఆర్‌హెచ్‌పీ)లో కంపెనీ తెలిపింది. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)లకు సంబంధించి భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) జారీ చేసిన నిబంధనలకు అనుగుణంగా ఈ వాటాల విక్రయం ఉంటుందని బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ పేర్కొంది. ఐపీఓ ద్వారా సమీకరించిన మొత్తాలను భవిష్యత్ మూలధన అవసరాల కోసం వినియోగించనున్నట్లు తెలిపింది. ఈ ఇష్యూకి కోటక్ మహీంద్రా క్యాపిటల్, బోఫా సెక్యూరిటీస్, ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్, బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరించనున్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	495
వరంగల్	462	గోదావరి	495
చిత్తూరు	508	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	99	విజయవాడ	103
వరంగల్	99	గుంటూరు	103
కరీంనగర్	99	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	99	చిత్తూరు	85
కర్నూలు	99	నెల్లూరు	85
విశాఖపట్నం	99	అనంతపురం	98
గోదావరి	103		

'ఆటో'కి అచ్చిరాని ఆగస్టు

గణనీయంగా తగ్గిన అమ్మకాలు

న్యూఢిల్లీ: ఆటోమొబైల్ కంపెనీలకు ఆగస్టు నెల అంతగా కలిసి రాలేదు. ఈ నెలలో మారుతి సుజుకీ, హ్యుండయ్ మోటార్ సహా మరికొన్ని కార్ల విక్రయాలు గణనీయంగా తగ్గాయి. ఈ నెలలో మారుతి సుజుకీ విక్రయాలు 8 శాతం తగ్గుదలతో 1,43,075 యూనిట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది ఆగస్టు నెలలో విక్రయాలు 1,56,114 యూనిట్లుగా ఉన్నాయి. మినీ సెగ్మెంట్ కార్లయిన ఆల్టో, ఎస్-ప్రెస్సో విక్రయాలు 12,209 యూనిట్ల నుంచి 10,648 యూనిట్లకు పడిపోయాయి. మరోవైపు ఎర్టిగా, బ్రెజ్జా, ఫ్రాంక్స్, ఎక్స్ఎల్ 6 విక్రయాలు మాత్రం 58,746 యూనిట్ల నుంచి 62,684 యూనిట్లకు పెరిగాయి. బాలెనో, సెలేరియో, డిజైర్, ఇగ్నిస్ విక్రయాలు ఏకంగా 20 శాతం తగ్గినట్లు మారుతి సుజుకీ పేర్కొంది. ఆగస్టు నెలలో డీలర్ల వద్ద నిల్వలు పేరుకుపోవడంతో సరఫరాలు తగ్గించినట్లు కంపెనీ తెలిపింది. కాగా హ్యుండయ్ మోటార్స్ విక్రయాలు 12% తగ్గుదలతో 49,525 యూనిట్లకు, టాటా మోటార్స్ విక్రయాలు 8% తగ్గుదలతో 78,010 యూనిట్లుగా నమోదయ్యాయి. కియా, టయోటా కిర్లోస్కర్, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్స్ వాహనాల విక్రయాలు మాత్రం 9 నుంచి 35% వరకు పెరిగాయి.

ఆశించిన స్థాయిలో ద్విచక్ర వాహన విక్రయాలు

ఆగస్టు నెల ద్విచక్ర వాహన కంపెనీలకు బాగానే కలిసొచ్చింది. మార్కెట్ లీడర్ హీరో మోటోకార్ప్ గత నెలలో 5,12,360 వాహనాలను విక్రయించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 5 శాతం ఎక్కువ. రాయల్ ఎన్‌ఫీల్డ్ విక్రయాలు 5 శాతం క్షీణించి 73,630 యూనిట్లుగా నమోదయ్యాయి. టీవీఎస్ మోటార్స్ విక్రయాలు మాత్రం 13 శాతం వృద్ధి చెంది 3,91,598 యూనిట్లకు చేరుకున్నాయి.

మరింత పటిష్ఠంగా పీఎస్‌యూలు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్‌యూ)లను మరింత పటిష్ఠం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా అవి చెల్లించే డివిడెండ్, బోనస్ షేర్ల జారీ, షేర్ల బైబ్యాక్‌కు సంబంధించి 2016లో జారీ చేసిన మార్గదర్శకాలను సవరించాలని యోచిస్తోంది. ఈ నెలాఖరులోగానే సవరణ మార్గదర్శకాలు వెలువడతాయని అధికార వర్గాలు చెప్పాయి. 2016తో పోలిస్తే సీపీఎస్‌యూల పనితీరు గణనీయంగా మెరుగుపడింది. గత మూడేళ్లలో వాటి మార్కెట్ క్యాప్ రూ.15 లక్షల కోట్ల నుంచి ఐదు రెట్లు పెరిగి రూ.58 లక్షల కోట్లకు చేరింది. ఇదే సమయంలో వీటి ఈక్విటీలో ప్రభుత్వ వాటా రూ.9.5 లక్షల కోట్ల నుంచి రూ.38 లక్షల కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం ఈ సంస్థల నుంచి రూ.50,000 కోట్లు డివిడెండ్ రూపంలో కేంద్ర ప్రభుత్వ ఖజానాకు చేరాయి. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని వాటి మూలధన పునర్ వ్యవస్థీకరణ మార్గదర్శకాలను మరోసారి సవరించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

25,550 ఎగువన బుల్లిష్

(సెప్టెంబరు 2-6 తేదీల మధ్య వారానికి)

ఆస్ట్రో గైడ్


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 24,874-25,264 పాయింట్ల మధ్యన కదలాడి 1.62 శాతం లాభంతో 25,236 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,550 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి: 25,550 బ్రేక్‌డౌన్ స్థాయి: 25,000
నిరోధ స్థాయిలు: 25,440, 25540, 25,640 (25,340 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 25,030,24,930,24,830 (24,130 దిగువన బేరిష్)

అప్రమత్తంగా ఉండటం బెటర్!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదిలే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే గరిష్ఠాలకు చేరిన సూచీల్లో స్వల్ప దిద్దుబాటుకు ఆస్కారం ఉంది. మార్కెట్ ట్రెండ్.. బయ్యర్స్‌కు అనుకూలంగా లేకపోవటంతో ఎంపిక చేసుకున్న స్టాక్స్‌లో మాత్రమే పెట్టుబడులు పెట్టడం మంచిది. నష్టాల విషయంలో అప్రమత్తత పాటించాలి. ఫార్మా, ఐటీ రంగాల్లో పటిష్ఠత కనిపిస్తోంది.

స్టాక్ రికమండేషన్స్

జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్: జూలైలో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన ఈ షేరులో స్వల్ప దిద్దుబాటు జరిగింది. కీలక మద్దతు స్థాయి రూ.655 వద్ద మళ్లీ అప్‌ట్రెండ్ మొదలైంది. డివిడెండ్ ప్రకటించటంతో శుక్రవారం ఈ షేరు ఏకంగా 7.78 శాతం లాభంతో రూ.793 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.750/780 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.850/890 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.720 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

ఏయూ బ్యాంక్: సుదీర్ఘకాలం నుంచి డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు ప్రస్తుతం పుంజుకుంటోంది. రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతోంది. పైగా 200 రోజుల మూవింగ్ యావరేజీని క్రాస్ చేసింది. గత శుక్రవారం 7.55 శాతం లాభంతో రూ.688 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.660 శ్రేణిలో ఎంటరై రూ.770/819 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.6440 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ధనూకా అగ్రిటెక్: అప్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తున్న ఈ షేరు సైడ్‌వేస్‌లో కన్సాలిడేట్ అవుతోంది. ట్రెండ్‌లైన్ వద్ద మద్దతు తీసుకున్నాయి. గత శుక్రవారం ఈ షేరు 4.50 శాతం లాభంతో రూ.1.825 వద్ద ముగిసింది. మూమెంటమ్ ఇన్వెస్టర్లు రూ.1,800 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,880/1,950 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,740 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

లక్స్ ఇండస్ట్రీస్: రెండేళ్లుగా డౌన్‌ట్రెండ్‌లో కొనసాగిన ఈ కౌంటర్‌లో ఈ ఏడాది మే నెలలో టర్న్ అరౌండ్ అయ్యింది. మంచి జోరును కనబరుస్తూ 52 వారాల గరిష్ఠాన్ని అందుకుంది. ఆ తర్వాత స్వల్ప పుల్‌బ్యాక్ కనిపించింది. గత శుక్రవారం ఈ షేరు 4.06 శాతం లాభంతో రూ.2,376 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.2,350 శ్రేణిలో ప్రవేశించి రూ.2,455/2,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,130 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హోమ్‌ఫస్ట్: జీవితకాల గరిష్ఠాన్ని తాకిన ఈ షేరులో స్వల్ప పుల్‌బ్యాక్ కనిపించింది. ఇన్వెస్టర్లు ఈ షేరును వదులుకునేందుకు ఆసక్తి చూపించకపోవటంతో కీలక మద్దతు స్థాయి రూ.1,000 వద్ద బలంగా పుంజుకుంది. గత శుక్రవారం 4 శాతం లాభంతో రూ.1,153 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.1,140/1,120 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,255/1,300 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,090 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

గరిష్ఠ స్థాయిల్లో కరెక్షన్‌కు చాన్స్!

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత సోమవారం బలమైన ర్యాలీతో ప్రారంభమై 25,000 పాయింట్ల ఎగువన పటిష్ఠంగా క్లోజైంది. ఆ తర్వాత రెండు రోజులు మైనర్ కరెక్షన్‌ను చవిచూసినప్పటికీ 25,000 వద్ద కన్సాలిడేట్ అయ్యి సానుకూల ట్రెండ్‌ను వెలువరించింది. అనంతరం అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తూ 25,230 స్థాయిలో ముగిసింది. నిఫ్టీ వరుసగా పన్నెండు ట్రేడింగ్ రోజులు రికార్డు ర్యాలీని కొనసాగిస్తూ వస్తుండటం గమనార్హం. అంతకు ముందు వారంతో పోలిస్తే గత వారం నిఫ్టీ 410 పాయింట్లకు పైగా లాభపడింది. అయితే నిఫ్టీ 25,000 మార్కును అధిగమించటంతో పుల్ బ్యాక్ రియాక్షన్‌కు అవకాశాలు కనిపిస్తున్నాయి. ట్రేడర్లు అప్రమత్తంగా ఉండటం మంచిది. టెక్నికల్‌గా చూస్తే వచ్చే కొద్ది రోజులు ప్రధాన మానసిక నిరోధ స్థాయిలైన 25,000 ఎగువన నిలదొక్కుకుంటుందా లేదా అనేది చూడాలి. లేదంటే కరెక్షన్‌కు అవకాశం ఉంటుంది.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ సానుకూల ట్రెండ్ కోసం తదుపరి మైనర్ నిరోధ స్థాయిలైన 25,300 ఎగువన ట్రేడ్ కావాల్సి ఉంటుంది. తదుపరి ప్రధాన నిరోధ స్థాయి 25,500. ఇక్కడ నిలదొక్కుకుంటేనే అప్‌ట్రెండ్ కనబరుస్తుంది.


బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 25,200 కన్నా దిగజారితే మరింత బలహీనతను సూచిస్తుంది. తదుపరి ప్రధాన మద్దతు స్థాయి 25,000. ఇది గతంలో ఏర్పడిన నిరోధ స్థాయి. ఇక్కడ కూడా నిలదొక్కుకోలేకపోతే మరింత బలహీనతను సూచిస్తుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారంలో 417 పాయింట్ల లాభంతో 51,350 వద్ద ముగిసింది. ప్రధాన నిరోధం 51,500. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన మద్దతు స్థాయి 52,000. ఇక్కడ విఫలమైతే మరింత బలహీనపడవచ్చు.

పాటర్న్: డైలీ చార్టుల ప్రకారం చూస్తే ఆర్ఎస్ఐ.. ఓవర్ బాట్ పొజిషన్‌ను సూచిస్తోంది. మంత్లీ చార్టులు కూడా గరిష్ఠ స్థాయిల వద్ద అప్రమత్తతను సూచిస్తున్నాయి. సానుకూలత కోసం 25,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన మద్దతు ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం	25,300, 25,355
మద్దతు	25,180, 25,100


నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలం సంతజూటూరు వద్ద నీట మునిగిన వరి నాట్లు


ఏలూరు జిల్లా నూజివీడులో పెద్ద చెరువుకు గండిపడి కూలిన ఇంటి గోడ


విజయవాడలో వరదలో చిక్కుకున్న బస్సు

జలదిగ్బంధంలో జిల్లాలు

కృష్ణా, గుంటూరు, ప్రకాశం.. ఏలూరు, తూర్పులో వరదలు.. తూర్పులో మూడు రోజులుగా కుండపోత.. జనజీవనం అస్తవ్యస్తం

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు.. బెజవాడలో కృష్ణమ్మ మహోగ్రం.. నీట మునిగిన లంక గ్రామాలు.. ఏలూరు జిల్లాలో వరద బీభత్సం

పునరావాస కేంద్రాల్లో వందల మంది పరిస్థితిపై సీఎం చంద్రబాబు ఆరా.. నేడు అన్ని విద్యా సంస్థలకు సెలవు

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్)

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనికితోడు ఎగువ ప్రాంతాల నుంచి పోటెత్తుతున్న వరద కారణంగా జిల్లాలు జలదిగ్బంధమయ్యాయి. దీంతో ఆయా జిల్లాల అధికారులు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. మరోవైపు వరద ప్రభావిత జిల్లాల్లో సోమవారం అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. గత 48 గంటల్లో కురిసిన భారీ వర్షాలతో ప్రకాశం జిల్లాలోని పలు దాదాపు అన్ని ప్రాంతాలూ నీట మునిగాయి. సగటున 90.01 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దాదాపు సగం మండలాల్లో 100 నుంచి 170 మి.మీ కురిసినట్టు అధికారులు అంచనా వేశారు. పలుచోట్ల వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండటంతో జన జీవనం స్తంభించింది. దోర్నాల మండలంలోని తీగలేరు ఉధృతితో మార్కాపురం-దోర్నాల మధ్య రాకపోకలను నిలిపివేశారు.


ఏలూరులో..

ఏలూరు జిల్లా వ్యాప్తంగా వానలు, వరద బీభత్సంతో వందలాది మంది నిరాశ్రయులయ్యారు. నూజివీడులో పెద్ద చెరువుకు గండి పడడంతో పెద్ద సంఖ్యలో నివాస ప్రాంతాలు దెబ్బతిన్నాయి. నూజివీడులో మంత్రి కొలుసు పార్థసారథి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. మరోవైపు రావిఎలేరు పొంగి ప్రవహించడంతో 16వ నెంబరు జాతీయ రహదారి మీదకు నీరు చేరింది. జగనన్నకాలనీతోపాటు ఎస్సీ కాలనీలో ఉన్న వెయ్యి మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెల్లవారుజాము నుండే సహాయక శిబిరాల్లో ఉన్న పరిస్థితిని, బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రక్రియను పర్యవేక్షించారు. హైవేపై నీరు చేరడంతో ఏలూరు-విజయవాడ మార్గంలో దాదాపు ఆరు గంటలకుపైగా ట్రాఫిక్ నిలిచిపోయింది. కాగా, నూజివీడులో వరద పరిస్థితిపై ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీశారు. మంత్రి కొలుసు పార్థసారధికి ఫోన్ చేసి సహాయక చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు.

పలు చోట్ల పరిస్థితి ఇదీ!

- వాయుగుండం ప్రభావంతో కాకినాడ తీరం అల్లకల్లోలంగా మారింది. సముద్రంలో ఈదురుగాలుల తీవ్రత అధికంగా ఉండడంతో కాకినాడ పోర్టు నుంచి నాలుగో రోజు కూడా బియ్యం ఎగుమతులు నిలిచిపోయాయి.
- పార్వతీపురం మన్యం జిల్లాపై వర్షాల ప్రభావం పెద్దగా కనిపించలేదు. ప్రాజెక్టుల నీటిమట్టాలు సాధారణ స్థాయిలోనే ఉన్నాయి. కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. అధికారుల సెలవులను రద్దు చేశారు.
- తెలంగాణలో కిన్నెరసాని గేట్లు ఎత్తివేయడంతో ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం శివారు సీతారామపురం వద్ద పొలాలు నీట మునిగాయి.
- వేలేరుపాడు మండలంలో పెదవాగు ఉధృతంగా ప్రవహించడంతో వేలేరుపాడు-రుద్రంకోట మధ్య మార్గంలో గండి ఏర్పడి రాకపోకలు నిలిచిపోయాయి.
- అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గోదావరి, శబరి, సీలేరు నదులతో పాటు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. చింతూరు, వర రామచంద్రపురం మండలాల నడుమ సోకిలేరు, చీకటివాగుల్లో వరద నీరు చేరి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.
- ఒడిశాకు వెళ్లే 326 జాతీయ రహదారిపై అల్లూరి జిల్లాలో శబరి, గోదావరి నదుల నీరు చేరింది. దీంతో ఆంధ్ర-ఒడిశా మధ్య రాకపోకలు నిలిపివేశారు.


శ్రీశైలం ప్రాజెక్టు 10 గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు


నాగార్జునసాగర్ జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు


కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద నదిలా మారిన జాతీయ రహదారి


ఏలూరు జిల్లా అప్పనవీడు వద్ద జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు

కాకినాడ రైతుకు కష్టం

భారీ వర్షాలతో కాకినాడ జిల్లాలో గెడ్డలు పొంగుతున్నాయి. దీంతో వేల ఎకరాల్లో వరి, ఇతర వాణిజ్య పంటలు నీట మునిగాయి. పిఠాపురం నియోజకవర్గంలో సుద్ధగడ్డ కాలువకు వరద పోటెత్తడంతో 2వేల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. వరద ప్రభావంతో గొల్లప్రోలు పట్టణంలో పలు రహదారులు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మండలంలో 2వేల ఎకరాల వరకు వరి, ఇతర వాణిజ్య పంటలు ముంపునకు గురయ్యాయి. ప్రధానంగా పామ్‌ఆయిల్ తోటలు తీవ్రంగా నష్టపోయాయి. జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు, వరదలకు 2,540 హెక్టార్లలో వరి, 20హెక్టార్లలో పత్తి నీటమునిగింది. కాగా, భారీవర్షాల హెచ్చరికలతో కాకినాడ జిల్లాలో సోమవారం అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

ఎన్టీఆర్ జిల్లా అతలాకుతలం

పలు చెరువులకు గండి.. ముంపులో వందల గ్రామాలు

నలుగురు గల్లంతు.. ఒకరు మృతి.. నీట మునిగిన 28 వేల హెక్టార్లు

విజయవాడ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కృష్ణా నది పోటెత్తిన వరదతో ఎన్టీఆర్ జిల్లా అతలాకుతలమైంది. జిల్లావ్యాప్తంగా 15 చెరువులకు గండిపడటంతో వందల సంఖ్యలో గ్రామాలు నీటమునిగాయి. జిల్లా వ్యాప్తంగా ఆదివారం నలుగురు వరద నీటిలో గల్లంతయ్యారు. వీరిలో ఒకరి మృతదేహం లభ్యమైంది. జగ్గయ్యపేట రూరల్ మండల పరిధిలోని చిల్లకల్లు ఊర చెరువుకు గండి పడింది. చెరువు నుంచి భారీగా నీరు గ్రామంలోకి చేరడంతో ఇళ్లు నీట మునిగాయి. పెనుగంచిప్రోలులో నవాబుపేట చెరువుకు కూడా గండిపడడంతో వందలాది ఎకరాలు ముంపు బారిన పడ్డాయి. జగ్గయ్యపేట రూరల్‌లోని రావిరాల గ్రామం వరద నీటిలో చిక్కుకుంది. మరోవైపు మునేరు వాగు ఉగ్రరూపం దాల్చడంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై రాకపోకలు స్తంభించిపోయాయి. హైదరాబాద్ నుంచి వస్తున్న వాహనాలను చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద, విజయవాడ నుంచి వస్తున్న వాహనాలను నందిగామ వద్ద నిలిపివేశారు. కట్టలేరు, వైరా, పాలేరు వాగులు పొంగిపొర్లుతున్నాయి. మైలవరం మండలం వెల్వడం ప్రాంతానికి చెందిన శెట్టిపల్లి కృష్ణారెడ్డి(45) బుడమేరు వరదలో గల్లంతయ్యారు. ఇదే మండలం అనంతవరానికి చెందిన తుపాకుల వెంకటేశ్వరరావు(65) గేదెల కాపలాకు వెళ్లి గల్లంతయ్యారు. రెడ్డిగూడెం మండలం బుద్ధవరానికి చెందిన కొసరాజు వెంకటేశ్వరరావు(75) వరదనీటిలో కొట్టుకుపోయారు. ఎ.కొండూరు మండలం రాంచంద్రాపురానికి చెందిన ఆరళ్ల పున్నయ్య గేదెల కాపలాకు వెళ్లి గల్లంతయ్యారు. ఎన్టీఆర్ జిల్లాలో 15,733 హెక్టార్లలో వరి పొలాలు నీటమునిగాయి. జిల్లావ్యాప్తంగా ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించారు.


సీవీఆర్ ఫ్లైఓవర్ వద్ద వరద నుంచి బయటపడేందుకు తంటాలు

నీట మునిగిన బాపట్ల లంకగ్రామాలు

గంటగంటకు పెరిగిన వరద ఉధృతి..

వేల ఎకరాల్లో పంటల్లో వరద నీరు.. తెల్లవార్లూ ఆయా ప్రాంతాల్లో బాపట్ల కలెక్టర్

పునరావాస ప్రాంతాలకు ప్రజల తరలింపు

గుంటూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, ఎగువ నుంచి పోటెత్తిన వరదల ధాటికి కృష్ణమ్మ మహోగ్రరూపం దాల్చింది. దీంతో ప్రకాశం బ్యారేజీ దిగువన గుంటూరు, బాపట్ల పరిధిలోని లంక గ్రామాలు ముంపు బారినపడ్డాయి. దీంతో లంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లోని దాదాపు 24 గ్రామాల ప్రజలకు వరదముంపు పొంచి ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కొల్లూరు మండల పరిధిలోని అరవిందవారధికి గండి పడడంతో వరదనీరు చుట్టూ ఉన్న వందల ఎకరాల పంట పొలాలను ముంచెత్తింది. దిగువకు వస్తున్న వరద ప్రవాహం ఆదివారం రాత్రికి పెరిగే అవకాశం ఉండడంతో లంక గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. వృద్ధులు, గర్భిణులకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి 350 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. జిల్లా వ్యాప్తంగా 48,000 ఎకరాలలో పంట నీటమునిగినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. మరోవైపు లంక గ్రామాల నుంచి మండల కేంద్రాలకు వెళ్లే దారులన్నీ వరదనీటిలో మునిగిపోయి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. నది మధ్యలో ఉన్న గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. బాపట్ల జిల్లా కలెక్టర్ తెల్లవార్లూ గ్రామాల్లోనే ఉండి పరిస్థితిని పర్యవేక్షించారు. నిత్యావసరాలను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేశారు. ఇద్దరు అధికారులు వరద విధులకు హాజరు కాలేదనే కారణంతో వారిపై సస్పెన్షన్ వేటు వేశారు. మరోవైపు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను, గజ ఈతగాళ్లను లంక గ్రామాలకు తరలించారు.

తూర్పు అస్తవ్యస్తం!

ఎడతెరిపిలేకుండా మూడు రోజుల నుంచీ కురుస్తున్న వర్షాలతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. జన జీవనం స్తంభించింది. వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు నిలిచిపోయాయి. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటించారు. ముంపు నివారణ చర్యల్లో భాగంగా 22 ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించారు. దేవరపల్లి మండలం పరిధిలోని బర్లవాగు పరిస్థితిని కలెక్టర్ పి. ప్రశాంతి పరిశీలించారు. కొవ్వూరు మండలం కాపవరంలోని ఎస్సీ వసతి గృహంలో ఉన్న విద్యార్థులను సురక్షిత భవనంలోకి తరలించారు. రాజమహేంద్రవరం నుంచి విజయవాడకు వెళ్లే 5 బస్సులను రద్దు చేశారు. గౌతమి, గోదావరితో సహా రాజమండ్రి మీదుగా వెళ్లాల్సిన పలు రైళ్లను రద్దు చేశారు. యశ్వంత్‌పూర్, వాస్కో తదితర రైళ్లను భీమవరం మీదుగా మళ్లించారు. కాకినాడ-రేణిగుంట (తిరుపతి-17250) రైలును రాజమండ్రి రైల్వే స్టేషనులో నిలిపేశారు. దీంతో తిరుమల ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

సీపీఐ నేత రామకృష్ణ డిమాండ్

అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదలకు మృతి చెందినవారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.10లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. విజయవాడ మొగల్రాజపురంలో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని ఆదివారం తమ పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. గత 50 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా భారీ వర్షాలు సంభవించాయని, ఈ నేపథ్యంలో కొండ ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్ నిర్మించాలని కోరారు. వరద బాధితులకు పునరావాసం కల్పించి ఆహారం పంపిణీ చేయాలని, ఇళ్లు, సామగ్రిని కోల్పోయినవారికి తక్షణ సాయం అందించాలని కోరారు. పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు పరిహారం చెల్లించాలన్నారు.

'నైరుతి'పై కుంభవృష్టి!

గుంటూరు నుంచి వరంగల్ వరకు

నాలుగు ఉమ్మడి జిల్లాల్లో అసాధారణ వర్షపాతం

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఒక రోజు వ్యవధిలో కురిసిన కుంభవృష్టి వర్షానికి ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. 24 గంటల్లో ఈ స్థాయి వర్షాలు ఎందుకు కురిశాయి..? మేఘాలు ఏమైనా బద్ధలయ్యాయా..? లేక మరేమైనా కారణాలున్నాయా..? అన్న సందేహాలు అందరిలోనూ వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఏర్పడే అల్పపీడనాలు, వాయుగుండాలకు 'నైరుతి' భాగంలో ఎక్కువ వర్షించడం సాధారణం. అంటే ఆ అల్పపీడనాలు, వాయుగుండాలకు సంబంధించి నైరుతి భాగం ఎక్కడ ఉంటే అక్కడే కుంభవృష్టి వర్షాలు కురుస్తాయి. ఇందుకు ఉమ్మడి గుంటూరు, కృష్ణాతోపాటు పొరుగున తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో 24 గంటల వ్యవధిలో కుంభవృష్టిగా కురిసిన వర్షాలే నిదర్శనమని వాతావరణ నిపుణులు వెల్లడించారు. బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం, తర్వాత వాయుగుండం ప్రభావంతో కోస్తాలో అత్యధికంగా మంగళగిరిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఆటోమ్యాటిక్ వెదర్ స్టేషన్‌లో 28 సెంటీమీటర్లు, తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా మలయాలలో 40, మహబూబాబాద్‌లో 37 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని, ఈ కుండపోత వర్షంతో జనజీవనం అస్తవ్యస్తమైందని గుర్తుచేశారు.

భారీ తేమను మోసుకొచ్చి..

సాధారణంగా నైరుతి సీజన్‌లో బంగాళాఖాతంలో అల్పపీడనాలు/వాయుగుండాలు ఏర్పడినప్పుడు.. వాటికి సంబంధించి నైరుతి భాగంలో ఉన్న ప్రాంతాలు.. ఇంకా నైరుతి రుతుపవనాలు అత్యంత బలంగా ఉండే సమయంలో అంటే అరేబియా సముద్రం నుంచి భారీగా తేమ తీసుకువచ్చినప్పుడు పశ్చిమ కనుమలు, బంగాళాఖాతం నుంచి వచ్చే తేమ ప్రభావంతో ఈశాన్య రాష్ట్రాల్లో అసాధారణ వర్షపాతం నమోదు కావడం ఇందుకు ఉదాహరణగా చెబుతారు. దీనికి వాతావరణంలో మరికొన్ని పరిస్థితులు తోడు కావడంతో కుంభవృష్టి వర్షాలు కురుస్తుంటాయి. శుక్రవారం నుంచి శనివారం అర్ధరాత్రి వరకు ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో అదే జరిగిందని వాతావరణ నిపుణులు విశ్లేషించారు. నైరుతి రుతుపవనాల సీజన్‌లో బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనాలు, వాయుగుండాలు భూమిపైకి వచ్చేటప్పుడు భారీగా తేమను తీసుకువస్తుంటాయి. వాటికి సంబంధించి మొత్తం ప్రాంతంలో నైరుతి భాగంలోనే ఎక్కువ తేమ కేంద్రీకృతమై ఉంటుంది. మిగిలిన చోట్ల ఉన్న తేమతో మోస్తరు నుంచి భారీ వర్షాలే కురుస్తుంటాయి. ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాకు ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారి వాయవ్యంగా పయనించింది. వాయుగుండం (మొత్తం విస్తరించే ప్రాంతం) భూమిపైకి పయనించే క్రమంలో దాని మొత్తం విస్తరించే ప్రాంతంలో నైరుతి భాగం ఉమ్మడి గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి నుంచి పొరుగునున్న ఉమ్మడి ఖమ్మం, వరంగల్ మీదుగా పయనించింది. అంటే.. వాయుగుండం పయనించే క్రమంలో సముద్రం నుంచి భారీగా తేమ మోసుకురావడం, ఇంకా రాయలసీమ, తెలంగాణ నుంచి పొడిగాలులు రావడంతో పలుచోట్ల అతిభారీ నుంచి కుంభవృష్టి వర్షాలు కురిశాయి.


నీట మునిగిన శ్రీకాకుళం.జిల్లా వజ్రపుకొత్తూరు మండలంలోని పూడిలంక రహదారి

ఎస్ఆర్ఎం వర్సిటీలో రికార్డు వర్షపాతం

శనివారం ఉదయం 8 గంటల నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు రాజధాని అమరావతి ప్రాంతంలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఏపీఎస్‌డీపీఎస్ స్టేషన్ ఆటోమ్యాటిక్ వెదర్ స్టేషన్‌లో 281.75 మి.మీ. (28 సెంటీమీటర్లు) వర్షపాతం నమోదైంది. అయితే ఈ స్టేషన్ ఏర్పాటు చేసి ఐదేళ్లే కావడంతో 28 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డు అని వాతావరణ శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఇంకా చంద్రాల (మైలవరం- నూజివీడు మధ్య)లో 26.9 సెం.మీ., జగ్గయ్యపేటలో 26.1, తిరువూరు మండలం మునుకుళ్లలో 25.4, మాదిపాడు (దాచేపల్లి మండలం), ఐనవోలు (తుళ్లూరు మండలం)లో 22.6 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

రాళ్లవాగులో బోల్తా కొట్టిన డీసీఎం

ప్రవాహాన్ని దాటే యత్నంలో ప్రమాదం

వాహనంలో చిక్కుకున్న ఐదుగురు వ్యక్తులు

అంతా ఆంధ్రా వాసులే.. తెలంగాణలో ఘటన

మహబూబాబాద్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి 4 కిలోమీటర్ల దూరంలోని ఈదులపూసపల్లి రాళ్లవాగులో ట్రాన్స్‌పోర్టు డీసీఎం కొట్టుకుపోయింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగు ఉధృతి తీవ్రంగా పెరిగింది. మహబూబాబాద్-కేసముద్రం రహదారిలోని రాళ్లవాగు రోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది. ఆ క్రమంలోనే ఏపీ నుంచి వ్యాపారం నిమిత్తం వచ్చిన ఐదుగురు ట్రాన్స్‌పోర్టు డీసీఎం వాహనంలో ప్రయాణిస్తూ వాగుదాటే ప్రయత్నం చేశారు. అయితే, వాగు ఉధృతికి డీసీఎం బోల్తా కొట్టి.. నీటిలో కొంత దూరం కొట్టుకుపోయింది. ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో చోటు చేసుకున్న ఈ ఘటన విషయం తెలిసిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది రంగంలో దిగారు. డీసీఎంలో చిక్కుకుపోయిన వారిలో ఒకరు ఒడ్డుకు చేరినట్లే చేరి.. మరోసారి నీటిలో కొట్టుకుపోయి సమీపంలోని చెట్టును పట్టుకుని.. నీటి ప్రవాహానికి ఎదురు నిలిచారు. మరో నలుగురు డీసీఎం క్యాబిన్‌పైకి ఎక్కి సహాయం కోసం ఎదురు చూశారు. రంగంలోకి దిగిన పోలీసులు, సహాయ సిబ్బంది వారిని రక్షించే ప్రయత్నం చేశారు.


జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీని చుట్టుముట్టిన బుడమేరు వరద నీరు


చనుమోలు వెంకట్రావు ఫ్లైఓవర్ సమీపంలో ఇన్నర్ రింగ్ రోడ్డుపై నడుములోతు నీళ్లలో వెళుతున్న వ్యక్తి

విలయవాడ!

బెజవాడను ముంచేసిన బుడమేరు.. 8 అడుగుల దాకా చేరిన నీరు

- వరద నీటిలో జనావాసాలు
- 2 లక్షల మంది వరద బాధితులు
- నీట మునిగిన కార్లు, బైకులు
- ట్రాక్టర్లలో సురక్షిత ప్రాంతాలకు జనం
- సమీప గ్రామాలపైనా వరద పడగ
- వేలాది ఎకరాల్లో మునిగిన పంటలు


విజయవాడ కబేళా ప్రాంతంలో చనుమోలు వెంకట్రావు ఫ్లైవర్ వద్ద వరద ఉధృతి

విజయవాడ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బెజవాడ నగరంపై బుడమేరు దండెత్తింది. కనీవినీ ఎరుగని స్థాయిలో ముంచెత్తి బీభత్సం సృష్టించింది. పదులసంఖ్యలో కాలనీలను చుట్టుముట్టి విజయవాడను విలయవాడగా మార్చేసింది. బుడమేరు ముంపు నుంచి కాపాడేందుకు చేసిన ఎన్ని ప్రయత్నాలు చేసినా... ప్రకృతి ప్రకోపం ముందు అవి ఫలించలేదు. శనివారం ఉదయం నుంచి కురిసిన వర్షాలకు వాగులు ఉప్పొంగాయి. ఈ నీరంతా బుడమేరులోకి వచ్చి చేరింది. బుడమేరు హెడ్ రెగ్యులేటర్ 8 గేట్లను 12 అడుగుల మేరకు ఎత్తి దిగువన ఉన్న కాల్వలోకి నీటిని విడుదల చేశారు. ఇబ్రహీంపట్నం వద్ద ఉన్న డైవర్షన్ చానల్ ద్వారా 13 వేల క్యూసెక్కుల నీటిని కృష్ణా నదిలోకి మళ్లించే అవకాశమున్నా... అంతకు మించి వరద పోటెత్తింది. దీంతోపాటు... కృష్ణా నది అప్పటికే పొంగి ప్రవహిస్తుండటంతో బుడమేరులోకి నీరు ఎగదన్నింది. దీని ప్రభావం బెజవాడ నగరంపై పడింది. బుడమేరును ఆనుకుని ఉన్న జక్కంపూడి కాలనీ, అజిత్‌సింగ్ నగర్, పాత రాజరాజేశ్వరిపేట, కొత్త రాజరాజేశ్వరిపేట, అయోధ్యనగర్, దేవీ నగర్, రాజీవ్ నగర్, ఆంధ్రప్రభ కాలనీ, వాంబే కాలనీ, చిట్టినగర్, పాల ఫ్యాక్టరీ, కబేళా, ఉర్మిళా నగర్, పాయకాపురం, భవానీపురం ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. ఐదు నుంచి ఎనిమిది అడుగుల మేరకు నీరు చేరడంతో ఈ ప్రాంతమంతా జలసంద్రాన్ని తలపించింది. సుమారు 2 లక్షల మంది వరదనీటిలో చిక్కుకున్నారు. ఆదివారం ఉదయానికే అపార్టుమెంట్ల సెల్లార్‌లలోకి నీరు ప్రవేశించింది. తర్వాత కాసేపటికి అపార్టుమెంట్ల మొదటి అంతస్తు వరకు చేరింది. సెల్లార్లలో, రోడ్లమీద పెట్టిన కార్లు, బైకులు, ఇతర వాహనాలు నీటమునిగాయి. కొందరు ట్రాక్టర్ల మీద సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లారు. స్థానిక నాయకులు, అధికారులు అప్పటి కప్పుడు రైతుల నుంచి ట్రాక్టర్లను తీసుకొచ్చి అండగా నిలిచారు. అస లు బయటికి వచ్చే పరిస్థితి లేని వారిని పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది బోట్లలో బయటికి తీ సు కొ చ్చా ర ు. వేలాదిమంది స్థానికులు మొదటి అంతస్తుల్లోకి వెళ్లి తలదాచుకున్నారు.

ఎందుకీ విలయం?

విజయవాడ నగరంలో నిర్మించిన అవుట్‌ఫాల్ డ్రెయిన్లు చాలా వరకు బుడమేరు కాల్వలో కలుస్తాయి. ఒకప్పుడు వాన నీరు ప్రవహించే బుడమేరు నగరీకరణ నేపథ్యంలో మురికినీటితో నిండిపోయింది. అవుట్‌ఫాల్ డ్రెయిన్ల నుంచి మురికినీరు, వర్షపు నీరు బుడమేరులోకి వెళ్లాలి. బుడమేరులో వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో ఆ నీరంతా అవుట్‌ఫాల్ డ్రెయిన్లలోకి ఎదురు వస్తోంది. దీంతో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం జల దిగ్బంధంలోకి వెళ్లిపోయింది.


విజయవాడ న్యూ రాజరాజేశ్వరిపేటలో నీట మునిగిన నివాసాలు


అజిత్‌సింగ్ నగర్‌లో వరద నీటిలో చిక్కుకున్న అంబులెన్స్‌ను తోస్తున్న సిబ్బంది

శివారు ప్రాంతాల్లోనూ...

విజయవాడ సమీపంలోని గ్రామాలపైనా బుడమేరు ప్రభావం పడింది. ఇబ్రహీంపట్నం మండలం రాయనపాడు, కవులూరు, ఈలప్రోలు, పైదూరుపాడు, కొండపల్లి ఇందిరమ్మ కాలనీ, ఇబ్రహీంపట్నం ఖాజీ మాన్యంలోకి వరద నీరు వచ్చి చేరింది. వేలాది ఎకరాల భూములు నీటమునిగాయి. రాయనపాడు వద్ద రైల్వేట్రాక్‌పైకి వరద నీరు చేరడంతో తవిళనాడు, గోదావరి, చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిచిపోయాయి. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ఇందులో ఉన్న ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.


రాయనపాడు రైల్వేస్టేషన్‌లో వరదలో చిక్కుకున్న ప్రయాణికులను తాడు సాయంతో బయటకు తీసుకువెళుతున్న పోలీసులు, విపత్తు నిర్వహణ సిబ్బంది

ఇదీ బుడమేరు... బెజవాడ దుఃఖదాయినిగా పేరు

తరచూ పొంగుతూ... జనావాసాలను ముంచెత్తే బుడమేరుకు బెజవాడ దుఃఖదాయిని గా పేరు. ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం జమ్మలవాయికొండ దీని జన్మస్థానం. సరిహద్దులో ఉన్న ఖమ్మం జిల్లాను తాకుతూ తిరిగి ఎన్టీఆర్ జిల్లాలోకి ప్రవేశిస్తుంది. సుమారు వంద కిలో మీటర్లు ప్రవహించి... ఏలూరు జిల్లాలోని కలపర్రు వద్ద కొల్లేరు సరస్సులో కలుస్తుంది. ఈ క్రమంలో పలు చిన్న, పెద్దా ఏర్లను కలుపుకొంటూ వెళుతుంది. బుడమేరును అటూ ఇటూ ఆక్ర మించడంతో బెజవాడలో ఏరు కాస్తా కాల్వగా మారిపోయింది. విజయవాడను బుడమేరు ముంపు నుంచి కాపాడేందుకు వెలగలేరు వద్ద హెడ్ రెగ్యులేటర్‌ను నిర్మించారు. దీనికి దిగు వన ఇబ్రహీంపట్నం వద్ద బుడమేరు డైవర్షన్ చానల్‌ను ఏర్పాటు చేశారు. దీనిద్వారా బుడ మేరు వరదను కృష్ణా నదిలోకి కలుపుతారు. అయితే... ప్రస్తుతం కృష్ణమ్మ ఉప్పొంగి ప్రవహి స్తుండటంతో బుడమేరు నీరు నదిలో కలిసే వీల్లేకుండా పోయింది. దీంతో... బుడమేరు మొత్తం విజయవాడపై విరుచుకుపడింది.


విజయవాడ అజిత్‌సింగ్ నగర్ వరద ప్రభావిత ప్రాంతంలో పర్యటిస్తున్న మంత్రులు నారాయణ, కొల్లు రవీంద్ర, అనిత, ఎంపీ కేశినేని చిన్ని

కృష్ణా మిల్క్‌కు రూ.70 కోట్ల నష్టం

- బుడమేరు వరదతో మునిగిన ఫ్యాక్టరీ
- కరెంటు లేకపోవడంతో పాడైన పాలు, ఇతర పదార్థాలు

చిట్టినగర్(విజయవాడ), సెప్టెంబరు 1: భారీగా కురుస్తున్న వర్షాలు, ఉధృతంగా వస్తున్న వరదల కారణంగా కృష్ణా మిల్క్ యూనియన్‌కు రూ.70 కోట్ల నష్టం వాటిల్లింది. విజయవాడ కొత్తపేటలో కృష్ణా మిల్క్ యూనియన్ పాల ఫ్యాక్టరీ ప్రధాన కార్యాలయం ఉంది. ఇక్కడ పాల సేకరణతోపాటు పాల పదార్థాలు తయారు చేసే ప్లాంట్లు ఉన్నాయి. ఇక్కడ తయారైన పాల పదార్థాలు, వెన్న, ఐస్‌క్రీమ్‌లను -32 డిగ్రీల శీతలీకరణ వద్ద నిల్వ ఉంచాలి. ఈ పాల ఫ్యాక్టరీకి కొంతదూరం నుంచి బుడమేరు కాల్వలో వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో కొత్తపేట, పాల ఫ్యాక్టరీ ప్రాంతాలు నీట మునిగాయి. పాల ఫ్యాక్టరీలోకి ఐదు అడుగుల మేరకు నీరు చేరింది. దీంతో శనివారం రాత్రి నుంచి విద్యుత్ సరఫరా లేదు. ఫ్యాక్టరీలో జనరేటర్లు ఆన్ చేసినా షార్ట్‌సర్క్యూట్ అవుతున్నాయి. దీంతో ఫ్యాక్టరీ కార్యకలాపాలు నిలిపేశారు. ఫ్రిజ్‌లు మొత్తం ఆగిపోయి పదార్థాలు పాడైపోవడంతో రూ.70 కోట్ల వరకు నష్టం వాటిల్లిందని ఎండీ కె.ఈశ్వరరావు, చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. ఇక్కడకు రావలసిన పాలు సేకరించిన వ్యాన్లను బాపులపాడు మండలం వీరవల్లిలో కొత్తగా నిర్మించిన ప్లాంటుకు మళ్లించారు. రవాణా సదుపాయం లేని పాడి రైతుల నుంచి పాలు తీసుకొచ్చేందుకు వ్యాన్లను పంపారు.


చెరువును తలపిస్తున్న మిల్క్ ఫ్యాక్టరీ రోడ్డు


అజిత్‌సింగ్ నగర్ ప్రాంతంలో బుడమేరు వరద ఉధృతి

భారీ వర్షాలకు పలు రైళ్ల రద్దు


రాయనపాడు రైల్వే స్టేషన్‌లోకి వరద నీరు చేరడంతో ఆగిపోయిన రైలు

సికింద్రాబాద్, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రైల్వే ప్రయాణీకులకు తిప్పలు తప్పడం లేదు. ఆయా ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో పలు మార్గాల్లో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. దాంతో ఆయా మార్గాలలో నడుస్తున్న పలు రైళ్లను దక్షిణమధ్య రైల్వే రద్దు చేసింది. మరికొన్ని రైళ్లను ఇతర మార్గాల మీదుగా మళ్లించి నడిపిస్తోంది. గత నాలుగు రోజుల్లో 150కి పైగా రైళ్లను రద్దు చేశారంటే పరిస్థితి తీవ్రత తేటతెల్లం అవుతోంది. తాజాగా ఆదివారం, సోమవారం కూడా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ఆయా మార్గాల్లో రైళ్ల రాకపోకలను పూర్తి స్థాయిలో పునరుద్ధరించడానికి మరో నాలుగు రోజులు పట్టవచ్చని తెలుస్తోంది. ఇదిలా ఉండగా భారీ వర్షాల వలన ఉత్పన్నమైన సమస్యల పరిష్కారానికి దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ స్వయంగా రంగంలోకి దిగారు. అన్ని డివిజన్ల డీఆర్ఎంలు, వివిధ విభాగాల అధిపతులతో నిరంతరం సమీక్షిస్తున్నారు. రద్దయిన రైళ్లు... కాకినాడ పోర్టు- లింగంపల్లి (12737), గూడూరు- సికింద్రాబాద్ (12709), భద్రాచలం- బలార్షా (17033), భద్రాచలం- సికింద్రాబాద్ (17660), సికింద్రాబాద్- భద్రాచలం (17659), కాజీపేట్- డోర్నకల్ (07753), హైదరాబాద్- షాలిమార్ (18046).

హైదరాబాద్‌కు బస్సులు బంద్


- విజయవాడ నుంచి సాయంత్రం వరకు నిలిచిన రాకపోకలు
- సాయంత్రం నుంచి గుంటూరు మీదుగా సర్వీసులు
- సోమవారం కూడా ప్రధాన మార్గంలో బస్సులు తిరిగే పరిస్థితి లేదు
- వరద కారణంగా ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా నిలిచిన 326 బస్సులు

విజయవాడ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వరదల బీభత్సంతో విజయవాడ-హైదరాబాద్‌ల మధ్య ఆదివారం సాయంత్రం వరకు బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. ఎన్టీఆర్ జిల్లా ఐతవరం దగ్గర కృష్ణానది ప్రవాహం 65వ నెంబర్ జాతీయ రహదారి మీదకు ప్రవహించడంతో ఆర్టీసీ అధికారులు బస్సులను నిలిపివేశారు. అంతకంతకూ వరద ప్రవాహం పెరగడంతో హైదరాబాద్‌కు బస్సులను రద్దు చేశారు. విజయవాడ - హైదరాబాద్ మార్గంలో ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సాయంత్రం నుంచి గుంటూరు జిల్లా, మిర్యాలగూడ మీదుగా ఆర్టీసీ బస్సులను నడిపారు. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు 151 షెడ్యూల్డ్ బస్సులు ఉన్నాయి. ఈ బస్సులన్నీ సాయంత్రం వరకు గమ్యస్థానాలకు వెళ్లలేదు.


ఎన్టీఆర్ జిల్లా నందిగామ వద్ద విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు

సహాయక చర్యల్లో పాల్గొనండి

- శ్రేణులకు డిప్యూటీ సీఎం పవన్ పిలుపు



అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వర్షాలకు విజయవాడ, గుంటూరులో పలువురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. లోతట్టు ప్రాంతాల్లోనివారికి, వరద ముంపులో చిక్కుకుపోయిన ప్రజలకు అవసరమైన సహాయ కార్యక్రమాలను చేపట్టాలని జనసేన నాయకులు, శ్రేణులకు పిలుపు ఇచ్చారు. అధికార యంత్రాంగం చేపట్టే సహాయక చర్యలతో పాటు శ్రేణులు కూడా సహాయం చేయడం అవసరమన్నారు.ఆహారం, రక్షిత తాగు నీరు అందించాలన్నారు. పిల్లలకు పాలు, బ్రెడ్, బిస్కెట్స్ లాంటివి అందుబాటులో ఉంచాలని సూచించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని, ఈ విషయంలో పార్టీ డాక్టర్స్ సెల్‌తో సమన్వయం చేసుకోవాలన్నారు.

బెజవాడ గజగజ

(మొదటి పేజీ తరువాయి)

లేకపోయింది. పైగా... కృష్ణా నది నీరు కూడా ఎగదన్నింది. దీనికి తోడు.. విజయవాడలో ఆక్రమణలతో జల ప్రవాహానికి తగిన దారిలేకుండా పోయింది. దీంతో... బుడమేరు కట్టలు తెంచుకున్నట్లుగా చెలరేగిపోయింది. ఆదివారం ఉదయం నుంచే బెజవాడలో మెల్లగా ముంపు మొదలైంది. బుడమేరు పరిసర ప్రాంతాల్లోని జనావాసాల్లోకి జలం ప్రవేశించింది. చూస్తుండగానే ఒక్కో అడుగు పెరుగుతూ పోయింది. అజిత్‌సింగ్ నగర్, పాయకాపురం ప్రాంతాలను 8 అడుగుల మేరకు ముంచెత్తింది. జక్కంపూడి కాలనీ, అయోధ్య నగర్, ఓల్డ్ రాజరాజేశ్వరిపేట, న్యూ రాజరాజేశ్వరిపేట, వాంబే కాలనీ, ఆంధ్రప్రభ కాలనీ, చిట్టినగర్ తదితర ప్రాంతాలు అయిదు నుంచి 8 అడుగుల మేరకు నీటిలో మునిగిపోయాయి. జక్కంపూడిలోని రాజీవ్ స్వగృహ ఫ్లాట్లు మొదటి అంతస్తు వరకు మునిగిపోయాయి. బుడమేరు ఈస్థాయిలో దండెత్తడం మాత్రం ఇటీవలి కాలంలో ఇదే మొదటిసారి. ఇక... మున్నేరు వాగు పొంగడంతో విజయవాడ - హైదరాబాద్ మధ్య రాకపోకలు ఆగిపోయాయి. నందిగామ మండలం ఐతవరం వద్ద జాతీయ రహదారి ప్రాంతం ఓ మోస్తరు జలాశయాన్ని తలపిస్తోంది. దీంతో హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలను చిల్లకల్లు వద్ద, విజయవాడ వైపు నుంచి వెళ్లే వాహనాలను కీసర వద్ద నిలిపివేశారు. 2009 తర్వాత కృష్ణమ్మ మరోసారి భీకరావతారం దాల్చింది. ఆదివారం రాత్రికే ప్రకాశం బ్యారేజీ నుంచి 10 లక్షల క్యూసెక్కుల వరద ప్రవహిస్తోంది. తెల్లవారేసరికి ఇది మరింత పెరిగే అవకాశముంది. ప్రభుత్వ యంత్రాంగం పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది. తక్షణ సహాయ చర్యలు తీసుకుంటోంది.

విద్యుత్ పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు

- మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడి

అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో, సరఫరాను పునరుద్ధరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టామని రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటించారు. అలాగే, కంట్రోల్ రూమ్‌ల ద్వారా విద్యుత్ సరఫరా తీరును సమీక్షిస్తున్నామని ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు. దీని కోసం మంత్రి రవికుమార్, కె.విజయానంద్ నిరంతరాయంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ మేరకు ఇంధన శాఖ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. వాయుగుండం కారణంగా రాష్ట్రంలోని విద్యుత్ సంస్థలకు రూ.101.838 కోట్ల నష్టం వాటిల్లిందని విజయానంద్ తెలిపారు. వరద, భారీ వర్షాన్నీ లెక్కచేయకుండా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం శ్రమిస్తున్న విద్యుత్ పంపిణీ సంస్థల ఇంజనీరింగ్, క్షేత్రస్థాయి సిబ్బందిని విజయానంద్ అభినందించారు. కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. వినియోగదారులకు అసౌకర్యం కలిగితే.. 1912 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని, విద్యుత్ సిబ్బంది వెంటనే స్పందిస్తారని విజయానంద్ తెలిపారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు

అమరావతి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వర్షాలు, వరదల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకూ ప్రభుత్వం సోమవారం సెలవు ప్రకటించింది. ఈ ఆదేశాలకు అనుగుణంగా పాఠశాల విద్యాశాఖ, ఇంటర్ విద్యా శాఖ అంతర్గత ఆదేశాలు జారీచేశాయి. ఉన్నత విద్యా సంస్థలకూ సెలవు ప్రకటించాలని ప్రభుత్వం ఆదేశించినా, ఆ శాఖ అధికారులు అధికారికంగా ఎలాంటి ప్రకటనా విడుదల చేయలేదు. జిల్లా స్థాయిల్లోనూ అన్ని విద్యా సంస్థలకూ సెలవులు ప్రకటిస్తూ కలెక్టర్లు ఆదేశాలు జారీచేశారు.

వ్యవసాయ సిబ్బంది సెలవులు పెట్టొద్దు!: అచ్చెన్న

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది ఎవరూ సెలవులు పెట్టొద్దని, రైతులకు అండగా నిలవాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. వ్యవసాయ, అనుబంధ శాఖల ఉన్నతాధికారులతో ఆదివారం ఆయన సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ, పశుసంవర్థక, మత్స్యశాఖ కాల్ సెంటర్లను కొనసాగించాలని, పశువులు మృత్యువాత పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి వరద ప్రవాహం ఉధృతంగా ఉన్నందున ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ సూచించారు. ప్రకాశం బ్యారేజీకి 10-5నుంచి 11 లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరే అవకాశం ఉందన్నారు. రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోందని తెలిపారు. ఆదివారం రాత్రి 7గంటల సమయానికి శ్రీశైలం డ్యామ్ వద్ద ఇన్‌ఫ్లో 3.92, ఔట్‌ఫ్లో 5.55, నాగార్జునసాగర్ వద్ద ఇన్‌ఫ్లో 4.73, ఔట్‌ఫ్లో 4.89, పులిచింతల వద్ద ఇన్‌ఫ్లో 6.05, ఔట్‌ఫ్లో 5.51, ప్రకాశం బ్యారేజ్ వద్ద ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 9.25లక్షల క్యూసెక్కుల వరద ఉందని చెప్పారు .ఇప్పటివరకు 15 మంది చనిపోయారని వెల్లడించింది. ఎన్టీఆర్ జిల్లాలో ఏడుగురు, గుంటూరు జిల్లాలో ఐదుగురు, ప్రకాశం జిల్లాలో ముగ్గురు మరణించారు.

చంద్రబాబుకు ప్రధాని ఫోన్!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బెజవాడలో వరద విలయంపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఆదివారం రాత్రి ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫోన్ చేసి మాట్లాడారు. వరద పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కేంద్రం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

కళింగపట్నం వద్ద తీరం దాటిన వాయుగుండం

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాకు ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉన్న వాయుగుండం శనివారం అర్ధరాత్రి తర్వాత 2.30 గంటల సమయంలో కళింగపట్నం వద్ద తీరం దాటింది. వాయుగుండం ప్రభావంతో కోస్తాలో ఆదివారం ఉదయం నుంచి పలుచోట్ల వర్షాలు కురిశాయని, రానున్న 24 గంటల్లో ఉత్తరకోస్తాలో ఎక్కువ చోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఉత్తర కోస్తాలో ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది.

ప్రాణరక్షణే లక్ష్యం

- నష్టపోయిన ప్రతి ఒక్కరికీ సాయం
- విపత్తు సహాయం 5 లక్షలకు పెంపు
- 50 ఏళ్లలో ఎప్పుడూ పడనంత వాన
- ఒక్క రోజే రాష్ట్రవ్యాప్తంగా 28.5 సెంమీ
- ముందస్తు చర్యలు, నిరంతర పర్యవేక్షణ
- అయినా 9 మంది చనిపోవడం బాధాకరం
- గత ఐదేళ్లలో కాలువలపై శ్రద్ధ పెట్టలేదు
- నేడు విద్యాసంస్థలకు సెలవు: సీఎం


రాష్ట్రంలో వర్షాలు, వరద పరిస్థితిని తాడేపల్లిలోని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరిస్తున్న అధికారులు

అమరావతి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విపత్తు సమయంలో ప్రజల ప్రాణాలు కాపాడడం తమ ప్రభుత్వ తక్షణ కర్తవ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విపత్కర పరిస్థితుల్లో ఆస్తి, ప్రాణ, పశునష్టం జరక్కుండా కాపాడటమే లక్ష్యమన్నారు. వీలైనంత వరకు నష్టాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆదివారం ఉదయం మంత్రులు, సీఎస్, డీజీపీ, కలెక్టర్లు, ఎస్పీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన.. అధికారులు ఎంత వద్దన్నా బుడమేరు ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. సాయంత్రం తాడేపల్లిలోని విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయానికి వచ్చారు. స్టేట్ ఎమర్జెన్సీ సెంటర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 'ఇది మీ ప్రభుత్వం. అన్ని విషయాల్లో శ్రద్ధ తీసుకుంటున్నాం. రెస్క్యూ ఆపరేషన్‌తో బాధితులకు పునరావాసం కల్పించడం ద్వారా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. సహాయ చర్యల్లో ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలి' అని కోరారు. విపత్తు సాయాన్ని రూ.5 లక్షలకు పెంచామన్నారు. నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 'వరద బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో చొప్పున ఐదు రకాల నిత్యావసర సరుకులు ఇస్తున్నాం. కిలో పంచదార కూడా ఇస్తాం. వర్షాలతో ఉపాధి కోల్పోయే చేనేత కార్మికులకు, మత్స్యకారులకు 50కిలోల బియ్యం ఇస్తాం. ఎక్కడా, ఎవరికీ ఇబ్బంది లేకుండా చేయడానికి ప్రయత్నిస్తున్నాం. ఈ వర్షాలు, వరదలకు రాష్ట్రం మొత్తం అతలాకుతలమైంది. 50 ఏళ్లలో ఎప్పుడు పడనంత వర్షం పడింది. క్లౌడ్ బరస్టింగ్ ఇదే. ఒక్క రోజే రాష్ట్రవ్యాప్తంగా 28.5 సెంటీమీటర్ల అదనపు వాన పడింది. 3 జిల్లాల్లో 60%పైన, 19 జిల్లాల్లో 20-50% దాకా ఎక్కువ వర్షపాతం నమోదైంది. విజయవాడ-గుంటూరు హైవేపై కాజ వద్ద, విజయవాడ-హైదరాబాద్ మధ్య హైవేపై చెరువుల్ని తలపించేలా వరద వచ్చింది. ఇది చాలా బాధాకరం. భారీ వర్షాలు, వరదలపై ఎప్పటికప్పుడు టెలికాన్ఫరెన్స్‌లతో అధికారులను అప్రమత్తం చేశాం. ఈ పర్యవేక్షణ ద్వారా చాలా వరకు పరిస్థితిని నియంత్రించగలిగాం. కానీ దురదృష్టవశాత్తూ కొండచరియలు పడి ఐదుగురు, గుంటూరు జిల్లాలో కారు కొట్టుకుపోయి ముగ్గురు, మంగళగిరిలో ఒక మహిళ మృతి చెందారు. 9 మంది చనిపోయారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా ఏమన్నారంటే..

పై నుంచి వరద..

ఎన్టీఆర్ జిల్లాలో బుడమేరుతో పాటు ఖమ్మం, నల్గొండ జిల్లాల నుంచి వాగుల నుంచి వరద వస్తోంది. దీంతో ప్రకాశం బ్యారేజీకి 8.90 లక్షల క్యూసెక్కుల నీరు రానుంది. సోమవారానికి 10లక్షలకుపైగా క్యూసెక్కులు వచ్చే అవకాశం ఉంది. 10-12 లక్షల క్యూసెక్కుల వరద వస్తే తక్షణం ఎలా స్పందించాలన్న దానిపై దృష్టి పెట్టాం. బ్యారేజీ దిగువ ప్రాంతాల గ్రామాలు ముంపు బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేశాం. ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించి, భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నాం. 107 శిబిరాల్లో 15 వేల మంది ఉన్నారు. పంటలు దెబ్బతినకుండా వరద నీటిని మోటార్లతో బయటకు పంపే ఏర్పాట్లు చేస్తున్నాం. అవసరమైన చోట్లకు బోట్లు పంపాం. బుడమేరు వాగుకు పడిన గండిని ఇప్పుడు పూడ్చే అవకాశం లేదు. ఈ కారణంగా వీటీపీఎస్ వద్ద నీళ్లు వచ్చి విద్యుదుత్పత్తికి అంతరాయం కలిగింది. కొల్లేరు సరస్సుకు పోవలసిన నీరు కూడా పోని పరిస్థితి. లక్షా11వేల హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 7,360 హెక్టార్లలో ఉద్యాన పంటలు ముంపుబారిన పడ్డాయి. పెదకాకానిలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ దెబ్బతింది. పెద్ద ఎత్తున రోడ్లు కోత పడ్డాయి..

గత ఐదేళ్లలో శ్రద్ధపెట్టక..

గత ఐదేళ్లలో వాగులు, వంకలు, కాలువలపై ఎక్కడా శ్రద్ధ పెట్టలేదు. గండ్లు పడినా పూడ్చకపోవడం వల్ల ఇప్పుడు సమస్యలు వస్తున్నాయి. ఇలాంటి తప్పుడు పనులు చేసిన పార్టీయే మళ్లీ గగ్గోలు పెడుతోంది. మా కూటమి ప్రభుత్వం వచ్చి ఇంకా మూడు నెలలు కూడా కాలేదు.గత ఐదేళ్లు వరదలు వచ్చినప్పుడు కూడా ముఖ్యమంత్రి, మంత్రులు రాలేదు. ఈ రోజు ఏం, ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా క్షేత్రస్థాయిలో తిరుగుతున్నారు. బాధ్యత కలిగిన ప్రభుత్వమిది. ఇప్పటి వరకు కొన్ని తప్పులు జరిగినా.. భవిష్యత్‌లో జరగకుండా చూస్తాం. ఈ విషయంలో రాజీ లేదు. వర్షాలు తగ్గినా.. సోమవారం విద్యా సంస్థలకు సెలవు ప్రకటిస్తున్నాం. మంగళవారంకల్లా సాధారణ పరిస్థితికి చేరుకుంటుందని భావిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 14వేల సీసీ కెమేరాలు పెట్టాం. ఎక్కడ రోడ్డుపై నీరు నిలిచిందో సమాచారం తీసుకుంటున్నాం. డ్రోన్లు కూడా పంపి, ముంపు ప్రాంతాలను, పంటలను పరిశీలిస్తున్నాం. టెక్నాలజీని ఉపయోగించి, ఎక్కడికక్కడ పరిస్థితి తెలుసుకుంటున్నాం.

ప్రజల వినతులపై తక్షణం స్పందించాలి

భారీ వర్షాలు, వరదలపై డ్రోన్లు, సీసీ కెమేరాల ద్వారా రియల్ టైంలో సమస్యలను గుర్తించి, అధికార యంత్రాంగం తక్షణమే స్పందించాలి. మీడియాలో, సోషల్ మీడియాలో, వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే విజ్ఞప్తులపై కూడా తక్షణ స్పందన ఉండాలి. జిల్లాల నుంచి వస్తున్న సమాచారం ప్రకారం వర్షాల తీవ్రత తగ్గింది. అయితే ఇంకా వరదలోనే ఇళ్లు, కాలనీలు ఉన్నాయి. రహదారులపై ఉన్న నీటిని బయటకు పంపడమే కాదు. కాలనీలు, ప్రజల ఇళ్లల్లో ఉన్న వరద నీటి సమస్యను పరిష్కరించాలి. నేషనల్ హైవేలు కూడా వరద నీటితో చెరువులను తలపిస్తున్నాయి. హైవేస్ అథారిటీకి కూడా లేఖ రాసి, సమస్యపై సమన్వయంతో పని చేయాలి. వరద ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా పరిస్థితుల్ని సమీక్షించండి. డ్రోన్లతో పంట నష్టాన్ని అంచనా వేయాలి. ఒక్క ఎకరా కూడా మిస్ చేయొద్దు. ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకూడదు. దెబ్బతిన్న ఇళ్లు, పశునష్టాన్ని కూడా మదింపు చేయాలి. నష్టం అంచనాను కేంద్రానికి కూడా పంపాలి. రైతులు, బాధితకుటుంబాలకు వెంటనే సాయం అందించాలి. ప్రకాశం బ్యారేజ్ దిగువ ప్రాంతాల్లోని గ్రామాల్లో ప్రజల్ని అప్రమత్తం చేసి, పునరావాస కేంద్రాలకు పంపాలి.

తప్పించుకుంటే చర్యలు తప్పవ్

అధికారులకు అప్పగించిన బాధ్యతలను సరిగా నిర్వర్తించకుండా తప్పించుకుంటే చర్యలు తప్పవు. ప్రతి ఒక్కరికీ జవాబుదారీతనం ఉండాలి. మంత్రులు కూడా క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేలతో కలిసి పర్యటించి, ప్రజలకు భరోసా ఇవ్వాలి. బాధల్లో ఉన్న వారికి మనం చేసే పనితో సంతృప్తి కలగాలి. మంచి చేసి, సాయం అందిస్తే ప్రజలు గుర్తుపెట్టుకుంటారు. పనితీరు, వ్యవస్థలో లోపాలుంటే సరైన సమాచారం ప్రజలకు అందదు.

తక్షణ చర్యలతో నష్టాన్ని తగ్గించగలిగాం: హోం మంత్రి

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల పరిస్థితులపై సీఎం చంద్రబాబు అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతో అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ, యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుని, ప్రాణ, ఆస్తి నష్టం తగ్గించగలిగామని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత చెప్పారు. ఆదివారం తాడేపల్లిలోని విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి వరద పరిస్థితులను ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'ముంపు బారిన పడిన 294 గ్రామాలకు చెందిన 13,227 మందిని పునరావాస కేంద్రాలకు తరలించాం. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అధిక వర్షాలతో ఇబ్బంది పడుతున్న వారి కోసం 100 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఆయా ప్రాంతాల్లో 61 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశాం. పోలీస్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బెటాలియన్ల బృందాలు ముంపు ప్రాంతాల్లోని 600 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. 9ఎస్డీఆర్ఎఫ్, 8ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయ చర్యల్లో ఉన్నాయి. ఎటువంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు 5బోట్లు, ఒక హెలీకాప్టర్ సిద్ధంగా ఉంచాం' అని తెలిపారు.

బుడమేరు బాధితులకు అండగా ఉంటా!

విజయవాడ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'బుడమేరు వరద ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు బాధితుల చెంతనే బస చేస్తా. వరద పరిస్థితిపై గంట గంటకు సమీక్షిస్తా' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. విజయవాడలోని బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం, అర్ధరాత్రి మరోసారి ఆయన పర్యటించారు. బాధితులకు భరోసా ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. బాధితులకు భరోసా ఇచ్చి విశ్వాసం కల్పించడానికి ఇక్కడే ఉంటానన్నారు. కేంద్ర హోం మంత్రికి పరిస్థితిని వివరించానన్నారు. పది ఎన్డీఆర్ఎఫ్ టీంలు, 40 పవర్ బోట్లు, పది హెలికాప్టర్లు వస్తున్నాయని తెలిపారు. హోటళ్ల యజమానులు, అక్షయపాత్ర వారితో సంప్రదించి బాధితులకు ఆహారం తయారు చేయాలని కోరామన్నారు.బాధితుల కోసం 112, 1070తో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. విజయవాడలో ఉన్న అన్ని షాపుల నుంచి వాటర్ బాటిల్స్ తెప్పించాలని సీఎం సూచించారు.

భద్రతాసిబ్బంది వద్దంటున్నా..

చంద్రబాబు ఆదివారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. అయోధ్యనగర్, సింగ్ నగర్ మొత్తం 8 అడుగుల మేర ముంపులో ఉన్నాయి. ఆ లోపలకు వెళ్లి బాధితులను పరామర్శించాలని ఆయన భావించారు. భద్రతాసిబ్బంది అభ్యంతరం చెప్పినా వినలేదు. బోటులో వెళ్లి వరద బాధితులతో మాట్లాడారు. వారు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమకు ఆహారం, మందులు, తాగడానికి నీళ్లు అందలేదని చెప్పారు. దీనిపై ఆయన జిల్లా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.


ఆదివారం అర్ధరాత్రి సింగ్‌నగర్‌లో బోటులో ఆహారపదార్థాలను తీసుకెళ్తూ పరిస్థితి సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతిపై తప్పుడు ప్రచారం

- రాజధాని మునిగిపోవాలని వారి కోరిక
- నారాసుర రక్తచరిత్ర అని రాసినప్పుడే బొక్కలో పెట్టాల్సింది
- అది చేయలేదు కాబట్టే బరితెగించారు
- చంద్రబాబు నిప్పులు

అమరావతి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు పడితే.. అమరావతి మునిగిపోయిందని కొంత మంది తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. 'అమరావతి మునిగిపోవాలని వాళ్ల కోరిక. అమరావతి నాశనం కావాలని ఉంటే రాసుకోండి. కానీ దుష్ప్రచారం చేస్తే సహించేది లేదు. తప్పుడు వార్తలు రాస్తే మాత్రం సహించేది లేదు. దాన్ని రుజువు చేయాల్సిన బాధ్యత కూడా వాళ్లపై ఉంది' అని చెప్పారు. ఒక ముఖ్యమంత్రిగా తననే మభ్యపెట్టారని చంద్రబాబు అన్నారు. 'బాబాయిని గొడ్డలితో చంపేసి, గుండెపోటని నమ్మించారు. రెండో రోజున నా పేరు పెట్టి నారాసుర రక్తచరిత్ర అని రాశారు. ఆరోజే రుజువు చేయమని బొక్కలో పెట్టాల్సింది. అది చేయలేదు కాబట్టే బరితెగించారు. ఇప్పుడు కూడా అలాంటి ఘటనలు జరుగుతున్నాయి. బీ కేర్ ఫుల్' అని హెచ్చరించారు. గుడ్లవల్లేరు కళాశాల లాంటి ఘటనలు పునరావృతమైతే కఠినంగా వ్యవహరిస్తామని సీఎం హెచ్చరించారు. 'ఎక్కడైనా ఆధారం ఉంటే ఇవ్వాలి. తెలిస్తే చెప్పాలి. కావాలని దుష్ప్రచారం చేయడం చాలా తప్పు. ఆడ బిడ్డల శీలాన్ని కూడా తాకట్టు పెట్టేలా, అవహేళన చేసే విధంగా తప్పుడు ప్రచారం చేయడం కరెక్ట్ కాదు. ఈ ఘటనపై మాత్రం ఎవరితోనూ రాజీపడం. ఢిల్లీలోని కంప్యూటర్ ఇంజనీరింగ్ రెస్పాన్స్‌బులిటీ సంస్థ శాస్త్రవేత్తలతో మాట్లాడాం. అక్కడి నుంచి సాంకేతిక నిపుణుడిని రప్పించి, పోలీసు విచారణలో తేలిన సమాచారమంతా తీసుకుని, అనుమానస్పద వ్యక్తుల ఫోన్లు, ఐప్యాడ్‌లు తీసుకుని, అంతా విశ్లేషించి, వాస్తవాలు ఉంటే ఎవరి ప్రమేయం ఉన్నా ఎంత కఠినంగా వ్యవహరిస్తామో తర్వాత తెలుస్తుంది' అని అన్నారు.

ఏదో కావాలనే కోరిక లేదు

30 ఏళ్ల క్రితం ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణం చేసిన రోజు ఇది (సెప్టెంబరు 1) అని చంద్రబాబు గతాన్ని గుర్తు చేసుకున్నారు. 'అప్పడప్పుడు నేను అన్నట్టు 1995 అని.. ఆ రోజులా ఈ రోజు పని చేయాలని నా కోరిక. నాకు ఏదో కావాలని కోరిక లేదు. ప్రతి ఒక్క అవకాశం రాష్ట్రం కోసం, తెలుగు ప్రజలకోసం పని చేస్తాం. అంతేకంటే మెరుగ్గా పని చేయాలన్నదే నా ఆకాంక్ష అని పేర్కొన్నారు.

వ్యవస్థల అవస్థలు!

- యంత్రాంగాన్ని వీడని ఐదేళ్ల అలసత్వం
- బుడమేరు ముంపును పసిగట్టలేని నిర్లక్ష్యం
- శాఖల మధ్య సమన్వయ లోపం
- నగర పాలక సంస్థలో స్తబ్ధత
- సీఎం రంగంలోకి దిగాకే మారిన పరిస్థితి

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

అధికార యంత్రాంగాన్ని ఐదేళ్ల అలసత్వం వీడలేదా!? ఎవరికి వారే అనే సమన్వయం లోపం ఇంకానా? విజయవాడలో ఆదివారం బుడమేరు సృష్టించిన విలయం చూస్తుంటే ఇవే సందేహాలు తలెత్తుతున్నాయి. విపత్తు స్పందనలో ఏపీ యంత్రాంగానికి ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. కానీ.. గత ఐదేళ్లలో ఇదంతా మాయమైపోయింది. బుడమేరు విపత్తుతో ఇది మరోసారి రుజువైంది. ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు రంగంలోకి దిగేదాకా పరిస్థితిలో మార్పు కనిపించలేదు. ఉమ్మడి కృష్ణాతోపాటు తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. అందులోనూ... శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు అతి భారీ వర్షం కురిసింది. ఇదంతా కృష్ణా, బుడమేరు పరివాహక ప్రాంతమే. పైనుంచి వస్తున్న వరదతోపాటు... స్థానిక వర్షాలతో కృష్ణా నది పోటెత్తుతోంది. ఈ క్రమంలో... బెజవాడపై బుడమేరు విరుచుకుపడే అవకాశముందని అధికార యంత్రాంగం ముందుగానే గుర్తించాలి. కానీ... ఇవేవీ జరగలేదు. మరోవైపు, ఆదివారం వరద మొదలైన తర్వాత కూడా సంబంధిత శాఖల మధ్య సమన్వయం కనిపించలేదు. 2011లో రూపొందించిన నగర విపత్తు ప్రణాళిక ప్రకారం నగరపాలక సంస్థ, పోలీసు శాఖ, జిల్లా యంత్రాంగం కలిసి పని చేయాలి. ఆదివారం విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌లో స్తబ్ధత కనిపించింది. ఒకవైపు వరద ముంచుతున్నా యంత్రాంగం దాదాపుగా చేష్టలుడిగి కూర్చుంది. సహాయ చర్యలే మొదలు కాలేదు. ముఖ్యమంత్రి సమీక్షించి నేరుగా మంత్రులను రంగంలోకి దించారు. ఆ తర్వాత ఆయనే స్వయంగా బోటులో వరద బాధిత ప్రాంతాల్లో పర్యవేక్షించారు. యంత్రాంగానికి తగిన ఆదేశాలు జారీ చేశారు. ఆ తర్వాతే పరిస్థితిలో మార్పు కనిపించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd Printed and Published at Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: K. Srinivas. Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.